ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY








గురువారం 27 ఆగస్టు 2026 | సంపుటి: 28 సంచిక: 137

Thursday 27 August 2026 | Vol.No 28 Issue No .137

హైదరాబాద్ | Hyderabad

పేజీలు: 12+12 | వెల: రూ.1.00

PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

www.visionandhra.in


# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

## ఢిల్లీలో కూతురికి మంత్రి పదవి కోసం లాబీయింగ్

- హైదరాబాద్‌లో ప్రజా భవన్‌లో రహస్య భేటీ!
- కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ
- మున్నూరు కాపు కోటా రగడ!
- కొండా సురేఖ స్థానంలో గద్వాల విజయలక్ష్మికి ఛాన్స్ ఇవ్వాలని కేకే పట్టు
- అటు కొండా మురళి, కోమటిరెడ్డి, భట్టి, ఉత్తమ్ క్లోజ్ డోర్ మీటింగ్ కలకలం....

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 26:





తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు ఒకే ఒక్క మాట – మంత్రి పదవి! మంత్రివర్గ విస్తరణ ఊసు వినిపించగానే నేతలంతా ఢిల్లీకి క్యూ కడుతున్నారు. కులం పేరు, మహిళా కోటా పేరుతో అధిష్టానం చుట్టూ మిగతా 2లో..

# తెలంగాణ సమ్మిట్ కోసం వార్ రూమ్

- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం భట్టి
- ప్రజాభవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష



హైదరాబాద్,ఆగస్ట్26 : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026–ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో మిగతా 2లో..



# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగివున్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు
- ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికుల దుర్మరణం
- మృతులంతా ఎపికి చెందిన వారిగా గుర్తింపు
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్
- తక్షణ సహాయక చర్యలకు ఆదేశం... మిగతా 2లో..

# కీలక ఖనిజాలపై సింగరేణి దృష్టి సారించడంలో వేగం

- నైని ప్రాజెక్ట్ స్ఫూర్తితో దేవదుర్గంపై దృష్టి,
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్,ఆగస్ట్26 :కర్నాటకలోని దేవదుర్గం బంగారం మరియు రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ కార్యకలాపాలను వేగవంతం చేయాలని సింగరేణి అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో సింగరేణి సంస్థ కొత్త ప్రాజెక్టులు మరియు భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఆయన ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కర్ణాటకలో సింగరేణికి దక్కిన దేవదుర్గం బంగారం మరియు రాగి అన్వేషణ బ్లాక్‌పై ఈ మిగతా 2లో..

# వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

- సోషల్ ఇంజనీరింగ్ నాటకాలకు తెర
- అప్రమత్తంగా ఉండాలన్న సిపి సజ్జన్నార్



హైదరాబాద్,ఆగస్ట్26 : హైదరాబాద్ నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ఫోన్లను దొంగిలిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, మిగతా 2లో..


# 22ఎను వెంటనే తొలగించాలి

- లేకుంటే సచివాలయం ముట్టడిస్తాం,
- భూకబ్జాల హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ
- రేవంత్ ప్రభుత్వం భూ అమ్మకాలతో బిజీ,
- బిఆర్ఎస్ నేత హరీస్ రావు విమర్శలు

హైదరాబాద్,ఆగస్ట్26 : కేసీఆర్ పాలన ప్రజల కేంద్రంగా సాగితే.. రేవంత్ పాలన భూముల కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్ ప్రభుత్వం దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.



పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు.. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములన్నీ అమ్ముకుంటూ.. భావి తరాలకు జాగా లేకుండా చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల ఆస్తులనేమో 22–ఏ నిషేధిత మిగతా 2లో..



# నేపాల్‌లో ఆకస్మిక వరదలు

- వరదల్లో వందలాది మంది గల్లంతు
- అందులో 105 మంది భీరతీయులున్నట్లు అంచనా
- టిబెట్‌లో భారీ వర్షాలతో ఉప్పొంగిన కోశీనది
- బురదమయంగా మారిన కొండతీర ప్రాంతం

ఖాట్మండ్,ఆగస్ట్26 : నేపాల్‌లో బుధవారం ఉదయం అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరదలు అనేక మందిని పొట్టనపెట్టుకున్నాయి. 105 మంది భారతీయులు కూడా ఈ విపత్తులో గల్లంతయ్యారు. ఓ అంచనా ప్రకారం 1500 మంది గల్లంతయ్యారని అంటున్నారు. చైనాతో సరిహద్దుకు సమీపంలోని మిగతా 2లో..

## నేపాల్ ప్రధానికి మోడీ ఫోన్

- వరదలపై ఆరా తీసిన భారత ప్రధాని
- సహాయ సిబ్బందిని పంపుతామని హామీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు.

# ఎల్‌నినోతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు

- పట్టించుకోని సిఎం చంద్రబాబు
- విరుచుకుపడ్డ వైసపి అధ్యక్షుడు జగన్



అమరావతి,ఆగస్ట్26 : రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. చంద్రబాబు నిర్వాకం చూస్తే ప్రజలకు అర్థం అవుతుందని అన్నారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులు, డీఎస్సీ, ఏపీపీఎస్సీ అంశాలపై ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. గత వారం డీఎస్సీ, ఏపీపీఎస్సీ వ్యవహారాలపై సీబీఐ విచారణకు సవాల్ చేసినప్పటికీ.. ప్రభుత్వం దానిపై స్పందించకుండా, అసలు అంశాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం సరైన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా మిగతా 2లో..

# జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

- కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ
- ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం
- వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, ఆగస్ట్ 26 : వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవని ప్రాజెక్ట్'పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య మిగతా 2లో..

## తెలంగాణ సమ్మిట్ కోసం వార్ రూమ్

భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవాలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడి దారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

సూర్యాపేట,ఆగస్ట్26 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేల్రప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

## వృద్ధులు లక్ష్యంగా సైబర్ ముఠాలు

అమాయకులను మొదట గుర్తిస్తారని.. స్క్రీన్ లాక్ ఎలా ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి నిశితంగా గమనించి అనంతరం చోరీ చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి.. పాస్‌వర్డ్ తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా 'సోషల్ ఇంజినీరింగ్' నాటకాలకు తెరలేపుతారని సీపీ చెప్పారు. బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి.. తాము బస్సు కండక్టర్/ డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని.. వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని +-ంటున్నారని చెబుతారు. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక పోర్టల్ లిలిలి.ఇఅఠ.ఙుఉ.తిలో మొబైల్ ఎఐఇఐ నంబర్ నమోదు చేసి ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయించాలి. ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి' అని సీపీ సూచించారు.

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'



సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంపైనా.. డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్ధవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజలు మెసేజ్ ద్వారా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చెప్పారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసులు తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కీలక ఖనిజాలపై సింగరేణి దృష్టి సారించడంలో వేగం

సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధి ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమల రావు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు మరియు అన్వేషణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించేందుకు, గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గం బ్లాక్‌ను సందర్శించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు మరియు ఇతర సహకారాన్ని పొందడంలో కర్ణాటక ప్రభుత్వం నుండి పూర్తి సహకారాన్ని కోరతామని ఆయన చెప్పారు. దేవదుర్గం ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా, బొగ్గు రంగం నుండి కీలక మరియు వ్యూహాత్మక ఖనిజాల రంగానికి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని ఆయన పేర్కొన్నారు. మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి, ఇకపై కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక మరియు వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, తవ్వకాల వైపు విస్తరించాలని భట్టి విక్రమార్క నొక్కి చెప్పారు. ఈ ప్రయత్నంలో తెలంగాణ ప్రభుత్వం సాధ్యమైనంత అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణకు వెన్నెముకగా నిలిచిన ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని, భవిష్యత్ తరాలకు ఒక బలమైన సంస్థగా అందించేలా మరింత లాభదాయకమైన మరియు శక్తివంతమైన సంస్థగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.


**దేవదుర్గంపై ప్రత్యేక దృష్టి**

దేవదుర్గం బంగారం మరియు రాగి ఖనిజ బ్లాక్‌లో ఇప్పటివరకు చేపట్టిన పనులు, అక్కడి భౌగోళిక పరిస్థితులు మరియు ఖనిజ నిల్వల అంచనాకు అవసరమైన తదుపరి చర్యల గురించి ఉప ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్వేషణ ప్రక్రియను వేగవంతం చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు మరియు సవాళ్లను స్వయంగా తెలుసుకునేందుకు, ఆయన గురువారం సింగరేణి ఉన్నతాధికారుల బృందంతో కలిసి దేవదుర్గం బ్లాక్‌ను సందర్శించనున్నారు. ఖనిజ అన్వేషణను వేగవంతం చేయడానికి అవసరమైన సహకారంపై కర్ణాటక ప్రభుత్వంతో కూడా చర్చలు జరుపుతామని ఆయన తెలిపారు. సింగరేణిని 'కీలక ఖనిజాల' (ఎతీఙ్‌అఝ్రీ ఎఱఅవతీఱశ్రీం) రంగంలో విస్తరించడానికి 'దేవదుర్గ బ్లాక్'ను ఒక కీలక అవకాశంగా మలచుకోవాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అన్ని ఖనిజ వేలం ప్రక్రియల్లోనూ పాల్గొనాలి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ తమ కార్యకలాపాలను విస్తరించాలని భట్టి విక్రమార్క సింగరేణిని ఆదేశించారు. జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న బొగ్గు, కీలక ఖనిజాల వేలం ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని, సింగరేణికి ప్రయోజనకరమైన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా, ఇతర ఖనిజాల తవ్వకాలలోనూ బలమైన ఉనికిని చాటుకోవాలని ఆయన అన్నారు. వెనేడియం, టైటానియం వంటి కీలక వనరులు కలిగిన ఖనిజ బ్లాకులు త్వరలో వేలానికి రానున్నందున, వాటిని దక్కించుకునేందుకు ముందస్తుగా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రయత్నాలకు 'ప్రజా ప్రభుత్వం' అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ఇంధన, పారిశ్రామిక రంగాలలో ప్రపంచవ్యాప్తంగా వేగంగా వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని, రాగి (ఛశీజూజూవతీ), గ్రాఫైట్, లిథియం మరియు కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల తవ్వకానికి సంబంధించిన అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి సింగరేణిని కోరారు. భవిష్యత్తులో ఈ ఖనిజాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని సంస్థ కొత్త అవకాశాలను గుర్తించాలని ఆయన సూచించారు.

# 22ఎను వెంటనే తొలగించాలి

జాబితాలోకి.. ప్రభుత్వ భూములనేమో రేవంత్ సోదరుల చేతుల్లోకి నెడుతున్నారని ఆక్షేపించారు. లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు కమిషన్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎప్పుడు హైడ్రా వస్తుందో.. ఎప్పుడు 22-ఏ కింద భూమి లాక్కుంటారోనని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను, హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22-ఏలో చేర్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ 30 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. బ్రోకర్లకు ఎవరూ ఒక్క రూపాయి ఇవ్వొద్దని.. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత బీఆర్ఎస్‌దేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో సెక్షన్ 22ఏ బాధితుల సమావేశం జరిగింది. కేపీహెచ్‌బీ ఎస్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ సమావేశంలో బాధితులతో హరీశ్‌రావు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో సెక్షన్ 22ఏ తీసుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రజలు కేంద్రంగా పరిపాలన కొనసాగిందని తెలిపారు. అదే రేవంత్ పాలనలో భూములు కేంద్రంగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఏం కావాలో ఆలోచించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు, 24 గంటల కరెంటు అందించారని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కేసీఆర్ తపన పడ్డారని చెప్పారు. కేసీఆర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచారని అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చారని తెలిపారు. దేశానికే తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాలను తలదన్ని, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని గుర్తుచేశారు. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే కాజేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాత్రికి రాత్రి భూములన్నీ నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గుండెమీద చెయ్యేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడు హైడ్రా వస్తదో.. ఎప్పుడు సెక్షన్ 22ఏ వస్తదో అని భయంలో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ లో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని హరీశ్‌రావు కొనియాడారు. యావత్ దేశం హైదరాబాద్ వైపు చూసేలా కేసీఆర్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మంటగలిసి పోయిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డివి తుగ్లక్ నిర్ణయాలు అని విమర్శించారు. అవసరం పడి అమ్ముకుందామంటే ఎవరైనా కొనే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మనవాళ్లు ఇక్కడ ఇండ్లు కొనడం ఆపేశారని తెలిపారు. పైసలుంటే అమెరికాలోనే పెట్టుబడులు పెట్టుకుంటున్నారని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా కోటి ఎకరాలను సెక్షన్ 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను ఈ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. కాలనీలకు కాలనీలు 22ఏ జాబితాలోకి వెళ్లాయని అన్నారు. 98 శాతం భూములను తీసేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడని అన్నారు. సెక్షన్ 22 ఏ కారణంగా చాలామందికి లోన్లు రాలేదని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు బాధపడాలని ప్రశ్నించారు. సెక్షన్ 22ఏ పెట్టింది మీరే.. తీసేయాల్సింది కూడా మీరే అని స్పష్టం చేశారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని నిలదీశారు. మీ తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. ప్రజలు ఎందుకు దరఖాస్తులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. మీరే చేసిన తప్పునకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని అడిగారు. తప్పు చేసింది మీరు.. సరిదిద్దుకోవాల్సింది కూడా మీరేనని పునరుద్ఘాటించారు. ప్రజల నుంచి 30 శాతం కమిషన్లు గుంజుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి బ్రోకర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏజెంట్లు కాలనీల్లో తిరుగుతున్నారని తెలిపారు. ప్రజలు ఒక్క రూపాయి కూడా బ్రోకర్లకు ఇవ్వద్దని సూచించారు. మీ ఆస్తులను కాపాడి మీకు అప్పగించే బాధ్యత మాది అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ మొదలవుతుందని తెలిపారు. అసెంబ్లీలో సెక్షన్ 22ఏపై పోరాడతామని పేర్కొన్నారు. కబ్జాదారులే ధర్నాలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ పాలనలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మెడలు వంచి మీకు న్యాయం చేసే బాధ్యత మాపై ఉందని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెక్షన్ 22ఏను తొలగింపజేస్తామని స్పష్టం చేశారు. మా పోరాటం ప్రజల కోసం.. రాజకీయాల కోసం కాదు అని అన్నారు. భేషరతుగా సెక్షన్ 22ఏ జాబితాలోని భూములన్నీ తొలగించకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

## నేపాల్‌లో ఆకస్మిక వరదలు



రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో ఒక్కసారిగా వరద పొటెత్తడంతో తీరంలోని అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో నేపాల్‌కు దిగువన ఉన్న బిహార్, యూపీ రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మరోవైపు, ఈ అకస్మిక వరదలకు కారణం ఏంటో తెలుసుకునేందుకు నేపాల్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఆకస్మిక వరదలు కేవలం గంటల వ్యవధిలోనే విరుచుకుపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఒక్కసారిగా భారీ స్థాయిలో కుండపోత వర్షం కురిసినా, లేదా నదీప్రవాహానికి అడ్డుగా ఉండే కొండచరియలు విరిగి పడిన సందర్భాల్లో కూడా ఆకస్మిక వరదుల దిగువన ఉన్న ప్రాంతాలను ముంచెత్తుతాయి. కొండల్లోని మంచు కరగడంతో ఏర్పడే గ్లేషియల్ సరస్సులు అస్థిరమై ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చిన సందర్భాల్లో కూడా లోతట్టు ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తుతాయి. అంతెత్తున ఉండే కొండల నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నీటి ప్రవాహానికి తన దారిలో ఉన్న అన్ని నిర్మాణాలను నేలమట్టం చేయగల శక్తి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, రసువా జిల్లాలో వర్షాలకు అవకాశం తక్కువని అక్కడి వాతావరణ శాఖ ముందే అంచనా వేసింది. కానీ నేపాల్‌కు ఎగువన ఉన్న టిబెట్‌లో భారీ వర్షం కురిసిన విషయం శాటిలైట్ చిత్రాల్లో బయటపడ్డట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయమై తమను ముందస్తుగా హెచ్చరించడంలో చైనా విఫలమైందని ఇప్పటికే నేపాల్ జర్నలిస్టు ఒకరు నెట్టింట తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాలయాల్లో ఉన్న నేపాల్‌లో భారీ పర్వతాలు, వాటి నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నదులతో ఎల్లప్పుడూ ముప్పు పొంచి ఉంటుంది. ముఖ్యంగా వానాకాలంలో కురిసే వర్షాల కారణంగా కొండ కోనల్లో పోటెత్తే వరదలు చూస్తుండగానే మహోగ్రరూపం దాలుస్తాయి. ఇది చాలదన్నట్టు వాతావరణ మార్పులు పరిస్థితులను మరింత జటిలం చేస్తున్నాయి. భూతాపం పెరుగుతుండటంతో నేపాల్‌లోని కొండలపై మంచు కరిగిపోతోంది. హిమనదాలు కనుమరుగు అవుతున్నాయి. ఫలితంగా కొండలపై భారీ గ్లేషియల్ సరస్సులు ఏర్పడుతున్నాయి. కొండప్రాంతాలు సహజంగా అస్థిరంగా ఉంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో కొండచరియుల విరిగిపడ్డా లేక కాస్త ఎక్కువ వర్షం కురిసినా సరస్సులు కట్టలు తెంచుకుని దిగువనున్న ప్రాంతాలను ముంచెత్తే అవకావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా నేపాల్‌లో భారీ వర్షాలు అలజడి సృష్టిస్తున్నాయి. ఆకస్మిక వరదలు ఊళ్లను ముంచెత్తుతున్నాయి. ఉధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన ఆకస్మిక వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జ్‌లు, ప్రాజెక్ట్‌లు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు మొదలయ్యాయి. అధికారులు 15 హెలికాప్టర్లను రంగంలోకి దించారు. సహాయక సిబ్బంది బుసి, తుసు ప్రాంతాల్లో 20 మందిని రక్షించారు. గాయపడ్డ వారిని మచిలి ట్రైనింగ్ క్యాంప్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారు వెంటనే అక్కడినుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు ఇప్పటి వరకు 8 మృతదేహాలను నీటినుంచి స్వాధీనం చేసుకున్నారు.

## నేపాల్ ప్రధానికి మోడీ ఫోన్

ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు. పోస్టులో.. 'ప్రధాన మంత్రి బాలేంద్ర షాతో మాట్లాడాను. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశాను. ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారు. నేపాల్‌కు సాధ్యమైనంత వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సహాయక, రక్షణ చర్యలపై మా బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు. ఉధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జ్‌లు, ప్రాజెక్ట్‌లు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది.

## ఎల్‌నినోతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు

వర్షపాతం లోటు మైనస్ 52 శాతంగా ఉందని పేర్కొన్నారు. కోస్తాంధ్రలో కూడా మైనస్ 47 శాతం వర్షపాతం లోటు నమోదైందని జగన్ తెలిపారు. 'గత వారం డీఎస్సీ, ఏపీపీఎస్సీపై సీబీఐ విచారణకు సవాలు చేశాం. దానిపై సీఎం చంద్రబాబు ఏమీ మాట్లాడరు. కోడు గుడ్డు మీద ఈకలు పీకినట్లుగా వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం స్పందించటం లేదు. బీసీ రిజర్వేషన్స్ పై చంద్రబాబు డ్రామాలు చేస్తున్నారు. పోలీసులే పాత్రధారులై గంజాయి విక్రయాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కరువు డేంజర్ బెల్స్ మోగుతున్నా స్పందన లేదు. జూన్, జూలై, ఆగష్టు వరకు వర్షపాతం లోటు మైనస్ 52 శాతంగా ఉంది. కోస్తాంధ్రలో వర్షపాతం లోటు మైనస్ 47 శాతం. ఏ జిల్లాలో చూసినా వర్షపాత లోటు ఉన్నా.. కుంభకర్ణుడిలా చంద్రబాబు నిద్ర నటిస్తున్నారు' అని వైఎస్ జగన్ ఫైర్ అయ్యారు. 'రాష్ట్రంలో 688 మండలాలకు గానూ 625 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 91 శాతం రాష్ట్రం లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంటుంది. 434 మండలాలు లోటు వర్షపాతం కాగా.. 191 మండలాల్లో ఎక్కువ తీవ్రత కనిపిస్తుంది. వెన్నుపోటు పార్టీ నాయకుడు చంద్రబాబు ఇలాంటి పరిస్థితి ఉందని గుర్తించటానికి కూడా ఇష్టపడటం లేదు. రైతులను, ప్రజలను ఆదుకోవడానికి ఏ మాత్రం అడుగులు వేయటం లేదు. రాష్ట్రంలో 63 లక్షల ఎకరాలకు గానూ 80 శాతం మాత్రమే సాగైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత మధ్యలో జూలై 10న పంటలకు నీళ్లు ఇస్తామని మంత్రులు ఫోటోలకు ఫోజులు ఇచ్చారు. ప్రకాశం బ్యారేజ్ దగ్గర పబ్లిసిటీ స్టంట్ చేశారు. ఈ ఏడాది నీళ్లు ఇస్తారని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పంటలు సాగుచేశారు. వేసిన నార్లు మొత్తం ఎండిన పరిస్థితి ఉంది' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. 'ఎల్‌నినో ఎఫెక్ట్ ఉందని తెలిసినా సరైన ప్రణాళికలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. వర్షాలు లేకుండా సంక్షోభం వస్తే చంద్రబాబు మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారు.

రాయలసీమకు నీళ్లిచ్చే విషయంలో చంద్రబాబు ఆలోచన దుర్మార్గంగా ఉంది. ఆగష్టు 11న శ్రీశైలం ప్రాజెక్టుకు 880 అడుగుల నీళ్లు వచ్చాయి. అవకాశం ఉన్నా పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు నీళ్లు విడుదల చేయలేదు. నీటిమట్టం తగ్గేకొద్దీ పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉండదు. శ్రీశైలం నుంచి ఎడాపెడా తెలంగాణ, ఆంధ్రా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఎల్‌నినో ఎఫెక్ట్ తో కరువు అని కనిపిస్తుంది. శ్రీశైలం నుంచి నీళ్లు మొత్తం మూడు వారాల్లో 850 అడుగుల దిగువకు చేరుతుంది. రోజుకు 3.5 టీఎంసీల లెక్కన వాడుతున్నారు. రాయలసీమ ప్రాజెక్టుల్లో నీరు దాదాపుగా డెడ్ స్టోరేజ్ కు వచ్చాయి' అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

ప్రదక్షిణలు చేస్తున్నారు.

**ఢిల్లీలో ఏం జరుగుతోంది?**

సీనియర్ నేత కే.కేశవరావు తన కూతురు, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి కి మంత్రి పదవి తెచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. రాజకీయ వర్గాల్లో చర్చ ప్రకారం – కొండా సురేఖను తొలగిస్తే ఆ స్థానంలో తన కూతురికి ఇవ్వాలని, దీనివల్ల మున్నూరు కాపు ప్లస్ మహిళా కోటా రెండూ ఒకేసారి భర్తీ అవుతాయని ఆయన అధిష్టానానికి వివరిస్తున్నారట. "మున్నూరు కాపు కోటాలో నా కూతురికి మంత్రి పదవి ఇవ్వండి ప్లీజ్" అనే స్థాయిలో ఆయన లాబీయింగ్ చేస్తున్నట్టు ఢిల్లీ టాక్.

**హైదరాబాద్‌లో ఏం జరిగింది? ప్రజా భవన్‌లో కీలక భేటీ!**

అటు ఢిల్లీలో ఈ లాబీయింగ్ నడుస్తుండగానే ఇటు హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో కీలక నేతల రహస్య భేటీ కలకలం రేపింది.

ప్రజా భవన్‌లో మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి భేటీ అయ్యారు. ఇటీవల పార్టీలో జరిగిన పరిణామాలు, కొండా సురేఖ వ్యవహారం, సుస్మిత వివాదంపై చర్చించినట్టు తెలుస్తోంది. దీనిపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందిస్తూ – "నేను నా నియోజకవర్గ పెండింగ్ బిల్లుల కోసమే భట్టిని కలిశా. నేను వెళ్లేసరికి అక్కడ కొండా మురళి ఉన్నారు. దీనికి రాజకీయ భేటీతో సంబంధం లేదు" అని కవర్ చేసే ప్రయత్నం చేశారు.

**కొండా మురళి సంచలన వ్యాఖ్యలు**
**- కూతురితో తెగతెంపులా?**

భేటీ అనంతరం కొండా మురళి కీలక వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదు. మా కూతురు వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వరకు నేను మాట్లాడను. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ పట్ల మాకు గౌరవం, విశ్వాసం ఉంది. నేను వరంగల్ కూడా పోలేదు. సుస్మిత వివాదంతో మాకు సంబంధం లేదు. నా కూతురు ప్లాన్ నాకు ఎలా తెలుస్తుంది? సుస్మిత ప్లాన్ ఏ లో మాట్లాడింది, ప్లాన్ బి లో ఏం చేస్తుందో నాకు తెలియదు. బిఆర్ఎస్ నుండి కవిత కూడా వెళ్లిపోయింది. భట్టితో యోగక్షేమాలు మాట్లాడుకున్నాం" అని అన్నారు.

**అసలు కథ ఏంటి?**

ఒకవైపు తండ్రి తన కూతురికి మంత్రి పదవి కోసం ఢిల్లీలో తిరుగుతుంటే, మరోవైపు మరో తండ్రి తన కూతురి వ్యాఖ్యలకు దూరం జరుగుతున్నాడు. మొత్తంగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు వారసుల చుట్టూనే రాజకీయం తిరుగుతోంది. పదవుల కోసం నేతలు వందన లేకుండా బహిరంగంగా తన్నుకుంటున్న తీరు పార్టీకి తలనొప్పిగా మారింది.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ఆర్థికపతనం దిశగా ..అమెరికా ఫస్ట్ నినాదం !

ఇరాన్‌తో జరిగిన యుద్ధం, అంతర్జాతీయంగా వివిధ దేశాలతో అనుసరిస్తున్న విధానా వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోంది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల సామాన్య పౌరులను చికాకు పెట్టిస్తోంది. ఇప్పటికే అక్కడ గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యావసర ధరలు కూడా పెరిగాయి. ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికా ఓ రకంగా చతికిలపడిందనే చెప్పాలి. ఈ అనుభవం రష్యాకు కూడా వచ్చింది. ఉక్రెయిన్‌పై దాడులు రష్యానూ దెబ్బతీసాయి. యుద్ధాలతో విజయం దక్కకపోగా... ఆర్థిక రంగంలో వైఫల్యాలలు తీవ్రమవుతున్నాయి. దేశంలో సగటు పౌరులు ట్రంప్‌ను ఎన్నుకున్నందుకు బాధ పడుతున్నారు. ప్రపంచంతో సక్రమమైన సంబంధాలు కోల్పోవడంతో వారు అనేక రంగాల్లో ఇబ్బందులు పడుతున్నారు.వలసలపై ఆంక్షలు, ప్రపంచ దేశాలపై విచక్షణారహిత సుంకాల సమరం అమెరికాను అన్ని విధాల దెబ్బతీస్తున్నాయి. భౌగోళిక రాజకీయాలలోను, అంతర్జాతీయ ఆర్థిక రంగంలోనూ అభ్యుదయానికి కాకుండా అరాచకానికి ట్రంప్ కారకుడు అవుతున్నారు. భారత్ సహా వర్ధమాన దేశాలన్నీ ఆర్థిక సంక్షోభం అంచుకు చేరుతున్నాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా అమెరికాను కూడా ముంచుతున్నాయి. అయినా ట్రంప్ ఇవేవీ గమనించడం లేదు. వచ్చే నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లుతున్న అమెరికా ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తుందా అనుమానాలు బయలుదేరాయి. లేక కొత్త ప్రస్థానాన్ని ప్రారంభిస్తుందా అని ప్రపంచమంతా ఎదురుచూస్తున్న విషయమిది. అమెరికాకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది వేరుగా చర్చించుకోవాల్సిన అవసరం లేదు. నిరంతర యుద్ధ వ్యయాలు, సంపన్న వర్గాలకు పెద్ద ఎత్తున పన్ను కోతలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల మూలంగా తీవ్రమవుతున్న ఇంధన, సరఫరాల సంక్షోభాలు కూడా తోడయ్యాయి. అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ప్రాబల్యం తగ్గడం మొదలైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య విధానాలు పరిస్థితిని మరింతగా దిగజార్చి వేస్తున్నాయి. ఫలితంగా అమెరికా జాతీయ రుణం ఆ దేశ స్థూల దేశియోత్పత్తిలో 126 శాతంగా ఉన్నది. పోటీదారు అయిన చైనా జాతీయ రుణం జీడీపీలో 83 శాతంగా మాత్రమే ఉండగా జపాన్ జాతీయ రుణం జీడీపీలో ఇంచుమించు 250 శాతంగా ఉన్నది. అయితే జపాన్ ప్రభుత్వం తీసుకున్న రుణాలలో అత్యధికం దేశీయ



బ్యాంకులు, మదుపుదారుల నుంచి తీసుకున్నవే. అమెరికా తనకు అవసరమైన నిధులను చాలా వరకు ఫెడరల్ రిజర్వ్ బాండ్లను విక్రయించడం ద్వారా సమకూర్చుకుంటున్నది. ఈ బాండ్ల కొనుగోలుదారు లలో అత్యధికులు విదేశీ సంస్థలు, మదుపుదారులే కావడం గమనార్హం. ఈ భారీ రుణంపై ఏటా 1 లక్ష కోట్ల డాలర్లకు పైగా వడ్డీ చెల్లిస్తున్నారు. అమెరికా ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేసినవారు నష్టాలు వాటిల్ల వచ్చనే భయంతో వాటిని విక్రయిస్తున్నారు. తక్కువ వడ్డీ రేట్లకు ఆ బాండ్లను మరిన్ని కొనడానికి నిరాకరి స్తున్నారు. ఈ పరిస్థితి కూడా అమెరికా రుణ సంక్షోభానికి దారితీసింది. దీని నుంచి బయట పడేందుకు తాను అమ్మిన బాండ్లను తానే కొనుగోలు చేసేందుకు అమెరికా సంసిద్ధమయినప్పటికీ పరిస్థితి మెరుగు పడడం లేదు. ఫెడరల్ ప్రభుత్వం తీసుకునే రుణం గరిష్ఠంగా 41.1 ట్రిలియన్ డాలర్లకు మించకూడదని గత ఏడాది అమెరికా కాంగ్రెస్ పరిమితి విధించింది. అయితే అంతకంతకూ పెరుగుతోన్న జాతీయ రుణ పరిమాణం ఆ గరిష్ఠ పరిమితిని 2027 ద్వితీయార్థంలో దాటుతుందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇదంతా కూడా వాణిజ్య విధానాల కారణంగానే అని చెప్పుకోవాలి. వివిధ దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించడంతో స్వేచ్ఛా వాణిజ్యం దెబ్బతింది. ప్రతిసెకనూ 90వేల డాలర్ల మేరకు, దినసరిన 7.8 బిలియన్ డాలర్ల మేరకు జాతీయ రుణం పెరుగుతుందని కాంగ్రెస్ జాయింట్ ఎకనామిక్ కమిటీ వెల్లడించింది. 2036 సంవత్సరం నాటికి ఈ రుణభారం 64 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని కూడా ఆ కమిటీ పేర్కొంది ప్రతి అమెరిన్ పౌరుడిపై తలసరి రుణభారం 1,19,686 డాలర్లుగా లెక్క కట్టింది. అమెరికాకు ఈ రుణ దుస్థితి దాపురించడానికి డెమొక్రాటిక్, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కారణమయినప్పటికీ డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మరింత దిగజార్చా యని అమెరికన్‌లే గగ్గోలు పెడుతున్నారు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేస్తానన్న ట్రంప్ నిజానికి అమెరికా పతనాన్ని మరింత వేగవంతం చేస్తున్నారని అనేకులు వాపోతున్నారు. అమెరికా ఫస్ట్ నినాదం ఇప్పుడు ఆర్థిక పనం దిశగా సాగుతోంది.

# తప్పిపోయిన మూడేళ్ల బాలుడిని తండ్రికి అప్పగించిన పోలీసులు

**- పోలీసుల చొరవతో గంటల్లోనే తండ్రి చెంతకు చేరిన చిన్నారి**



పేట్‌బషీరాబాద్, ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర): సుభాష్‌నగర్ ప్రాంతంలోని సోమవారం మార్కెట్ వద్ద తప్పిపోయిన మూడేళ్ల బాలుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గుర్తించి సురక్షితంగా అతని తండ్రికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పరహాన్ (3) అనే బాలుడు, తండ్రి సోనీ, వృత్తిరీత్యా కూలీ. సుభాష్‌నగర్ సోమవారం మార్కెట్ ప్రాంతంలో బాలుడు తప్పిపోయి ఒంటరిగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు బాలుడిని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం బాలుడి ఫోటో, వివరాలను స్థానిక వాట్సాప్ గ్రూపులతో పాటు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రూపుల్లో పోలీసులు విస్తృతంగా పంపించారు. ఈ సమాచారం బాలుడి తండ్రి సోనీకి చేరడంతో ఆయన వెంటనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాలుడిని గుర్తించారు. పోలీసులు వివరాలను పరిశీలించిన అనంతరం పరహాన్‌ను అతని తండ్రి సోనీకి సురక్షితంగా అప్పగించారు. తప్పిపోయిన చిన్నారిని గుర్తించి తక్కువ సమయంలోనే తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పేట్‌బషీరాబాద్ పోలీసుల చొరవను స్థానికులు అభినందించారు. చిన్నారులు తప్పిపోకుండా తల్లిదండ్రులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.


# ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై కేసు

**- సర్వే నంబర్ 454లో భూమిని రోడ్డు కోసం వినియోగించారన్న ఆరోపణలు**

**- రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో జతీఅవవ చీశీ.777/2026గా ఎఫ్ఐఆర్ నమోదు**

**- ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలి: ఆకుల సతీష్**

బాచుపల్లి,ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర): బాచుపల్లి సర్వే నంబర్ 454లోని ప్రభుత్వ భూమిని అప్రోచ్ రోడ్డు కోసం ఆక్రమించి వినియోగించినట్లు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 24న బాచుపల్లి పోలీసులు ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై జతీఅవవ చీశీ.777/2026గా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడైంద్ధి. ఈ వ్యవహారంపై




స్పందించిన ఆకుల సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని ఆక్రమించి అప్రోచ్ రోడ్డుగా వినియోగిస్తున్న అంశంపై తాము చేసిన పోరాటానికి పోలీసుల కేసు నమోదు నిదర్శనమని అన్నారు. ఈ వ్యవహారాన్ని గతంలో ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసిన నేపథ్యంలో ప్రస్తుత పరిణామం వాటికి చెంపదెబ్బ లాంటిదని వ్యాఖ్యానించారు.

**సమగ్ర సర్వే చేయాలి**

సర్వే నంబర్ 454లోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి, ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.

**అనుమతులపై విచారణ జరపాలి**

అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు, నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# నేడు రాంటెక్‌లో బుద్ధ మూర్తి ప్రతిష్ఠ

ముధోల్ :ఆగష్టు 26:విజన్ ఆంధ్ర : ముథోల్ మండలం రాంటెక్ గ్రామంలోని విక్రమ్ శీల బుద్ధ విహార్‌లో గురువారం బుద్ధ మూర్తి ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రముఖ బౌద్ధ బిక్షువు బోధి దమ్మో చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఉదయం 9 గంటలకు బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు, యువత ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం బుద్ధ వందన, ప్రత్యేక పూజలు, అన్నదానం చేపట్టనున్నారు. ప్రముఖ బౌద్ధ బిక్షువు బోధి దమ్మో ఆధ్వర్యంలో బుద్ధుని జీవితం, బోధనలు, ధర్మ సందేశంపై మరాఠీ భాషలో ప్రత్యేక ప్రవచనం నిర్వహించనున్నారు.



కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి బౌద్ధ ఉపాసికులు, ఉపాసకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# నూతన గ్రంథాలయం ప్రారంభించిన జిల్లా ఎస్పీ




గాదిగూడ, జులై 09(విజన్ ఆంధ్ర):ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని లోకారి కే గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం ను గురువారం ఝరి రైసెంటర్ సార్మేడి మండాడి దౌలత రావ్ తో కలిసి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందరర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని స్థానిక ప్రజల కోసం లేదా విద్యార్థుల కోసం పలు ఇలాంటి కార్యక్రమాలు చేస్తామన్నారు.అనంతరం మండలంలోని లోకారి కే కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళు పరించారు. మినిగురుకులంలో పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో భాగంగా ఆదివాసీ పిల్లల కోసం ఐఏఎస్ మాడావి తుకారాం చౌరస్తాలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు.నూతన గ్రంథాలయాల ఏర్పాటు వాటి ప్రారంభోత్సవాల పోలీస్ శాఖ గ్రంథాలయం మానసికంగా ఆదివాసీ పిల్లల విద్యాభివృద్ధికి జిల్లా పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రత్యేక లైబ్రరీను జిల్లా ఎస్పీ అందుబాటులోకి తెచ్చారు రని మెస్రం శేఖర్ అన్నారు. గ్రామీణ గ్రంథాలయం స్థానిక యువత,విద్యార్థులకు ఉపయోగపడుతుందాన్నారు.సార్మేడి దౌలత రావ్ మాట్లాడుతూ మన మండలానికి రెండో కన్ను తో పాటు మూడో కన్ను కూడా



తీసుకోవచ్చిన ఘనత జిల్లా ఎస్పీ ది అన్నారు.నేటి యువత చదువు పై మొగ్గుచూపాలని ఏది ఏమైనా చదివితోనే సాధ్యం అవుతుందని అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి చదువులు చదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ మెస్రం భీంరావ్,సర్పంచ్ మండాడి పుష్పలత జాకు,ఏ ఎస్పీ పృథ్వీ





సాయి,సీఐ అంజమ్మ,ఎస్సై రమ్య, రాష్ట్ర సార్మేడి అమృత్ రావ్,జిల్లా సార్మేడి మెస్రం దుర్గు,మెస్రం శేఖర్ టీచర్,ఉప సర్పంచ్ ఆత్రం చందు,విద్యార్థినిలు,యువత గ్రామ ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం...





మంచిర్యాల టౌన్, ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర) : ఉట్నూర్ మండలంలోని లింగోజితండా ఎక్స్‌రోడ్డు గ్రామంలో బుధవారం నూతన ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఐటీడీఏ ఏపీఓ జాదవ్ వసంత్ రావు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, స్థానిక సర్పంచ్ మాయ జాదవ్, ఉప సర్పంచ్ హరి నాయక్ జాదవ్‌లు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధిగా వ్యవహరిస్తారని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారానికి జర్నలిస్టులు కృషి చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో కూడా ప్రత్యేకంగా ట్రైబల్ జర్నలిస్టుల అసోసియేషన్ ఏర్పాటు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ముందుకు సాగాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు లాకావత్ రమేష్, కార్యదర్శి మాడవి మాణిక్ రావు, చవాన్ రామేశ్వర్, కోశాధికారి జాదవ్ వసంత్ రావు, ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్, ఆసిఫాబాద్-కొమురంభీం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం రాము, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు రాథోడ్ అజయ్, ప్రచార కార్యదర్శి సిడం కైలాష్, రాథోడ్ నాందేవ్, జాయింట్ సెక్రటరీ జాదవ్ రవికిరణ్, భీమ్ రావు, రవీందర్, మనోజ్, పీత నాయక్, దత్త తదితరులు పాల్గొన్నారు.

# వణుకు పుట్టిస్తున్న వైద్య ఖర్చులు

ముంబై, ఆగస్టు 26, : ఊహించని వైద్య ఖర్చులు తమకు ఒత్తిడిని కలిగిస్తున్నాయని 94 శాతం మంది భావిస్తున్నారని తాజా అధ్యయనంలో తేలింది. భారత్‌లో ఉద్యోగ భద్రత, ప్రపంచ అస్థిరత, ఇఓఎల కంటే కూడా పెరుగుతున్న మెడికల్ ఖర్చులే ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయని టాటా ఏఐజీకి చెందిన 'ది కార్పొరేట్ హెల్త్ ప్రొటెక్షన్ పల్స్ 2026' అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగం కోల్పోతే దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు 6 నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నెట్టుకురాగలరు.ప్రొటెక్షన్ గ్యాప్ ? పని చేసే సంస్థ ఇచ్చే బీమాతో పాటు అదనపు ఆరోగ్య బీమా ఉండటం ముఖ్యమని 84 శాతం మంది భావిస్తున్నారు, అయినప్పటికీ దాదాపు సగం మంది ఉద్యోగులు పనిచసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ) కాకుండా వ్యక్తిగత ఆరోగ్య బీమాను కలిగి లేరు. అవగాహన లోపం, తర్వాత కొనుగోలు చేద్దాంలే అనే అలవాటు వ్యక్తిగత ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి ప్రధాన అడ్డంకులుగా నిలుస్తున్నాయి. భారత శ్రామిక శక్తిపై ఆరోగ్య సంరక్షణ మోపుతున్న పెరుగుతున్న ఆర్థిక భారాన్ని కూడా ఈ అధ్యయనం తెలిపింది. ఊహించని వైద్య ఖర్చులు తమకు ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయని ఇందులో పాల్గొన్న దాదాపు 94 శాతం మంది (రెస్పాండెంట్లు) తెలిపారు. ఉద్యోగం కోల్పోవడం లేదా కెరీర్ ఆగిపోవడం కంటే పెద్ద ఆందోళనగా మారింది. ఉద్యోగం లేకుండా ఒక ఏడాది కంటే ఎక్కువ రోజులు తాము ఆర్థికంగా నెట్టుకురాగలమని కేవలం 12% మంది మాత్రమే భావిస్తున్నారు. ఉద్యోగం కోల్పోయినప్పుడు దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు కేవలం ఆరు నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నిలదొక్కుకోగలమని చెప్పారు. దీర్ఘకాలం ఆదాయాన్ని కోల్పోవడాన్ని తట్టుకునేందుకు చాలా మంది కార్పొరేట్ ఉద్యోగులు సిద్ధంగా లేరని ఈ ఫలితాలు వెల్లడించాయి.కుటుంబానికి ఆరోగ్య బీమా, ఆసుపత్రి ఖర్చులు, జీవనశైలి వ్యాధులు, మానసిక ఆరోగ్యం, అత్యవసర పరిస్థితుల కోసం పొదుపు లేకపోవడం వంటివి కార్పొరేట్ భారత్‌లో ప్రధాన 5 ఆరోగ్య సంబంధిత ఆందోళనకర అంశాలుగా నిలిచాయి. ఉద్యోగం మారే సమయంలో ఆదాయం కోల్పోవడం, ఇఓఎలను మించి వైద్య ఖర్చులే అతిపెద్ద ఆర్థిక ఆందోళన అని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. రెస్పాండెంట్లలో ఉద్యోగం మారే సమయంలో అంతరాయం లేని ఆరోగ్య బీమా కవరేజ్ ముఖ్యం అని 88 శాతం మంది భావిస్తున్నప్పటికీ, మెడికల్ కవరేజీ కొనసాగింపును అందించే సొల్యూషన్స్ కేవలం 40% మందికే తెలుసు. అంటే ఉద్యోగ మార్పు ఈ కీలక దశలో బీమా గురించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. "కార్పొరేట్ ఉద్యోగులు పని చేసే సంస్థ అందించే ఆరోగ్య బీమాను ఎలా చూస్తున్నారనేది అర్థం చేసుకోవడం. సన్నద్ధతలో ఇప్పటికీ ఉన్న లోటుపాట్లను గుర్తించడం ఈ అధ్యయనం ఉద్దేశ్యం. ఉద్యోగుల శ్రేయస్సుకు గ్రూప్ మెడికల్ కవర్ ముఖ్యమే అయినప్పటికీ, వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఉద్యోగ మార్పు సమయంలో తమ కవరేజ్ ఏ మేరకు ఉంటుందో.. అది సరిపోతుందో లేదో చాలా మందికి క్లారిటీ లేదు. వైద్య ఖర్చులు పెరుగుతున్న కొద్దీ, అవగాహన, ఆర్థిక సన్నద్ధత మరింత ముఖ్యం. ఈ విశ్లేషణలు, ఉద్యోగులు తమ ఆరోగ్య రక్షణ అవసరాలపై సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తాయి. ఆర్థికంగా నిలకడైన శ్రామిక శక్తిని నిర్మించడానికి యజమానులు, బీమా సంస్థలు, విధానకర్తల మధ్య మెరుగైన సహకారాన్ని పెంపొందిస్తాయని ఆశిస్తున్నట్లు" టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ రీటైల్ - హెల్త్ అండర్‌రైటింగ్ హెడ్ డాక్టర్ సంతోష్ పురి తెలిపారు.ఉద్యోగం చేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ)ని నిశితంగా పరిశీలిస్తే కొన్ని విషయాలు బయటపడతాయి. కంపెనీ అందించే జీఎంసీతో పాటు అదనపు ఆరోగ్య కవరేజ్ కలిగి ఉండాలని 84% మంది నమ్ముతున్నప్పటికీ, యజమాని అందించే కవర్ కాకుండా దాదాపు సగం మంది (45 శాతం) ఎలాంటి అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి లేరు. అదనపు ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి అవగాహన లోపం, తర్వాత పాలసీ తీసుకుందామనే వైఖరి ప్రధాన అడ్డంకిగా ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా 28-34 సంవత్సరాల వయస్సు గలవారిలో ఇది ఎక్కువగా ఉంది.ఈ అధ్యయనం ద్వారా ఉద్యోగులు తమ గ్రూప్ మెడికల్ కవరేజ్ (జీఎంసీ) పట్ల సంతృప్తిగా ఉన్నప్పటికీ, ఆ కవరేజ్ ఎంతవరకు సరిపోతుందనే దానిపై వారికి నమ్మకం లేదు. అత్యవసర ఆసుపత్రి చేరిక సమయంలో యజమాని అందించే జీఎంసీ ఒక్కటే సరిపోదని దాదాపు 75 శాతం మంది అంగీకరించారు. కంపెనీ అందించే ఆరోగ్య బీమా పరిధి, పరిమితులపై ఉద్యోగుల అవగాహనలో లోపాలను ఈ సర్వే వెలుగులోకి తెచ్చింది. యజమాని అందించే జీఎంసీ అన్ని ఫీచర్లు, ప్రయోజనాల గురించి తమకు పూర్తిగా తెలుసునని కేవలం 41 శాతం మంది ఉద్యోగులు చెప్పారు. ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పుణే, కోల్‌కతా నగరాల్లో 28-55 సంవత్సరాల వయస్సు గల 748 మందికి పైగా కార్పొరేట్ ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలు షేర్ చేసుకున్నారు. అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయడానికి కుటుంబ రక్షణే బలమైన ప్రేరణగా నిలుస్తోంది. టాప్-అప్ ప్లాన్‌ను పరిశీలిస్తున్నప్పుడు తాము చూసే అత్యంత ముఖ్యమైన ఫీచర్లుగా ఎక్కువ బీమా మొత్తం, కుటుంబ సభ్యులకు కవరేజ్, ఉద్యోగం మారే సమయంలో కవరేజ్ కొనసాగింపు ఉండాలని కోరుకుంటున్నట్లు రెస్పాండెంట్లు పేర్కొన్నారు.

# కామారెడ్డి జీవధాన్ ఆస్పత్రిలో మహిళ మృతి ఘటన కలకలం

**- గర్భసంచి తొలగింపు ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వచ్చిన రాజేశ్వరి మృతి**






కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 26(విజన్ఆంధ్ర) : కామారెడ్డి పట్టణంలోని జీవధాన్ ఆస్పత్రిలో మహిళ మృతి ఘటన కలకలం రేపింది. గర్భసంచి తొలగింపు ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వచ్చిన లింగంపేటకు చెందిన పరిష రాజేశ్వరి అలియాస్ లాస్య (38) మృతి చెందారు. ఆపరేషన్ థియేటర్కు తీసుకెళ్లి అనస్థీషియా ఇచ్చిన వెంటనే హార్ట్ స్ట్రోక్ వచ్చిందని వైద్యులు చెబుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రాజేశ్వరి మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యంగా, చురుగ్గా ఆస్పత్రికి వచ్చిన రాజేశ్వరి అనస్థీషియా ఇచ్చిన తర్వాత హార్ట్ స్ట్రోక్తో ఎలా మృతి చెందుతారని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రిలో కేస్ షీట్ కూడా రాయలేదని, కుటుంబ సభ్యుల నుంచి సంతకాలు తీసుకోకుండానే ఆపరేషన్ థియేటర్కు తీసుకెళ్లారని బంధువులు ఆరోపిస్తున్నారు. రాజేశ్వరి మృతిపై ఆస్పత్రి వైద్యులు, కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. మృతురాలికి 9 ఏళ్ల కుమార్తె శ్రీవల్లి, 5 ఏళ్ల కుమారుడు వైభవ్ భర్త నరేందర్ ఉన్నారు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. కామారెడ్డి పట్టణ సీఐ నరహరి పోలీస్ బృందం హాస్పిటల్లో ఉన్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# విజన్ ఆంధ్ర కథనంతో కదిలిన యంత్రాంగం

## - ఊరుకొండ ఆలయంలో పూజారులకు ఈవో ఫైనల్ వార్నింగ్!

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 26: ఊరుకొండ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో పూజారుల దోపిడీ, భక్తుల ఆవేదనపై బుధవారం విజన్ ఆంధ్ర పత్రికలో వెలువడిన కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది. నేరుగా దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం వరకు, ఎండోన్ మెంట్ మంత్రి కార్యాలయం వరకు,

VISION ANDHRA EFFECT VISION ANDHRA



చివరకు సీఎంవో వరకు ఈ వార్త చేరడంతో అధికారులు నిప్పులు చెరిగారు. దీంతో ఆలయ అధికారి ఈవో సత్య చంద్రారెడ్డి బుధవారం మధ్యాహ్నం హుటాహుటిన ఆలయ కమిటీ సభ్యులతో, పూజారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ప్రధాన పత్రికలో వార్త రావడంతో తనకు పై అధికారుల నుంచి ఫోన్లు వస్తున్నాయని, మీ తీరు వల్ల శాఖ పరువు పోతోందని ఆయన మండిపడ్డట్టు సమాచారం. ఇకపై భక్తుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేసినా, భక్తులతో అసభ్యంగా, మర్యాద లేకుండా ప్రవర్తించినా శాశ్వతంగా దేవాలయం నుంచి తొలగించడం ఖాయమని, తీరు మార్చుకోకపోతే మీరే ఇబ్బందుల్లో పడతారని గట్టిగా హెచ్చరించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, డబ్బుల కోసం వేధించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కూడా పూజారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అవినీతికి



విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
26 Aug 2026 - Page 12
epaper.visionandhra.in

ఊరుకొండ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో దోపిడీ.. భక్తుల ఆవేదన!

- పూజల పేరుతో రూ.300 నుండి రూ.1000 వరకు వసూళ్లు - సోషల్ మీడియాలో వైరల్
- అసలు అర్చకులు ఎవరు? అవుట్ సోర్సింగ్ పూజారులా? ఎండోమెంట్ ప్రధాన అర్చకులా?

పాల్పడుతున్న పూజారులను వెంటనే తొలగించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. అయితే చివరిసారిగా ఒక అవకాశం ఇద్దామని, ఆ తర్వాత కూడా తీరు మారకపోతే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు కమిటీ ఒక కీలక తీర్మానం కూడా చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఉన్న ఎండోన్ మెంట్ పూజారిని ప్రధాన ఆలయానికి ప్రధాన అర్చకుడిగా నియమించి, తాత్కాలికంగా ఉన్న మిగతా పూజారులను బయట వాహనాల పూజలు, రథాల వద్ద మాత్రమే పూజలు చేసే విధంగా పంపించాలని నిర్ణయించారు. మళ్లీ వాహన పూజల్లో బలవంతంగా డబ్బులు వసూలు చేసినా, ఆలయంలో పూజల పేరుతో భక్తులను డిమాండ్ చేసినా వెంటనే శాశ్వతంగా తొలగిస్తామని ఆ తీర్మానంలో పేర్కొన్నట్టు తెలుస్తోంది. అయితే పూజారులు మాత్రం తమపై కావాలనే బద్నాం చేస్తున్నారని, తాము ఎలాంటి అవినీతికి పాల్పడటం లేదని ఈవోకు వివరణ ఇచ్చినట్టు సమాచారం. మొత్తంగా విజన్ ఆంధ్ర రాసిన కథనంతో ఆలయంలో కదలిక వచ్చినా, ఈ సమావేశం, ఈ తీర్మానం కేవలం హడావిడి కోసమేనా, తూతూ మంత్రంగా మిగిలిపోతుందా లేక నిజంగానే భక్తులకు న్యాయం జరుగుతుందా అని స్థానిక భక్తులు, ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

# కేఎల్ఐ ప్రధాన కాలువలో మృతదేహం లభ్యం

**-మృతుడు సాయినిపల్లి చెందిన రమేష్ గా గుర్తింపు**



బిజినపల్లి రిపోర్టర్ (విజన్ ఆంధ్ర) ఆగస్టు 26 బుధవారం : :నాగర్కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం మహాదేవునిపేట శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది. కేఎల్ఐ ప్రధాన కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. మంగళవారం సాయంత్రం కాలువలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే బిజినపల్లి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. ప్రాథమికంగా మృతుడిని సాయినిపల్లి గ్రామానికి చెందిన రమేష్ గా గుర్తించారు. మృతుడి పూర్తి వివరాలు, మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు బిజినపల్లి పోలీసులు తెలిపారు.

# వర్షానికి తడిసిన చిరిగిపోనీ ఇంటర్ మెమోలు



నాగర్కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) ఆగస్టు 26 బుధవారం : వర్షానికి తడవని ఇంటర్ మెమో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కొత్త తరహా ధ్రువపత్రాలు అందజేత.


వర్షానికి తడవకుండా, చిరిగిపోకుండా ఉండే విధంగా సర్టిఫికెట్ల ముద్రణ. మందమైన,నాణ్యమైన చిరిగిపోని కాగితంపై సర్టిఫికెట్ల తయారీ. ధ్రువపత్రాల్లో ఏకంగా 25 రకాల భద్రతా లక్షణాల ఏర్పాటు. ఇంటర్మీడియట్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ ఈ తరహా సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ వెల్లడించారు. విద్యార్థుల సర్టిఫికెట్ల భద్రత, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# గుండెపోటుతో బిటెక్ విద్యార్థి మృతి

**- జిన్నారం గ్రామానికి చెందిన వాడిగా గుర్తింపు**

హైదరాబాద్,ఆగస్ట్26 : గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన హైదరాబాద్లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన పోషన్న, నరసవ్వ దంపతుల కుమారుడు మనోహర్ (24) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో హైదరాబాద్లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం గుండెపోటుతో మనోహర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పోషన్న నరసవ్వ దంపతులకు పిల్లలు లేకపోవడంతో మనోహర్ను దత్తత తీసుకున్నారు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతూ చదివిస్తున్నారు. ఈ నేపథ్యంలో మనోహర్ హఠాన్మరణంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

# కొండా పై వేటు సాధ్యమేనా



హైదరాబాద్, వరంగల్, ఆగస్టు 26, : తెలంగాణ కాంగ్రెస్ రాజకీయంలో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె కుటుంబం వర్సెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గం మధ్య సాగుతున్న అంతర్గత సమరం ఒక్కసారిగా తారాస్థాయికి చేరింది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆయన కుటుంబ సభ్యులపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేయడం, రాబోయే ఎన్నికల్లో పరకాల సీటుపై సీఎం చేసిన వ్యాఖ్యలను సవాలు చేస్తూ విమర్శలు గుప్పించడంతో మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ పరిణామంతో కాంగ్రెస్ అధిష్టానం ఇక ఎంతమాత్రం సహించే ప్రసక్తే లేదనే స్పష్టమైన సంకేతాలను పంపింది. ఆమె తనకేం సంబంధం లేదని సమాచారం పంపినా పరిగణనలోకి తీసుకోవడం లేదు. కొండా కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరొందిన మాజీ ఓఎస్డీ ఎన్. సుమంత్ చుట్టూ చట్టపరమైన ఉచ్చు వేగంగా బిగుస్తుండటం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. గతంలో డెక్కన్ సిమెంట్స్ ప్రతినిధులను బెదిరించిన వ్యవహారంలో ఓఎస్డీ పదవి నుంచి తొలగించబడిన సుమంత్పై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఃబొ సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు కావడం ఇప్పుడు సంచలనంగా మారింది. సుస్మితా పటేల్ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే పాత ఘటనపై పోలీసులు ఇంత వేగంగా స్పందించి కేసు నమోదు చేయడం వెనుక, కొండా నెట్వర్క్ను చట్టపరంగా ఇరకాటంలో పడేసే పక్కా వ్యూహం ఉందనే ప్రచారం బలపడుతోంది. మరోవైపు ఉమ్మడి వరంగల్ , ఇతర జిల్లాలకు చెందిన సుమారు 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించాలని బహిరంగంగానే డిమాండ్ చేయడం కాంగ్రెస్లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోంది. డిసిప్లినరీ కమిటీ ద్వారా నోటీసు ఇచ్చి వివరణ కోరడం, అదే సమయంలో పోలీసు యంత్రాంగం ద్వారా అవినీతి, అక్రమ సెటిల్మెంట్ల ఆరోపణలపై లీగల్ విచారణ వేగవంతం చేయడం ద్వారా కాంగ్రెస్ అగ్రనాయకత్వం డబుల్ స్ట్రోక్ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఈ వరుస పరిణామాలు కేవలం వ్యక్తిగత విభేదాలకే పరిమితం కాకుండా కాంగ్రెస్ పార్టీ అంతర్గత ఆధిపత్య పోరును ప్రతిబింబిస్తున్నాయి. గతంలో సినీ ప్రముఖుల విడాకులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఇతర మంత్రి సహచరులతో ఏర్పడిన వైరుధ్యాలు, ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రిపైనే కూతురితో ఘాటు వ్యాఖ్యలు చేయించడం వంటి వరుస తప్పులు కొండా సురేఖ పొలిటికల్ గ్రాఫ్ను దెబ్బతీశాయి. దీంతో ఆమె బిసి వర్గానికి చెందిన నాయకురాలనే వెసులుబాటును కూడా అధిష్టానం ఈసారి పరిగణనలోకి తీసుకునే పరిస్థితి లేదని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వరంగల్ రాజకీయాల్లో కొండా దంపతులకు స్వయంకృత ప్రతిపత్తి ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి అధిష్టానం పూర్తి అండదండలు ఉండటంతో ఈసారి కొండా కుటుంబానికి తప్పించుకునే మార్గాలు మూసుకుపోతున్నాయి. పొలిటికల్గా షోకాజ్ నోటీసులు, లీగల్గా ఓఎస్డీ సుమంత్పై కేసులు, పార్టీపరంగా ఎమ్మెల్యేల వ్యతిరేకత?ఈ మూడు వైపుల నుంచి వస్తున్న ఒత్తిడితో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసే దాకా లేదా రాజీనామా చేయించే దాకా ఈ 'ఆట' ఆగదనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయిబీసీ కార్డు కాపాడుతుందా తెలంగాణ కాంగ్రెస్లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుటుంబ వ్యవహార శైలిపై మొదలైన వివాదం ఇప్పుడు అత్యంత సున్నితమైన సామాజిక, బీసీ సమీకరణాల మలుపు తీసుకుంది. తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూ కేటాయింపులపై చేసిన ఆరోపణల తర్వాత, తీవ్రమైన రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న సురేఖ.. తనకు ఉన్న ఏకైక , బలమైన బీసీ కార్డ్ ను బయటకు తీశారు. క్యాబినెట్లోని సీనియర్ బీసీ మహిళా మంత్రిగా ఉన్న తనపై 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి దాడి చేయించడాన్ని బీసీల వేధింపుగా చిత్రీకరించే ప్రయత్నం సురేఖ చేస్తున్నారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సురేఖ అంటున్నారు. అంతటితో ఆగకుండా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ జెండా మోసిన తమ కుటుంబాన్ని, ఓట్ల శాతం ఎక్కువగా ఉన్న బీసీ వర్గాన్ని తగ్గించేందుకే ఈ కుట్ర జరుగుతోందనే సంకేతాలను కేడర్లోకి పంపేలా ఈ వ్యూహం ఉంది.పిల్లలు చేసిన వ్యాఖ్యలకు తల్లిగా నన్ను టార్గెట్ చేయడం బీసీ నాయకత్వాన్ని అణచివేసే కుట్రలో భాగమే అన్న సంకేతాలు ఇవ్వడమే కొండా దంపతుల వ్యూహంగా కనిపిస్తోంది. ఈ బీసీ సెంటిమెంట్ అస్త్రం కొండా సురేఖను పదవి నుంచి కాపాడగలదా అంటే.. ప్రస్తుతానికి అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఈసారి కొండా సురేఖను కాపాడే పరిస్థితి లేదు, సీఎంపై వ్యాఖ్యలు పార్టీ లైన్ దాటాయి అని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. స్వయంగా పీసీసీ అధ్యక్షుడే ఈ రకమైన తీవ్రమైన వ్యాఖ్య చేయడం ద్వారా, అధిష్టానం ఇప్పటికే కొండా సురేఖ విషయంలో ఒక కఠినమైన నిర్ణయానికి వచ్చిందని స్పష్టమవుతోంది.మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వివాదాన్ని కేవలం వ్యక్తిగత విమర్శగా చూడకుండా పార్టీ క్రమశిక్షణ సమస్యగా మార్చడంలో విజయవంతమయ్యారు. ప్రెస్మీట్లో ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు . పార్టీ నిర్ణయమే ఫైనల్ అన్నారు.


రేవంత్ సోదరుడి భూములపై సుస్మిత నేరుగా దాడి చేయడం వల్ల, సురేఖకు కేబినెట్లో కొనసాగే అర్హత లేదని రేవంత్ అనుకూల ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రెస్మీట్ పెట్టారు. పైగా, కాంగ్రెస్ హైకమాండ్ , ఏఐసీసీ కూడా ప్రభుత్వం సుస్థిరంగా సాగాలంటే సీఎం ప్రాధాన్యతకే మొగ్గు చూపుతాయని చెప్పాల్సిన పని లేదు. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణాలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్లో బీసీల ప్రాతినిధ్యం, సమాన అవకాశాలను కాపాడటానికి మహేశ్ కుమార్ గౌడ్ ఇప్పటికే పీసీసీ చీఫ్గా ఉన్నారు. అందువల్ల సురేఖను కేబినెట్ నుంచి తప్పించినా, అది కాంగ్రెస్ మొత్తం బీసీలకు వ్యతిరేకం అనే ముద్ర పడకుండా అధిష్టానం కవర్ చేసుకోగలదు. కొండా సురేఖ బీసీ కార్డును ఎంత గట్టిగా పట్టుకున్నప్పటికీ, పార్టీ డిసిప్లినరీ కమిటీ తుది నివేదిక వచ్చాక ఏఐసిసి ఇచ్చే ఆదేశాలే ఆమె రాజకీయాన్ని తేలుస్తాయి. కొండా సురేఖకు మిగిలిన ఏకైక మార్గం.. తన కుమార్తె వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తూ, పీసీసీ, సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పడం లేదా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండటం. లేనిపక్షంలో, బీసీ సెంటిమెంట్ ఎంత పండించినప్పటికీ.. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ నాయకత్వం ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించి, పార్టీపరంగా సైడ్ చేయడమే తదుపరి పరిణామంగా మారబోతోం

# తాగినోళ్లకు తాగినంత




అదిలాబాద్ ఆగస్టు 26 : మిగతా వాటి విషయంలో ఎలా ఉంటారో తెలియదు కానీ.. తాగే బ్రాండ్ల విషయంలో మందుబాబులు ఒక క్లారిటీతో ఉంటారు. ఎందుకంటే వాళ్లకు నచ్చిన బ్రాండ్ తాగితేనే కిక్. లేకపోతే వారి కోపం తారస్థాయికి చేరుతుంది. తిక్క రేగితే ప్రభుత్వాన్ని కూడా మార్చగలరు. ఎందుకంటే వాళ్లకు తాగే విషయంలో.. తాగే మందు కిక్కు ఎక్కించే విషయంలో ఏ మాత్రం కాంప్రమైజ్ కారు.అప్పట్లో జగన్ ప్రభుత్వం ఏపీలో అధికారంలో ఉన్నప్పుడు తిక్క తిక్క బ్రాండ్లు మొత్తం మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఆ చెత్త బ్రాండ్ల మందు తాగలేక.. ఇతర బ్రాండ్లను రాష్ట్రంలోకి తీసుకొచ్చే అవకాశం లేక మందు బాబులు పడ్డ ఇబ్బందులు మామూలువి కావు. ఆంధ్ర సరిహద్దులో ఉండే తెలంగాణ ప్రాంతాల నుంచి మందుబాబులు మందు కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. అయితే ఈ వ్యవహారానికి అడ్డు కట్టడానికి ఏపీ పోలీసులు ప్రత్యేకంగా చెక్పోస్టులు ఏర్పాటు చేసే వారంటే.. నాడు పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరికి వారు కోరుకున్న బ్రాండ్ల మద్యం అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో నాటి టిడిపి అధ్యక్షుడు చంద్ర బాబు చెప్పారు అంటే.. మందుబాబులు బ్రాండ్లకు ఇచ్చే విలువ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.మద్యం వినియోగంలో దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఇక తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో కూడా మద్యం వినియోగం అధికంగా ఉంది. ఒకప్పుడు అకేషనల్ గా మాత్రమే చాలామంది తాగేవారు. ఇప్పుడు ఒక అలవాటుగా తాగడాన్ని మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లోకి కొత్త కొత్త బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలో తెలంగాణ మార్కెట్లోకి చీతా.. టైగర్.. రెడ్ హార్స్ వంటి బ్రాండ్లు అందుబాటులోకి రాబోతున్నాయి. మార్కెట్లో ఏకంగా 121 కొత్త మద్యం బ్రాండ్లను తీసుకురావడానికి ఎక్సైజ్ శాఖకు దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా 18 కంపెనీలు ఈ దరఖాస్తులు సమర్పించాయి. ఈ బ్రాండ్ల సరఫరాకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. ఇక కొత్త బ్రాండ్ల జాబితాలో ఆ బెస్ట్.. బర్గర్.. టైగర్.. రెడ్ హార్స్.. బుటానిస్.. సీయోక్ బింగో.. కాకావిస్.. డాన్ గ్లాంగ్ వంటి బీర్లతోపాటు.. విస్కీ.. బ్రాందీ వంటి వాటిలో కూడా మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రాబోతున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో మద్యం సిండికేట్ వల్ల చాలా ప్రాంతాలలో కొన్ని కంపెనీలకు సంబంధించిన బీర్లు.. విస్కీ.. బ్రాందీ అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం కూడా ఈ సిండికేట్ ఆగడాలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొత్త బ్రాండ్లు అందుబాటులోకి వస్తే మందుబాబులు ఏ విధంగా స్వీకరిస్తారనేది చూడాల్సి ఉంది. సాధారణంగా తెలంగాణ రాష్ట్రంలో మందుబాబులు బ్రాండ్లకు విపరీతమైన ప్రియారిటి ఇస్తారు. ఆమధ్య తమ కోరుకున్న బ్రాండ్ బీర్లు అందుబాటులో లేవని తెలంగాణ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో మద్యం షాపులు ఎదుట మందుబాబులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ కొత్త బ్రాండ్లను తీసుకువచ్చి మందుబాబుల ఆగ్రహానికి ప్రభుత్వం గనుక గురైతే అప్పుడు పరిస్థితి వేరే విధంగా ఉంటుంది అందువల్లే బ్రాండ్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

# స్మార్ట్ కార్డుల పై క్రెడిట్ వార్




నల్గొండ ఆగస్టు 26,: తెలంగాణలో కొత్తగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ వివాదం ముదురుతోంది. కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్.. కేంద్రం ఖఓఉఐంజ కింద భారీగా సబ్సిడీ భరిస్తున్నప్పటికీ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో ఎందుకు పెట్టడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తెలంగాణలో సన్నబియ్యం పంపిణీకి తాము కూడా భారీగా నిధులు వెచ్చిస్తున్నామని స్పష్టం చేస్తోంది. రేషన్ బియ్యం విషయంలో కేంద్రం, రాష్ట్రం రెండింటికీ ఆర్థిక బాధ్యతలు ఉన్నాయి. జాతీయ ఆహార భద్రతా చట్టం, ఖఓఉఐంజ కింద పేదలకు అందించే ధాన్యంపై కేంద్ర ప్రభుత్వం భారీ సబ్సిడీని భరిస్తోంది. అదే సమయంలో లబ్ధిదారుల గుర్తింపు, ధాన్యం రవాణా, నిల్వ, రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ వంటి వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వానికి కీలక పాత్ర ఉంది. తెలంగాణ ప్రభుత్వం కేంద్రం అందించే కోటాకు అదనంగా లబ్ధిదారులకు సన్నబియ్యం అందించేందుకు సొంత నిధులు ఖర్చు చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారు. దీంతో మొత్తం రేషన్ వ్యవస్థకు సంబంధించిన ఖర్చును పూర్తిగా కేంద్రానిదే లేదా పూర్తిగా రాష్ట్రానిదే అని చెప్పడం వాస్తవ పరిస్థితిని సరళీకరించినట్లే అవుతుంది. కేంద్రం సన్నబియ్యం వ్యయాన్ని పూర్తిగా భరిస్తే ప్రధాని మోదీ ఫొటో పెట్టేందుకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కేంద్రం మాత్రం వేల కోట్ల రూపాయల మేర నిధులు, సబ్సిడీలు అందిస్తున్నప్పుడు తమ పాత్రను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని వాదిస్తోంది. కానీ ఇక్కడ మరో కీలకమైన ప్రశ్న తలెత్తుతోంది. ప్రజల కోసం ఖర్చు చేస్తున్న ప్రజాధనంతో అందించే సంక్షేమ పథకాలకు రాజకీయ నాయకుల ఫొటోలు అవసరమా? రేషన్ కార్డు అనేది పేదల ఆహార హక్కుతో ముడిపడిన అధికారిక పత్రం. అది ఏ పార్టీకి చెందిన ప్రచార సాధనం కాదు. సంక్షేమ పథకాలపై రాజకీయ నేతల ఫొటోల కోసం కేంద్రం, రాష్ట్రం పోటీ పడటం కంటే.. ఆ పథకాల ప్రయోజనం ప్రజలకు ఎంత సమర్థంగా చేరుతుందన్నదే ముఖ్యం. రేషన్ బియ్యం కోట్లాది కుటుంబాల జీవితాలను నేరుగా ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ పథకం ద్వారా రాజకీయ మైలేజ్ పొందాలని కేంద్రం, రాష్ట్రంలోని అధికార పార్టీలు రెండూ కోరుకోవడం సహజమే. బియ్యం వెనుక ప్రధాని మోదీ ప్రభుత్వం ఉందన్న సందేశం బలంగా వెళ్తే బీజేపీకి ప్రయోజనం. అదే సమయంలో సన్నబియ్యం, అదనపు కోటా, పంపిణీ వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటే కాంగ్రెస్‌కు రాజకీయ లాభం. అందుకే బియ్యం కంటే 'క్రెడిట్' పెద్ద అంశంగా మారుతోంది. కిషన్ రెడ్డి ప్రతిపాదించినట్లుగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కేంద్రం నేరుగా రేషన్ పంపిణీ చేయడం కూడా ఆచరణలో అంత సులభమైన విషయం కాదు. రేషన్ వ్యవస్థ అనేది కేవలం బియ్యం సరఫరా కాదు. లబ్ధిదారుల డేటా, రవాణా, గోదాములు, రేషన్ డీలర్ల వ్యవస్థ, స్థానిక పర్యవేక్షణ వంటి అనేక అంశాలతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ. కేంద్రం సమాంతరంగా మరో పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయడం కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో కొత్త సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. కేంద్రం ఎంత ఖర్చు చేస్తోంది? రాష్ట్రం ఎంత భరిస్తోంది? కార్డుపై ఎవరి ఫొటో ఉండాలి? అనే రాజకీయ వాదనల మధ్య అసలు లబ్ధిదారుడి సమస్య పక్కకు వెళ్లకూడదు. పేదలకు బియ్యం సకాలంలో అందుతోందా? నాణ్యత ఎలా ఉంది? అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ చేరుతోందా? పంపిణీలో పారదర్శకత ఉందా? ఇవే ప్రధాన ప్రశ్నలు కావాలిరేషన్ కార్డుపై ఎవరి ఫొటో ఉన్నా.. ప్రజలకు కావాల్సింది రాజకీయ ప్రచారం కాదు, తమ హక్కుగా అందాల్సిన నాణ్యమైన ఆహారం. అందుకే ఈ వివాదంలో గెలవాల్సింది కేంద్రం కాదు, రాష్ట్రం కాదు. లబ్ధిదారుడే గెలవాలి.

# బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు

హైదరాబాద్, ఆగస్టు 26,: ఏడేళ్ల విరామం అనేది చిన్న విషయం కాదు, ముఖ్యంగా విస్తృతంగా వాణిజ్యం చేసుకుంటూ, సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా తరచుగా విభేదించే రెండు పొరుగు దేశాలైన భారత్, చైనాల విషయంలో ఇది మరింత ముఖ్యమైనది. ఇప్పుడు, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత పర్యటనపై వార్తలు వస్తున్నాయి. ఆయన సెప్టెంబర్ 12, 13 తేదీలలో న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు హాజరు కానున్నారు. ఆయనతో పాటు సుమారు 400 మంది అధికారులతో కూడిన ఒక పెద్ద ప్రతినిధి బృందం రావచ్చని సమాచారం. హోటళ్లను సమీక్షిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పర్యటన ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అయినప్పటికీ, షీ భారతదేశానికి వస్తున్నారని బీజింగ్ ఇంకా ప్రకటించలేదు. సన్నాహాలు ఇంత విస్తృతంగా ఉంటే, ప్రకటనలో ఎందుకీ ఆలస్యం? చివరి నిమిషం వరకు చైనా తన వ్యూహాలను గోప్యంగా ఉంచడానికి ప్రయత్నిస్తోందా? లేక మోదీ, షీల మధ్య ప్రత్యేక సమావేశానికి సంబంధించిన అజెండా ఇంకా ఖరారు కాలేదా? మీడియా నివేదికల నుంచి వస్తున్న కొన్ని వార్తల తర్వాత ఈ ప్రశ్నలు మరింత పెద్దవిగా మారాయి. జిన్‌పింగ్ చివరిసారిగా 2019 అక్టోబర్‌లో భారతదేశాన్ని సందర్శించారు. ఆయన మహాబలిపురంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు . సముద్ర తీరంలో ఇద్దరు నాయకులు ఉన్న ఫోటోలు వార్తల్లో ప్రముఖంగా నిలిచాయి. అప్పటి వాతావరణం భిన్నంగా ఉండేది. కొన్ని నెలల తర్వాత, గాల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణలో భారత, చైనా సైనికులు మరణించారు. సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరు దేశాలు భారీ సంఖ్యలో సైనిక బలగాలను మోహరించాయి. చైనా యాప్‌లపై భారత్ కఠిన చర్యలు చేపట్టింది. పెట్టుబడులు, వాణిజ్యం కూడా కష్టంగా మారాయి. అక్టోబర్ 2024లో గస్తీలు , దళాల ఉపసంహరణపై కొంత ఒప్పందం కుదిరింది. చర్చలు పునఃప్రారంభమయ్యాయి, కానీ సంబంధాలలో ఏర్పడిన చీలిక మాత్రం నయం కాలేదు. ఇప్పుడు, ఒకవేళ షీ భారతదేశానికి వస్తే, ఆయన విమానం కేవలం ఒక విదేశీ అతిథిని మాత్రమే తీసుకురాదు. అది తనతో పాటు ఏడేళ్ల ఉద్రిక్తతను, గాల్వాన్ లోయ జ్ఞాపకాలను, భవిష్యత్తుపై ఎన్నో ఆశలను కూడా తీసుకువస్తుంది. ప్రపంచ వాణిజ్యం చుట్టూ ఒక కొత్త ఘర్షణ మొదలవుతోంది. అమెరికా ఒత్తిడి పెరిగింది. చైనా కొత్త మార్కెట్లను, బలమైన భాగస్వాములను కోరుకుంటోంది. భారతదేశం ఒక ప్రధాన ప్రపంచ మార్కెట్ , గ్లోబల్ సౌత్‌కు బలమైన గొంతుకగా కూడా మారింది. భారతదేశంతో ఘర్షణలు కొనసాగించడం చైనాకు కూడా ప్రయోజనకరం కాదు, ముఖ్యంగా అది బహుముఖంగా ఆర్థిక, వ్యూహాత్మక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో. అందుకే షీ సంభావ్య పర్యటన ఆకస్మిక స్నేహ సంకేతం కాదు. అది చైనాకు ఒక అవసరం కావచ్చు. అయితే, తన సంబంధాలను చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉన్న ఏకైక దేశం చైనా మాత్రమే కాదు. సరిహద్దులో నిరంతర ఉద్రిక్తతను భారత్ కూడా



కోరుకోవడం లేదు. దీర్ఘకాలిక సైనిక మోహరింపులు ఖర్చుతో కూడుకున్నవి. వాణిజ్య అనిశ్చితి భారతీయ కంపెనీలపై కూడా ప్రభావం చూపుతుంది ఇద్దరూ సంభాషణ కోరుకుంటున్నారు. తేడా ఒక్కటే, ఇద్దరూ తమ తమ పద్ధతుల్లో మాట్లాడాలని కోరుకుంటున్నారు. చైనా జాతీయ జాతకం అక్టోబర్ 1, 1949 నాటిది. దాని లగ్నం మకర రాశి. సెప్టెంబర్ 2026లో, గురు గ్రహం దాని జాతకంలో ఏడవ ఇంట్లో ఉంటుంది. దేశ జాతకంలో ఏడవ ఇల్లు ఇతర దేశాలతో సంబంధాలను మరియు ముఖాముఖి సంభాషణలను సూచిస్తుంది. ఇక్కడ గురు గ్రహం బలమైన స్థానం, ప్రధాన అంతర్జాతీయ వేదికలపై చైనా భాగస్వామ్యాన్ని పెంచగలదు. మరో ముఖ్యమైన సూచన ఏంటంటే, చైనా జాతకంలో ఆగస్టు 25 నుంచి అక్టోబర్ 2 వరకు గురు ముద్రా దశ అమలులో ఉంటుంది. ఈ కాలం విదేశీ సంబంధాలు, పెద్ద సమూహాలు , దౌత్యపరమైన విజయాలతో ముడిపడి ఉంటుంది. ఇదే కాలంలో బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. ఈ యాదృచ్ఛికతను విస్మరించలేము. సెప్టెంబర్‌లో చైనా రాశిఫలాలు ప్రధాన విదేశీ పర్యటనలు, ఉన్నత స్థాయి చర్చలకు అవకాశం ఉందని సూచిస్తున్నాయి. ఇది షీ భారతదేశ పర్యటనకు ఉన్న అవకాశాలను బలపరుస్తుంది. అయితే, ఇక్కడ చేసిన విశ్లేషణ చైనా జాతీయ రాశిఫలాలను ప్రతిబింబిస్తుంది కానీ షీ వ్యక్తిగత రాశిఫలాలను కాదు కాబట్టి, దీనిపై ఒక నిశ్చయాత్మక నిర్ధారణకు రాలేము. భారతదేశ జాతకం వృషభ లగ్నం. సెప్టెంబరులో, గురు గ్రహం పొరుగువారు, సమాచార మార్పిడి చర్చలకు సంబంధించిన తృతీయ భావంలో ఉంటుంది. దీని అర్థం, న్యూఢిల్లీ చర్చల నుంచి వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. కానీ కథ ఇక్కడితో ముగియదు. భారతదేశ జాతకంలో, ఆ సమయంలో ఏడవ ఇంటికి సంబంధించిన రాహువు ముద్రా దశ ప్రభావంలో ఉంటుంది. రాహువు విదేశీ కార్యకలాపాలను పెంచుతుంది, కానీ అన్ని విషయాలపై స్పష్టతను ఇవ్వదు. ప్రజలు ఒకటి చెబుతుండగా, తెర వెనుక మరొకటి జరుగుతూ ఉండవచ్చు. ఈ కారణంగానే పర్యటన ప్రకటన ఆలస్యం కావచ్చు. మోదీ–షి జిన్‌పింగ్ సమావేశపు అజెండా కూడా చివరి నిమిషంలో మారవచ్చు. ఒక కీలక ప్రకటనపై చర్చ జరిగే అవకాశం కూడా ఉంది, కానీ దాని ఫలితం పరిమితంగానే ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, భారత్ తలుపులు తెరుస్తుంది, కానీ అప్రమత్తతను మాత్రం తగ్గించుకోదు. షీ రాకతో సరిహద్దు వివాదం పరిష్కారమవుతుందనడానికి ఎలాంటి సూచన లేదు. గ్రహాలు చర్చలకు సహకరిస్తున్నాయి, కానీ అవి తక్షణమే విశ్వాసాన్ని పునరుద్ధరిస్తున్నట్లు కనిపించడం లేదు. అవును, సరిహద్దులో సైనికుల ఘర్షణల ఘటనలను నివారించడానికి కొత్త పద్ధతులను కనుగొనవచ్చు. సైనిక అధికారుల మధ్య సమావేశాలు పెరగవచ్చు. గస్తీ నియమాలను మళ్లీ చర్చించవచ్చు. దీని అర్థం ఏంటంటే, సెప్టెంబర్‌లో ఒక పరిష్కారం దొరకకపోవచ్చు, కానీ పరిష్కారానికి ఒక కొత్త మార్గం దొరకవచ్చు. ఈ వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఇద్దరు నాయకులు కరచాలనం చేసినంత మాత్రాన వాస్తవ నియంత్రణ రేఖ వద్ద అంతా పరిష్కారమైనట్లు కాదు. భారతదేశంలో ఉపయోగించే మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు మరియు సౌర పరికరాలలోని అనేక భాగాలు చైనా నుంచి వస్తాయి. మెరుగైన సంబంధాలు వస్తువుల సరఫరాను సులభతరం చేయడంతో పాటు భారతీయ పరిశ్రమలకు అనిశ్చితిని తగ్గించగలవు. అయితే, మొబైల్ ఫోన్లు లేదా కార్లు వెంటనే చౌకగా మారతాయని చెప్పడం తప్పు. పన్నులు, డాలర్ విలువ, కార్పొరేట్ నిర్ణయాలు కూడా ధరలను నిర్ణయిస్తాయి. తక్షణ ప్రభావాలు ఇతర ప్రాంతాలలో కనిపించవచ్చు. ప్రత్యక్ష విమాన సర్వీసులు పెరగవచ్చు. వీసా నిబంధనలు సడలించబడవచ్చు. విద్యార్థులు, వ్యాపారవేత్తలు , యాత్రికుల రాకపోకలు సులభతరం కావచ్చు. ఇవి చిన్న అడుగులుగా అనిపించవచ్చు, కానీ రెండు దేశాల మధ్య దెబ్బతిన్న నమ్మకం తరచుగా ఇలాగే తిరిగి ఏర్పడుతుంది. భారత్, చైనా జాతకాలు సెప్టెంబర్‌లో చర్చలు జరుగుతాయని బలంగా సూచిస్తున్నాయి. షీ జిన్‌పింగ్ కూడా పర్యటించే అవకాశం ఉంది, బహుశా మోదీతో విడిగా సమావేశం కావచ్చు. కొన్ని చిన్న నిర్ణయాలు కూడా వెలువడవచ్చు. అయితే, ఈ జాతకం ఒక హెచ్చరికను కూడా అందిస్తోంది. చైనా చెప్పే మాటలను, క్షేత్రస్థాయిలో చేసే పనులను వేరువేరుగా విశ్లేషించాలి. అందువల్ల, సెప్టెంబర్ 12న షీ భారతదేశానికి రావడం ఈ కథకు ముగింపు కాదు. అది కేవలం ఆరంభం మాత్రమే అవుతుంది. సమావేశం తర్వాతే అసలైన సమాధానం వస్తుంది.

# రేవంత్ పట్టు కోల్పోతున్నారా



హైదరాబాద్ ఆగస్టు 26, : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చుట్టూ జరుగుతున్న అంతర్గత రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ శ్రేణుల్లోనే తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కాంగ్రెస్‌లో ఓ రకమైన పరిస్థితి ఉన్నప్పుడు విదేశీ పర్యటన ముగించుకుని సీఎం శంషాబాద్ విమానాశ్రయంలో దిగినప్పుడు కేవలం ఒకే ఒక్క జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే తప్ప మరే ఇతర ముఖ్య నేతలూ స్వాగతం పలికేందుకు రాలేదు. ఉదయం పది గంటలకు పిలిచిన ఎమ్మెల్యేల అత్యవసర సమావేశానికి మెజారిటీ ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడం అధికార పార్టీలో నెలకొన్న సమన్వయ లోపాన్ని బహిర్గతం చేస్తోంది. సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌కు మంత్రులు తీరిగ్గా, ఆలస్యంగా హాజరుకావడం క్షేత్రస్థాయిలో పార్టీ అధినేత పట్ల ఉండాల్సిన కమాండింగ్ తీరును ప్రశ్నించేలా చేస్తోంది. ప్రస్తుత రాజకీయ సమీకరణాలు, పార్టీలో ఉన్న సంఖ్యాబలం ప్రకారం కనీసం 50 నుంచి 60 మంది ఎమ్మెల్యేలు, మంత్రుల బలప్రదర్శన సహజంగా కనిపించాలి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో అధినేత మాటకు తిరుగులేని ఆధిపత్యం ఉండేది. అసంతృప్తి ఎంత ఉన్నా వైఎస్సార్ కనుసన్నల్లో ఉండేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు పరుగులు తీసేవారు. కానీ నేడు రేవంత్ రెడ్డి విషయంలో అంతటి రాజకీయ భయం, క్రమశిక్షణ కనిపించడం లేదు. ప్రెస్‌మీట్లలోనూ కేవలం కొద్దిమంది మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రమే కనిపించడం వల్ల.. వారే రేవంత్ వర్గీయులని, మిగిలిన వారంతా వ్యతిరేకులనే ప్రచారం ప్రజల్లోకి వెళ్లేందుకు ఆస్కారం కల్పిస్తోంది. ఒక ప్రాంతీయ లేదా రాష్ట్ర స్థాయి అగ్రనేతకు ఉండాల్సిన ప్రధాన బలం రాజకీయ పట్టు. ముఖ్యమంత్రి కార్యాలయం, రేవంత్ రెడ్డి తరపు నుంచి ఏదైనా ఆదేశం వచ్చిందంటే.. నాయకులు తమ వ్యక్తిగత అసంతృప్తిని పక్కన పెట్టి శిరసావహించే స్థాయి అధికారం, విశ్వసనీయత ఉండాలి. అయితే, గ్రూపు రాజకీయాలకు చిరునామా అయిన కాంగ్రెస్ సంస్కృతిలో పలువురు సీనియర్ మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు స్వతంత్రంగా వ్యవహరిస్తుండటంతో అధికార కేంద్రం ఎక్కడ ఉందనే అయోమయం నెలకొంది. సమన్వయ లోపాలు విపక్షాల విమర్శలకు, పార్టీలో అసమ్మతి రగులుతోందన్న కథనాలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ వైఫల్యాలన్నింటినీ గమనిస్తే రేవంత్ రెడ్డికి పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలను నడిపించే ఒక సమర్థవంతమైన పొలిటికల్ మేనేజర్ లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో వైఎస్సార్‌కు కేవీపీ రామచంద్రరావు లాంటి వ్యూహకర్తలు తెరవెనుక ఉండి అసంతృప్తులను బుజ్జగించడం, మంత్రులు–ఎమ్మెల్యేలను సమన్వయం చేయడం, హైకమాండ్‌కు సీఎం బలాన్ని ప్రదర్శించడం వంటి పనులను పకడ్బందీగా నిర్వహించేవారు. రేవంత్ రెడ్డి స్వయంగా దూకుడుగా ఉన్నప్పటికీ, ఆయన తరపున పార్టీలోని విభిన్న వర్గాలను ఏకతాటిపైకి తెచ్చే బలమైన అంతర్గత సమన్వయకర్త లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ, ప్రతి ఒక్కరిని కలుపుకుపోయే అంతర్గత వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం రేవంత్ రెడ్డికి చాలా ఉంది.

# అధ్యక్షా పదవులు ఎప్పుడు...



హైదరాబాద్ ఆగస్టు 26, : తెలంగాణలో అధికారంలోకి వచ్చి మూడేళ్ల సమయం గడుస్తున్నా, పార్టీ కోసం పని చేసిన క్షేత్రస్థాయి కార్యకర్తలను కాంగ్రెస్ నాయకత్వం కనీసం పట్టించుకోకపోవడంపై పార్టీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు కేవలం తమ పదవులు, అధికారిక ప్రాధాన్యతలకే పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జుల వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కార్యకర్తల గుర్తింపు విషయంలో వారి నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడం పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరుకు అద్దం పడుతోంది. సహకార సంఘాలు, మార్కెట్ కమిటీలు, వివిధ కార్పొరేషన్లు , స్థానిక నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం వెంటనే ప్రతిపాదనల జాబితాను అందజేయాలని మహేష్ గౌడ్ పలుమార్లు మంత్రులు, ఎమ్మెల్యేలను కోరినప్పటికీ, వారి నుంచి ఆశించిన స్పందన రాకపోవడం శోచనీయం. నియోజకవర్గ స్థాయిలో కష్టపడిన నాయకుల వివరాలను పంపాల్సిందిగా పదే పదే సూచిస్తున్నా, నేతలు జాబితాలను పంపడంలో జాప్యం చేస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో 70 శాతం పదవులను ఏళ్లనుంచి పార్టీని నమ్ముకుని ఉన్న పాతవారికి, 30 శాతం పదవులను కొత్తగా వచ్చిన వారికి సిఫార్సు చేయాలని స్వయంగా పార్టీ అధినేతే బతిమాలుతున్నట్లుగా కోరుతున్నా నేతలు పట్టించుకోకపోవడం పట్ల కేడర్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు పదవులు, ప్రాధాన్యతలు దక్కితే చాలన్నట్లుగా కొందరు మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాత్రింబవళ్లు శ్రమించి పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన సాధారణ కార్యకర్తలు, ఇప్పుడు తమ సమస్యలు చెప్పుకుందామన్నా మంత్రులు, ఎమ్మెల్యేల దర్శనం దొరకని పరిస్థితి నెలకొంది. కనీసం తమకు రావలసిన నామినేటెడ్ పోస్టుల విషయంలోనైనా న్యాయం జరుగుతుందా అంటే, నేతల అలసత్వం వల్ల ఆ ప్రక్రియ కూడా మూలనపడిపోతోందని కింది స్థాయి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కేడర్‌ను గౌరవించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ స్వార్థ రాజకీయాలను, వర్గపోరును పక్కనపెట్టి తక్షణమే నామినేటెడ్ పోస్టుల జాబితాలను టీపీసీసీకి పంపించకపోతే, కింది స్థాయిలో మొదలైన ఈ అసంతృప్తి జ్వాలలు పార్టీకి పెద్ద గండంగా మారే ప్రమాదం ఉంది.

# ఆధ్యాత్మిక పిఠాపురానికి అభివృద్ధి వెలుగులు

**- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రూ.30.66 కోట్లు కేటాయింపు**

**- 24 దేవాలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు**

**- టీటీడీ కల్యాణ మండపానికి రూ.2 కోట్లు**

**- 48 భజన మందిరాలకు రూ.11.60 కోట్లు**

**- లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు'**



మంగళగిరి, ఆగస్టు 26 : ఆధ్యాత్మికత కొలువైన క్షేత్రంలో అభివృద్ధి ఉండాలి.. చరిత్ర ఉన్న చోట పరిరక్షణ ఉండాలి.. సంస్కృతి ఉన్న చోట అది మరింత శోభిల్లాలి" అనేది ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దృఢ సంకల్పం. పిఠాపురం నియోజకవర్గ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, ఆ వైభవాన్ని భవిష్యత్ తరాలకు మరింత ఘనంగా అందించాలనే ఆయన కార్యాచరణ ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదాలుస్తోంది. పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రత్యేక చొరవ తీసుకొని, నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి , భజన మందిరాల నిర్మాణం, కళ్యాణ మండపాల ఏర్పాటు కోసం ఏకంగా రూ. 30.66 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఆయన నిరంతర పర్యవేక్షణలో ఈ అభివృద్ధి పనులు ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం రూ.17.06 కోట్ల నిధులను కేటాయించారు. ఈ నిధులతో ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మతులతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరింది. కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం కొత్తపల్లి వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల క్వార్టర్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. శ్రీ కుంతీ మాధవస్వామి ఆలయంలో కాలక్షేప మండపం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాజగోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కుక్కుటేశ్వర స్వామి ఆలయానికి రూ.5 కోట్లు, శ్రీ పాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు కానున్నాయి. పునరుద్ధరణ జరుగుతున్న ఆలయాల్లో శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పిఠాపురంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన 10వ శతాబ్దం నాటి శ్రీ కుంతీమాధవ స్వామి ఆలయంతోపాటు, పిఠాపురం మహారాజుల కాలం నాటి అనేక పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ఏటా సుమారు 13.76 లక్షల నుంచి 18.07 లక్షల మంది భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లోనే కాకుండా పండుగలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. ఆయా పర్వదినాల్లో రోజుకు 20 వేల నుంచి ఏకంగా 50 వేల మంది వరకు భక్తులు తరలివస్తుంటారు. ఈ భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో గతంలో పాడా ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని అన్ని ఆధునిక వసతులతో పునర్నిర్మించారు. అలాగే, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ మాడ వీధుల విస్తరణ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుతం యు.కొత్తపల్లి మండలంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లను ప్రత్యేకంగా కేటాయించారు. వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, ఇతర సామాజిక అవసరాలకు అనువుగా అత్యాధునిక వసతులతో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో 419 భజన మందిరాలను పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో తొలి దశలో 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ భజన మందిరాలు కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా.. భజనలు, ఆధ్యాత్మిక సమావేశాలు, స్థానిక సాంస్కృతిక వేడుకలు, గ్రామస్థాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా రూ.30.66 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణతోపాటు ఆలయాల ఆధునికీకరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, గ్రామీణ సామాజిక వేదికల బలోపేతానికి దోహదపడనున్నాయి.

# 11 విమానాశ్రయాల అభివృద్ధికి పీపీపీ



న్యూఢిల్లీ, ఆగస్టు 26,: దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న సంగతి తెలిసిందే. అందుబాటు ధరల్లో ప్రయాణాలు చేసే అవకాశం కల్పించడం, పెరుగుతున్న ఆదాయం, బిజీ షెడ్యూల్స్ ఏదైనా కారణం కావొచ్చు కాలం గడుస్తున్న కొద్దీ విమానాశ్రయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా విమానాశ్రయాల్లో మౌలిక వసతుల్ని మరింత అభివృద్ధి చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తిరుపతి, వారణాసి సహా మొత్తం 11 విమానాశ్రయాల్ని ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రతిపాదన సిద్ధమైంది. ఆగస్ట్ 4న జరిగిన పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం లభించింది. సుమారు 50 ఏళ్ల రాయితీ కాలానికి ప్రైవేట్ ఆపరేటర్లకు ఈ ఎయిర్‌పోర్టుల్ని అప్పగించాలని కేంద్రం యోచిస్తోంది.ప్రభుత్వ అంచనాల ప్రకారం ఈ 11 విమానాశ్రయాల అభివృద్ధి, విస్తరణ కోసం ప్రైవేట్ సంస్థలు దాదాపు రూ. 8622 కోట్ల మేర పెట్టుబడుల్ని పెట్టాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ విమానాశ్రయాల్ని మొత్తం 5 బండిల్స్‌గా విభజించి, ప్రతి బండిల్‌ను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించనున్నారు. దీంట్లో భువనేశ్వర్- హుబ్బళ్లి బండిల్‌కు అన్నింటికంటే ఎక్కువగా రూ. 2725 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. వారణాసి- గయా- కుషీనగర్ బండిల్‌కు రూ. 2467 కోట్లు, రాయ్‌పూర్- ఔరంగాబాద్‌కు రూ. 1496 కోట్ల పెట్టుబడి పడుతుందని తెలుస్తోంది. ఇక తిరుపతి- తిరుచిరాపల్లి ఒక బండిల్‌లో ఉండగా వీటి విస్తరణకు రూ. 1411 కోట్లు పడుతుందని అంచనా వేస్తున్నారు. చివరగా అమృత్‌సర్- కాంగ్రా బండిల్‌కు రూ. 523 కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. ఈ విధానంలో పెద్ద విమానాశ్రయాల్ని చిన్న ఎయిర్‌పోర్ట్‌లతో కలిపి ఒక బండిల్‌గా రూపొందిస్తున్నారు.విమానాశ్రయాల నిర్వహణ మొత్తం కొద్ది సంస్థల చేతుల్లోనే ఉండకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఒకే బిడ్డర్‌కు ఎన్ని విమానాశ్రయ బండిల్స్ ఇవ్వాలనే అంశంలో పరిమితి విధించాలని నిర్ణయించింది. ఇక్కడ ఒకే సంస్థకు ఎక్కువ ప్రాజెక్టులు దక్కితే భారీగా అప్పులు చేయడం వల్ల ఎదురయ్యే ఆర్థిక సమస్యల్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే ఒకే సంస్థకు ఎన్ని బండిల్స్ ఇవ్వాలనే విధానంపై ఇంకా తుది నిర్ణయం మాత్రం తీసుకోలేదు. ప్రైవేట్ సంస్థలకు అప్పగించిన తర్వాత ఇప్పటికే ఆమోదం పొందిన మూలధన వ్యయంతో పాటు విమానాశ్రయాల సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన అదనపు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది.గతంలో 2019లో కూడా విమానాశ్రయాల ప్రైవేటీకరణకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. అప్పుడు 6 విమానాశ్రయాల్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు బిడ్డింగ్ నిర్వహించగా, అదానీ గ్రూప్ అన్ని విమానాశ్రయాల్ని దక్కించుకుంది. ఇదే సమయంలో ఇప్పుడు దేశీయ విమాన ప్రయాణానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్, ఢిల్లీ విమానాశ్రయాల విస్తరణకు కూడా భారీ పెట్టుబడులు వస్తున్నాయి. హైదరాబాద్ విమానాశ్రయం విస్తరణ కోసం సుమారు రూ. 13800 కోట్లు, ఢిల్లీ విమానాశ్రయం కోసం రూ .5600 కోట్లు పెట్టుబడులు పెట్టే ప్రణాళికలు ఉన్నాయి

# మోదీ మాస్టర్ స్ట్రోక్!



న్యూఢిల్లీ, ఆగస్టు 26, : భారత రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలకమైన 'జమిలి ఎన్నికల' విధానంపై మరోమారు చర్చ మొదలైంది. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ సర్కారు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల శాసన సభ ఎన్నికలను కలిపి నిర్వహించడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నది. భారత ఎన్నికల వ్యవస్థలో పెద్ద మార్పు తీసుకురావాలనే ప్రయత్నం కొన్ని నెలలుగా కొనసాగుతోంది. లోక్‌సభ, విధానసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే 'వన్ నేషన్?వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చర్చలు తీవ్రమవుతున్నాయి. కమిటీ ఛైర్మన్ పీపీ చౌదరి ఇటీవల అప్‌డేట్‌లో స్టేక్‌హోల్డర్లలో అధిక శాతం మద్దతు ఉందని, 2034కు బదులు 2029లోనే అమలు వెనక్కి కానీ ముందుకు కానీ జరుపుకునేందుకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది.2029లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్,




చేయవచ్చని సూచించారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశం అయింది.జేపీసీ ఛైర్మన్ పీపీ చౌదరి ప్రకారం, ఇప్పటివరకు సంప్రదించిన సివిల్ సొసైటీ, నిపుణులు, వివిధ సంస్థల్లో సుమారు 99 శాతం మంది జమిలి ఎన్నికలకు అనుకూలంగా మాట్లాడారు. కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తోంది. రాజ్యాంగ సవరణ 2028లోగా పూర్తయితే, 2029 లోక్‌సభ ఎన్నికలతోపాటు కొన్ని విధానసభలను కలిపి నిర్వహించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి కీలకం. కొన్ని రాష్ట్రాలు తమ అసెంబ్లీలను ముందస్తుగా రద్దు చేసి చక్రం సరిపోల్చుకుంటే మరింత సులభమవుతుంది. దేశంలోని 17 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా అధికారంలో ఉన్నది. మరో ఐదు రాష్ట్రాల్లో బీజేపీ మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయి. అలా మొత్తంగా 22 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న సమయానికి ముందే ఎన్డీయే పాలిత 11 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే మరో నాలుగు ఎన్డీయే రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మిగతా ఏడు ఎన్డీయేపాలిత రాష్ట్రాల ఎన్నికలు 2030-31 మధ్య జరుగనున్నాయి. దీంతో జమిలి ఎన్నికల కోసం తమ రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పాలనను ఒడిశా, సిక్కిం, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో 'జమిలి' ప్రక్రియకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కావడం లేదు. అయితే 2028లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, త్రిపుర, తెలంగాణ, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం అసెంబ్లీల గడువు ముగుస్తున్నది. జమిలి ఎన్నికల కోసం ఆయా అసెంబ్లీల కాలాన్ని 5 నెలల నుంచి ఏడాది వరకు పొడిగించాల్సి ఉంటుంది.ఇక బీహార్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీల గడువు 2030-31లో ముగియనున్నది. వాటి గడువును ఒకటి నుంచి రెండేండ్లు తగ్గించాల్సి వస్తుంది. అయితే, ఇంతటి భారీ సంస్కరణకు పార్లమెంట్ శాసనపరమైన మార్పులు చేయడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ప్రతిపాదనను జార్ఖండ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్ష ప్రభుత్వాలు పెద్దయెత్తున వ్యతిరేకించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలోనే తొలుత తాము అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో జమిలి ప్రక్రియను కొనసాగించడానికి ఎన్డీయే ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.గతంలో 2034ని లక్ష్యంగా చెప్పినా, ఇప్పుడు ముందుకు తీసుకురావాలనే ఆలోచన బలపడుతోంది. ఇది రెండు దశల్లో అమలు కావచ్చు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం, ప్రియాంకా గాంధీ వాద్రా, సాగరికా ఘోష్, సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. చిదంబరం బలంగా వ్యతిరేకించారు. ప్రస్తుత రూపంలోని ప్రతిపాదన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని దెబ్బతీస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ఎన్నికైన అసెంబ్లీల పదవీకాలాన్ని తగ్గించడం సమస్యాత్మకమని అభిప్రాయపడ్డారు. మరోవైపు పద్మ అవార్డు గ్రహీతలు, కొన్ని పాలసీ గ్రూపులు జాతీయ ప్రయోజనంగా చూశారు. అయితే తగిన రక్షణలు, స్పష్టమైన నిబంధనలు అవసరమని సూచించారు. ఎన్నికల కమిషన్‌కు అధిక అధికారాలు రాకుండా జాగ్రత్తలు కావాలని కూడా అభిప్రాయాలు వచ్చాయి.మద్దతుదారులు పదేపదే ఎన్నికల వల్ల జరిగే ఆర్థిక నష్టం, అభివృద్ధి పనుల్లో అంతరాయం, మోడల్ కోడ్ వల్ల పాలనా స్తంభనను ఎత్తి చూపుతున్నారు. జమిలి ఎన్నికలు ఖర్చు తగ్గించి, పాలనకు స్థిరత్వం ఇస్తాయని వాదిస్తున్నారు. ఇక వ్యతిరేకులు ఫెడరల్ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం, ప్రాంతీయ సమస్యలు జాతీయ అంశాల్లో కలిసిపోయే అవకాశం, చిన్న పార్టీలపై ప్రభావం లాంటి వాటిని లెక్కపెడుతున్నారు.జేపీసీ నివేదిక శీతాకాల సమావేశం వరకు వాయిదా పడింది. రాజకీయ సమ్మతి ఏర్పడితే 2029లో పాక్షికంగా అయినా అమలు సాధ్యమే. లేకపోతే 2034 వైపు వెళ్తుంది. ఈ ప్రతిపాదన భారత ప్రజాస్వామ్య పనితీరును పునర్నిర్మించే ప్రయత్నం. సమ్మతి, రాజ్యాంగ రక్షణలు, రాష్ట్రాల సహకారం లేకుండా ముందుకు సాగడం కష్టం. భవిష్యత్ దిశను నిర్ణయించేది పార్లమెంట్ చర్చలు, రాజకీయ సంకల్పమే.కుల గణన విధానంపై విశ్లేషకులు, కార్యకర్తలు, రాజకీయ నేతలతో 'స్క్రోల్' సంస్థ మాట్లాడినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారిలో అధికశాతం మంది కులాలను లెక్కించేందుకు ఎన్నుకున్న పద్ధతి లోపభూయిష్టమని అన్నారు. ఇటీవల బీహార్, తెలంగాణ తదితర రాష్ట్రాలు కులగణన నిర్వహించినప్పుడు 2011 మోడల్‌కు కట్టుబడి ఉండాలనే మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని వారు ప్రశ్నించారు. జనాభా లెక్కల్లో సేకరించే కుల డేటా నిరుపయోగంగా మారుతుందని కొందరు విమర్శకులు వాదించారు. 2021 సెప్టెంబర్ 21న మోదీ ప్రభుత్వం కుల గణన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. అఫిడవిట్‌లోని 12(డి) పేరాలో '2011 జనాభా లెక్కల నిర్వహణకు ముందు కులాల రిజిస్ట్రీ ఏదీ సిద్ధం చేయలేదు' అని ఉంది. కాగా కులగణన కోసం ఎన్యూమరేటర్లు మొదట ప్రజలను షెడ్యూల్ కులాలు(ఎస్సీ) లేదా షెడ్యూల్ తెగలకు(ఎస్టీ) చెందినవారా కాదా అని అడుగుతారు. ఈ సమయంలో ప్రజలు తమ కులాన్ని ప్రకటించడానికి ఇష్టపడటం లేదని చెప్పే అవకాశం కూడా ఉందని 'ది హిందూ' పేర్కొంది. కాగా కులంపై పరిమితులు లేని ప్రశ్నలు ఉండటం వలన వైవిధ్యంతో కూడిన సమాధానాలు వస్తాయని ఇది అద్భుతమైన విశ్లేషణ అందించదని విమర్శకులు వాదిస్తున్నారు. 2001 నుంచి జనాభా లెక్కల్లో కులం లెక్కింపుపై వాదన చేస్తున్న సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్ పాండే దీనిని ప్రణాళికాబద్ధమైన వైఫల్యం అని పేర్కొన్నారు. కులం గురించి పలు ప్రశ్నలు అడగడం వల్ల ఒకే సమాజానికి చెందిన వారు వేర్వేరు కులాల పేర్లతో తమను తాము గుర్తించుకునే అవకాశం ఉంది.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

**- కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు.. ఆరుగురు స్పాట్ డెడ్**



హైదరాబాద్, ఆగస్టు 26, : హైదరాబాద్?విజయవాడ హైవేపై కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఐరన్ రాడ్ల లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 20 మందికి తీవ్రంగా గాయపడ్డారు. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.హైదరాబాద్- విజయవాడ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ముందు వెళ్తున్న కంటైనర్ డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని ఆరుగురు ప్రయాణికులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలో ఇవాళ తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి ఏలూరుకు అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బయల్దేరింది. బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉండగా.. సూర్యాపేటకు చేరుకోగా డ్రైవర్ ఛేంజ్ అయ్యారు. ఆ తర్వాత బస్సు బయల్దేరగా.. కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలోకి చేరుకోగానే ముందు ఐరన్ రాడ్లతో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. బస్సు రైట్ యాక్సిడెంట్ కాకా.. ఐరన్ రాడ్లు బస్సులోపలికి దూసుకెళ్లాయి. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లతో కలిపి మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొన్నారు. సహాయక చర్యలు చేట్టి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని డాక్టర్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా.. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు, మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అమెరికా మరో దుందుడుకు చర్య

**- వీసా ఇంటర్వ్యూల నిలిపివేత**



వాషింగ్టన్,ఆగస్ట్26 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలతో వలసదారుల్ని వణికిస్తున్నారు. తాజాగా అమెరికా ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను అర్ధంతరంగా నిలిపివేసింది. కొన్ని షెడ్యూల్ ఇంటర్వ్యూలను రద్దు చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని, దానిలో భాగంగానే వీసా అపాయింట్‌మెంట్ల సర్దుబాటు జరుగుతుందని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ అయిన దరఖాస్తుదారులకు రద్దుపై మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రీషెడ్యూలింగ్ సమయం గురించి త్వరలో తెలియజేయనున్నారు. రాయబార కార్యాలయాల్లో నిర్వహిస్తోన్న శిక్షణ కార్యక్రమం దేని గురించి, అది ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై విదేశాంగ శాఖ పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే.. యూఎస్ ప్రభుత్వ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న దరఖాస్తుదారులను కాన్సులర్ అధికారులు వడపోసి, తొలగించేలా ఈ శిక్షణ కార్యక్రమం ఉండనున్నట్లు తెలుస్తోంది.

# ఖైదీతో మహిళా అధికారి న్యూడ్ కాల్....



బెంగళూరు, ఆగస్టు 26, : కర్ణాటకలో ఓ మహిళా పోలీస్ అధికారికి సంబంధించిన వీడియో కాల్ వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. బెళగావిలోని హిండాల్గా సెంట్రల్ జైలులో ఉన్న వ్యక్తితో ఆమె వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వీడియోలో అధికారి అభ్యంతరకర రీతిలో కనిపించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీడియో వైరల్ కావడంతో పోలీసు శాఖలోనూ చర్చనీయాంశంగా మారింది.తాజా సమాచారం ప్రకారం.. ఈ వ్యవహారానికి సంబంధించి ఆ మహిళా అధికారి బెంగళూరులోని కబ్బన్ పార్క్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తనకు సంబంధించిన వీడియోను కొందరు వ్యక్తులు రికార్డు చేసి, ఇతరులకు పంపించారని ఆమె ఆరోపించినట్లు రిపోర్టులు చెబుతున్నాయి. ఈ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.వైరల్ అయిన క్లిప్‌లో మహిళా పోలీస్ అధికారి యూనిఫామ్‌లో కనిపించినట్లు, అనంతరం అభ్యంతరకర స్థితిలో ఉన్న దృశ్యాలు ఉన్నట్లు పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వీడియో ఎప్పుడు, ఎలా రికార్డు అయింది? దాన్ని ఎవరు బయటకు పంపించారు? ఖైదీ వద్దకు మొబైల్ ఫోన్ ఎలా చేరింది? వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. అందువల్ల సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి వాదనను వాస్తవంగా పరిగణించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.లో కర్ణాటక జైళ్లలో ఖైదీలకు మొబైల్ ఫోన్లు, ఇతర నిషేధిత వస్తువులు ఎలా అందుతున్నాయనే అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఇటీవలే బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో తనిఖీలు నిర్వహించగా మొబైల్ ఫోన్ సహా నిషేధిత వస్తువులు బయటపడిన విషయం తెలిసిందే. జైళ్లలో అక్రమ కార్యకలాపాలను సహించబోమని హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే హెచ్చరించారు.ఖైదీ హైప్రొఫైల్ వ్యక్తి అయినా, సాధారణ ఖైదీ అయినా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఖర్గే స్పష్టం చేశారు. జైళ్లలో నిషేధిత పరికరాలకు అవకాశం కల్పించే అధికారులు, సిబ్బందిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అవసరమైతే నేరం రుజువైన అధికారులను ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం ఉందని చెప్పారు.ఇదిలా ఉండగా, మహిళా పోలీస్ అధికారికి సంబంధించిన ఈ వీడియో ఘటనపై పూర్తి వివరాలు దర్యాప్తు తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది. వీడియో నిజమైనదేనా, దాని పూర్తి నేపథ్యం ఏమిటి, దాన్ని ఎవరు రికార్డు చేసి వైరల్ చేశారు, జైలులోని నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించారా అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటన పోలీసు శాఖ ప్రతిష్ఠ, జైలు భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది.

# బస్సు ప్రమాద ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి

**- అధికారులతో ఆరా తీసిన పవన్ కళ్యాణ్**

**- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్న లోకేశ్**

**- భద్రతా ప్రమాణాలపై మంత్రి మండిపల్లి సమీక్ష**






అమరావతి,ఆగస్ట్26 : సూర్యాపేట జిల్లాలోని కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలను అధికారుల ద్వారా పవన్ తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర అధికారులతో ఏపీ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.ఈ బస్సు ప్రమాదంపై ఏలూరు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. డీసీఎం కంటైనర్‌ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో ఆరుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నుంచి ఏలూరు వస్తుండగా ఈ బస్సు ప్రమాదానికి గుర్రైంది. సూర్యాపేట పోలీసులతో ఏలూరు పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారు. మృతులు, క్షతగాత్రుల వివరాల కోసం అధికారులు ఆరా తీస్తున్నారు.

# కళ్ల ముందే నా భార్య చనిపోయింది

**- డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం అంటూ ప్రయాణికుల రోదన**

సూర్యాపేట,ఆగస్ట్26 : తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదం గురించి బస్సులో ప్రయాణిస్తూ.. తృటిలో ప్రాణాలతో బయటపడ్డ ప్రయాణికుడు చెప్పిన మాటలు వింటే కన్నీళ్లు రాక మానవు.హైదరాబాద్ నుండి ఏలూరు వెళ్తుండగా కోదాడ మండలం దుర్గాపురం స్టేజి వద్ద ఈ ప్రమాదం జరిగింది. టీ బ్రేక్ తీసుకున్న అనంతరం బస్సు తిరిగి ప్రారంభమైన గంటలోపే ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగినట్లు బస్సులో ప్రయాణిస్తున్న ఓ క్షతగాత్రుడు చెప్పాడు. వెనుక సీట్లో తన భార్య కూర్చుందని, ప్రమాదంలో ఆమె మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే ముందు సీట్లలో కూర్చున్న ప్రయాణికులకు కూడా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారన్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని క్షతగాత్రుడు ఆరోపిస్తున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే పెద్దపెద్ద ఇనుప రాడ్లు బస్సులోని ప్రయాణికులపై పడటంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయని, ఆ గాయాల కారణంగానే కొంతమంది ప్రాణాలు కోల్పోయారని చెప్పాడు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ఆరుగురి ప్రాణాలు బలితీసుకుందని ప్రయాణికులు చెబుతున్నారు. అప్పటికే ప్రమాదానికి గురై రోడ్డుపై ఆగిపోయిన లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన తర్వాత లారీ రోడ్డుపైనే ఆగిపోవడం, ఆ లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ గుర్తించకపోవడం వల్లే ప్రాణనష్టం జరిగిందన్నా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే ఆసుపత్రికి చేరుకునేలోపే మృతి చెందారని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. మరో 14 మంది తీవ్ర గాయాలతో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన 14 మందిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రమాదం అనంతరం ఆసుపత్రికి వచ్చిన క్షతగాత్రులకు తల, ఛాతి, కడుపు భాగాల్లో తీవ్ర గాయాలైనట్లు చెబుతున్నారు. బలమైన ఇనుప రాడ్లపై పడటం వల్లే పలువురికి తీవ్ర గాయాలయ్యాయన్నారు.

## ఉద్యోగ సంఘాల మధ్య
# ఆధిపత్య పోరు

గుంటూరు ఆగస్టు 26, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన సంఘాల్లో అంతర్గత ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. ఉద్యోగ వర్గాల్లో బలమైన పట్టు కోసం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ మధ్య తీవ్రమైన పోటీ వాతావరణం నెలకొంది. పెండింగ్ డీఏలు , పే రివిజన్ కమిషన్ నియామకం, పాత పెన్షన్ స్కీమ్ , పెండింగ్ బిల్లుల విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై పోటాపోటీగా ప్రకటనలు గుప్పిస్తూ ఇరు నేతలు మీడియా వేదికగా బలప్రదర్శనకు దిగుతున్నారు. ఉద్యోగుల పక్షాన తామే అసలైన గొంతుకగా నిలుస్తున్నామనే ముద్ర వేయించుకునేందుకు సాగుతున్న ఈ ప్రయత్నం సంఘాల మధ్య ఐక్యతను దెబ్బతీస్తోంది.క్షేత్రస్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కంటే సంఘాల రాజకీయ మైలేజీకే నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ముందు విడివిడిగా వినతిపత్రాలు సమర్పించడం, విడివిడిగానే ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడం ద్వారా ఉద్యోగులను రెండు వర్గాలుగా విభజిస్తున్నారనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియామకం, డీఏ బకాయిలపై ఎవరు ముందుగా ప్రభుత్వాన్ని ఒప్పించారనే క్రెడిట్ కొట్టేయడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పావులు కదుపుతున్నాయి. ప్రభుత్వ పెద్దలతో ఎవరు సన్నిహితంగా ఉంటూ ఉద్యోగుల పనులు చేయిస్తారనే పోటీ కూడా వీరి ఆధిపత్య సమరానికి మరింత ఆజ్యం పోస్తోంది.ఈ నాయకుల వ్యక్తిగత ప్రతిష్ట, అంతర్గత రాజకీయాల కారణంగా అసలు ఉద్యోగుల ప్రయోజనాలు గాల్లో దీపంలా మారుతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆయా సమయాల్లో ప్రభుత్వానికి అనుకూలంగానో లేదా ఉద్యమాలను నీరుగార్చేలానో వ్యవహరించారనే ఆరోపణలు ఇప్పటికే ఇరు నేతలపై ఉన్నాయి. గతంలో ఉమ్మడి పోరాటాలతో ప్రభుత్వాలను కదిలించిన చరిత్ర కలిగిన ఉద్యోగ సంఘాలు, నేడు కేవలం నాయకుల ఉనికి, భవిష్యత్ రాజకీయ ఆకాంక్షల కోసం వేర్వేరు కుంపట్లు పెట్టుకోవడం సాధారణ ఉద్యోగుల్లో తీవ్ర నిరాశను నింపుతోంది.ఒకే డిమాండ్ కోసం విడివిడిగా ఉద్యమాలు చేయడం వల్ల ప్రభుత్వానికి సాకులు చెప్పుకునే అవకాశం దక్కుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. నాయకులు తమ వ్యక్తిగత రాజకీయాలను, ఆధిపత్య పోరును పక్కన పెట్టి ఐక్య కార్యాచరణతో ముందుకు రాకపోతే ఉద్యోగుల హక్కులు సాధించుకోవడం మరింత క్లిష్టంగా మారుతుందని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం వైసీపీ హయాంలో ఉద్యోగ సంఘాలు చేసిన విన్యాసాలను చూసిన తర్వాత అసలు వారి డిమాండ్లను పట్టించుకోవడం లేదు. తాము చేయాలనుకున్నదే చేస్తోంది.

# బెజవాడ బరిలో వారసులు




విజయవాడ, ఆగస్టు 26,: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి క్రమంగా పెరుగుతోంది. అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన , భారతీయ జనతా పార్టీ తమ తమ వ్యూహాలతో ఎన్నికల సన్నాహకాల్లో నిమగ్నమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ పదవులతో పాటు పట్టణ ప్రాంతాల్లో మేయర్, చైర్‌పర్సన్ స్థానాలపై రాజకీయ పార్టీల దృష్టి ఎక్కువగా ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మేయర్ పీఠాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు.ఈ క్రమంలో విజయవాడ మేయర్ పదవికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్ర రాజకీయాల్లో విజయవాడకు ఉన్న ప్రాముఖ్యత, అమరావతి కి సమీపంలో ఉండటం, నగరంలో ఉన్న రాజకీయ చైతన్యం కారణంగా ఇక్కడి మేయర్ స్థానం కోసం పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. అయితే ఈసారి పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని నగర పాలనపై పట్టు సాధించాలని టీడీపీ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.మేయర్ పదవి కోసం టీడీపీలో ఇప్పటికే పలువురు ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో రాజకీయ కుటుంబాలకు చెందిన వారసుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి వరుసగా విజయం సాధించిన ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు కుటుంబం నుంచి కూడా ఒక పేరు చర్చకు వస్తోంది. తన కుమారుడిని రాజకీయాల్లోకి తీసుకురావడానికి మేయర్ పదవి మంచి వేదికగా ఉంటుందని బోండా ఉమా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఇటీవల బోండా కుమారుడు రాజకీయ అంశాలపై స్పందిస్తూ మీడియా ముందుకు రావడం కూడా ఈ ఊహాగానాలకు బలం ఇచ్చింది. దీంతో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయవాడ మేయర్ ఎన్నికల్లో కాపు సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని టీడీపీ పరిశీలిస్తే, బోండా కుటుంబానికి అవకాశం దక్కవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.మరోవైపు విజయవాడ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న వంగవీటి కుటుంబం ఎ) పేరు కూడా తెరపైకి వస్తోంది. వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ కొంతకాలంగా రాజకీయంగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. గతంలో విశాఖపట్నంలో నిర్వహించిన రంగానాడు కార్యక్రమం ద్వారా ఆమె రాజకీయంగా చర్చలోకి వచ్చారు. ఆమె జనసేన వైపు వెళ్తారనే ప్రచారం కూడా గతంలో జరిగింది.అయితే ఇప్పుడు ఆశా కిరణ్‌ను టీడీపీలోకి తీసుకువచ్చి విజయవాడ మేయర్ అభ్యర్థిగా నిలబెట్టే ఆలోచన ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. వంగవీటి కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కాపు సామాజిక వర్గాన్ని మరింత దగ్గర చేసుకునే వ్యూహంలో భాగంగా దీనిని చూడవచ్చని విశ్లేషణలు సాగుతున్నాయి. ఇప్పటికే వంగవీటి రాధాకృష్ణ టీడీపీలో కొనసాగుతున్నారు.మేయర్ పీఠం కోసం పోటీ పడుతున్న పేర్లు, సామాజిక సమీకరణాలు, రాజకీయ వారసుల ప్రవేశం వంటి అంశాలు ఎన్నికల సమయానికి మరింత స్పష్టత పొందే అవకాశం ఉంది. చివరకు పార్టీ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. విజయవాడ మేయర్ ఎన్నిక కేవలం ఒక నగర పాలక సంస్థ పోరుగా కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావం చూపించే పోటీగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కేరళలో ట్రీట్ మెంట్ కు పవన్...
## పొలిటికల్ స్టైల్ కు మారలేకపోతున్న జనసేనాని



విజయవాడ, ఆగస్టు 26, : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశాలకు వరుసగా గైర్హాజరవుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి తర్వాత కేబినెట్‌లో కీలక స్థానం కలిగిన డిప్యూటీ సీఎం తరచూ సమావేశాలకు దూరంగా ఉండటం.. ప్రభుత్వ పరిపాలనపై, జనసేన పాత్రపై ప్రతిపక్షాలకు విమర్శలు చేసే అవకాశం కల్పిస్తోంది.పవన్ కల్యాణ్ గైర్హాజరీకి ప్రధాన కారణం ఆయన ఆరోగ్య పరిస్థితేనన్న చర్చ సాగుతోంది. గతంలో ఎదురైన గాయాలు, వెన్ను సంబంధిత సమస్యలు, అనారోగ్య సమస్యల కారణంగా ఆయనకు అప్పుడప్పుడు విశ్రాంతి అవసరమవుతోందని తెలుస్తోంది.రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత నిరంతర పర్యటనలు, ప్రజా కార్యక్రమాలు, అధికారిక సమీక్షలు, పార్టీ వ్యవహారాలతో పాటు దీక్షలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా ఆయనపై శారీరక ఒత్తిడిని పెంచుతున్నాయి.ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ.. పాలనకు నిరంతర అందుబాటు కూడా కీలకమే. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో విధానపరమైన నిర్ణయాలు, శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరుగుతాయి కాబట్టి గైర్హాజరు రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంటోంది.పవన్ కల్యాణ్ రాజకీయ బాధ్యతలతో పాటు గతంలో ఒప్పుకున్న సినిమాల షూటింగ్‌లను పూర్తి చేస్తున్నారు. దీంతో ఆయన షెడ్యూల్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడుతోందన్న అభిప్రాయం ఉంది.ఒకవైపు సినిమా షూటింగ్‌లు, మరోవైపు మంత్రిగా పర్యటనలు, సమీక్షలు, పార్టీ కార్యక్రమాలు కొనసాగితే విశ్రాంతికి సమయం తగ్గిపోవడం సహజం. గతంలో సినిమా రంగంలో ఉన్న ఫ్లెక్సిబుల్ షెడ్యూల్‌కు భిన్నంగా.. ప్రభుత్వ వ్యవహారాల్లో నిర్ణీత సమయాల్లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంటుంది.ఇక్కడే పవన్‌కు అసలు సవాలు ఎదురవుతోంది. సినిమా, రాజకీయాలు రెండింటినీ సమన్వయం చేయడం కంటే.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరిపాలనకు ప్రాధాన్యత ఇవ్వడం ఇప్పుడు మరింత అవసరం.పవన్ కల్యాణ్‌కు అప్పగించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలతో నేరుగా సంబంధం ఉన్న కీలక శాఖలు. ఈ శాఖల్లో విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాల్సి ఉంటుంది.కేబినెట్ సమావేశాలకు వరుసగా దూరంగా ఉండటం వల్ల నిర్ణయ ప్రక్రియలో జనసేనకు సంబంధించిన రాజకీయ ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందనే చర్చ కూడా జరుగుతోంది. అయితే దీనిని పవన్ శాఖల పనితీరుతో నేరుగా ముడిపెట్టే ముందు.. ఆయన గైర్హాజరీకి ఉన్న వాస్తవ కారణాలు, శాఖల పనితీరు వంటి అంశాలను విడిగా చూడాల్సి ఉంటుంది.ఆరోగ్య సమస్యలు నిజంగా ఉంటే వాటి నుంచి పూర్తిగా కోలుకోవడం మొదటి ప్రాధాన్యత. అదే సమయంలో సినిమా కమిట్‌మెంట్లను ఒక దశలో ముగించి, రాజకీయ బాధ్యతలకు స్పష్టమైన సమయాన్ని కేటాయించడం అవసరం.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి నిరంతరం పనిచేసే నాయకుడితో కలిసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నేపథ్యంలో పవన్ తన పాత్రను మరింత స్పష్టంగా, నిరంతరంగా చూపించాల్సిన అవసరం ఉంది.కేబినెట్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం, శాఖలపై ప్రత్యక్ష పర్యవేక్షణ పెంచడం, ప్రభుత్వ నిర్ణయాల్లో చురుకైన భాగస్వామ్యం చూపించడం ద్వారా ప్రస్తుతం వినిపిస్తున్న విమర్శలకు సమాధానం చెప్పవచ్చు.పవన్ కల్యాణ్‌కు ఇప్పుడు అసలు పరీక్ష రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కాదు.. ఆరోగ్యం, సినిమా, ప్రభుత్వం అనే మూడు బాధ్యతల మధ్య సరైన సమతుల్యత సాధించడమే.

# ఎన్నికల కోసం... పార్టీల వ్యూహాలు




నెల్లూరు, ఆగస్టు 26, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీల వ్యూహాలు ఆసక్తిని పెంచుతున్నాయి. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జనసేన భారతీయ జనతా పార్టీ ఇప్పటికే ఎన్నికలపై దృష్టి పెట్టాయి. మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని నడుపుతున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లోనూ ఇదే సమన్వయాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.సీట్ల పంపకమే ఇప్పుడు కూటమి లో ప్రధాన అంశంగా మారనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ బలాన్ని చాటుకున్న జనసేన, బీజేపీలు స్థానిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను ఆశించడం సహజమే. అయితే నియోజకవర్గాలు, స్థానిక పరిస్థితులు, పార్టీకి ఉన్న బలం, అభ్యర్థుల సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించి టీడీపీతో కలిసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. డిమాండ్లు ఎన్ని ఉన్నా చివరికి మూడు పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి ఎన్నికలను ఎదుర్కొంటాయని కూటమి నేతలు భావిస్తున్నారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయాన్ని దృష్టిలో పెట్టుకుంటే స్థానిక పోరు కూడా ప్రతిపక్షానికి పెద్ద సవాలుగా మారనుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పునకు కారణమైంది. ఇప్పుడు అదే ఐక్యతను గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు కొనసాగించడం కూటమికి ముఖ్యమైన అంశంగా మారింది.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోందన్న ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన ఆ పార్టీకి స్థానిక ఎన్నికలు తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశం కావచ్చని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమిలో విభేదాలు వస్తాయని గతంలో చేసిన అంచనాలు ఫలించకపోవడంతో ఇప్పుడు కొత్త వ్యూహంతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి వైసీపీకి ఏర్పడింది.కొంతకాలం క్రితం వామపక్ష పార్టీలతో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించాలనే ఆలోచన కూడా తెరపైకి వచ్చింది. అయితే ఆ స్థాయిలో రాజకీయ అవగాహన ముందుకు సాగలేదు. వామపక్షాలు తమ కార్యక్రమాలతో కొనసాగుతుండగా, వైసీపీ కూడా తన రాజకీయ మార్గంలోనే పయనిస్తున్నట్లు కనిపిస్తోంది.స్థానిక ఎన్నికలను 2024 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చకూడదని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల కాలంలో రాజకీయ పరిస్థితులు మారాయని, ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. తమకు గతంలో బలమైన పట్టు ఉన్న ప్రాంతాలను నిలబెట్టుకోవడంతో పాటు కూటమికి అనుకూలంగా వెళ్లిన కొన్ని స్థానాల్లో తిరిగి పుంజుకోవాలని వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.అయితే స్థానిక ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నంగా ఉంటాయి. అభ్యర్థి వ్యక్తిగత ప్రభావం, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, గ్రామ స్థాయి సంబంధాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఈసారి ఎవరి అంచనాలు ఎంతవరకు నిజమవుతాయన్నది ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టమవుతుంది.మొత్తానికి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి వర్సెస్ వైసీపీ మధ్య ప్రధాన పోరుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, ఇతర రాజకీయ సంస్థలు పోటీ చేసినా ప్రధాన రాజకీయ దృష్టి మాత్రం ఈ రెండు శిబిరాలపైనే ఉండనుంది. 2024లో కూటమికి వచ్చిన భారీ ఓటు మద్దతును అది ఎంతవరకు నిలబెట్టుకుంటుందో, వైసీపీ తన ఓటు శాతాన్ని ఎంతవరకు పెంచుకుంటుందో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి.

**తెరపైకి కులం కార్డు...**

వైసీపీ నేతలు కుటుంబ వివాదాలకు, చేసిన నేరాలకు కులం రంగు పులుముకుంటున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును, అతని కుమారుడిని ఈడీ అరెస్టు చేసింది. లిక్కర్ రవాణా టెండర్లలో వందల కోట్ల అక్రమాలు, దొంగ ఇన్‌వాయిస్‌లు, లగ్జరీ ఆస్తుల కొనుగోలుపై ఆధారాలతో దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకుంటే? దానికి రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రాజకీయ కక్ష సాధింపులకు గానీ ముడిపెడుతూ బీసీ రంగు పులిమి బయటపడాలనుకుంటున్నారు. మరొకవైపు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దానయ్య అనే నిరుపేద గొర్రెల కాపరి బీసీ కాదా? ఆ నిరుపేద కుటుంబానికి కనీస సానుభూతి తెలపకపోగా, నిందితుడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఏ తరహా బీసీ ఉద్ధరణకు సంకేతం? బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాల్సింది పోయి, కేసును నీరుగార్చే ప్రయత్నం చేసిన నేతలకు బీసీల పట్ల నిజమైన ప్రేమ ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నేరం చేసింది తమ వర్గం వారైతే ఒక న్యాయం, నిరుపేదలు బాధితులైతే మరో న్యాయమా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.ఇక మరో నేత జోగి రమేష్ వ్యవహారంలోనూ ఇదే తీరు కనిపిస్తోంది. క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన వ్యక్తి సామాజిక మూలాలను పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకుంటున్నారు. కుటుంబ వివాదంలో.. తమ కోడలికి అన్యాయం చేశారన్నది బహిరంగ నిజం. మరి ఆమె బీసీ బిడ్డ కాదా?. కుటుంబాన్ని సక్రమంగా ఉంచుకోలేక బీసీ అని కేకలేస్తే పనవుతుందా? .ఆర్థిక అక్రమాలు, తీవ్రమైననేరాలు , నిరుపేదల ప్రాణాలు తీసిన సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు విచారణ ఎదుర్కొనాల్సిందే. కేవలం వైఎస్సార్‌సీపీలో ఉంటేనే బీసీలు అవుతారా? ఇతర పార్టీల్లోని వారు, సాధారణ ప్రజలు బీసీలు కాదా? చేసిన తప్పుల తీవ్రతను కప్పిపుచ్చుకోవడానికి కులాన్ని, మతాన్ని కేడర్‌గా వాడుకోవాలనుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పుడు కులం వెనుక దాక్కోవాలనుకోవడం రాజకీయ చేతకానితనం అవుతుంది. కానీ వైసీపీ నేతలకు తెలిసిన విద్య అదే.

# టీడీపీ సోషల్ మీడియా టాస్క్ టార్గెట్ జెన్ జీ, ఆల్ఫా




ఒంగోలు, ఆగస్టు 26, : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పాలనతో పాటు ప్రజలతో సమాచార సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా యువతను చేరుకోవడానికి సోషల్ మీడియాను సమర్థంగా ఉపయోగించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువతలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి డిజిటల్ వేదికలకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి చేరువ చేయాలన్నది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది.ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా ఎంత కీలకంగా మారిందో పలు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతలో రాజకీయ చర్చలు ఎక్కువగా డిజిటల్ వేదికలపైనే జరుగుతున్నాయి. ఒక అంశంపై ప్రజాభిప్రాయాన్ని వేగంగా ప్రభావితం చేయడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను నేరుగా ప్రజలకు వివరించేందుకు కూడా సోషల్ మీడియా ఉపయోగపడుతోంది. ఈ మార్పును గుర్తించిన బీజేపీ కూడా డిజిటల్ ప్రచారంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా వ్యవస్థను మరింత చురుగ్గా మార్చాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కొంతమంది మంత్రుల డిజిటల్ కార్యకలాపాలపై చంద్రబాబు వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంగలపూడి అనిత , ఫరూక్ , కొండపల్లి శ్రీనివాస్ (తదితరులు తమ కార్యక్రమాలు, ప్రజా సంబంధిత విషయాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారని చర్చ జరిగింది.అయితే ఇంతటితో సరిపోదని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలతో నిర్వహిస్తున్న సమావేశాలు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను డిజిటల్ మాధ్యమాల ద్వారా వివరించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఒకే వేదికకు పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన చెప్పినట్లు సమాచారం.ముఖ్యంగా వచ్చే రెండేళ్లలో యువ ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరగనుందని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతకు ప్రభుత్వం ఏం చేస్తోంది, ఉపాధి, విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో ఎలాంటి అవకాశాలు కల్పిస్తోంది అనే విషయాలను వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన 'జగన్ 2.0' యాప్ కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. డిజిటల్ వేదికల ద్వారా ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించే విషయంలో రాజకీయ నాయకులు మరింత ముందుండాలని చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. ప్రజలు ప్రశ్నిస్తే స్పందించడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం, చేసిన పనులను పారదర్శకంగా వివరించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.అయితే సోషల్ మీడియాపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రధాన మీడియాకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. టెలివిజన్, పత్రికలు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా.. అన్ని వేదికలను సమన్వయంతో ఉపయోగించినప్పుడే ప్రభుత్వ సందేశం విస్తృతంగా ప్రజల్లోకి వెళుతుందని భావిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వం డిజిటల్ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేసి యువతతో ప్రత్యక్ష సంబంధం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది

# జోగి ఫ్యామిలీ అడ్డంగా బుక్...

విజయవాడ, ఆగస్టు 26, మాజీ మంత్రి జోగి రమేష్ తన కుటుంబాన్ని రాజకీయాల కోసం వీధిన పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కోడలిని కుమార్తె కంటే బాగా చూసుకున్నానని ప్రకటించారు. ఇదంతా కల్పితం మాత్రమేనని.. దీని వెనుక చంద్రబాబు, లోకేష్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఉన్నారని.. పెద్ద పెద్ద వారి కుటుంబాల్లోనే వివాదాలు ఉన్నాయని.. తన కుటుంబంలో కేవలం తన కుమారుడు, కోడలి మధ్య విభేదాలు మాత్రమేనని.. తమ కోడలి ఫిర్యాదు కంటే ముందే తాము విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు నిన్ననే జోగి రమేష్ మీడియా ముఖంగా ప్రకటన చేశారు. నెల రోజులుగా క్షోభ అనుభవిస్తున్నామని చెప్పుకొచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ జోగి రమేష్ కోడలు మేఘన, ఆమె తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించే ప్రయత్నం చేశారు.తనకు అత్తవారింట్లో ఎదురైన పరిణామాల గురించి వివరిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు మేఘన. సంసారానికి పనికిరాని లోపం కొడుకు జోగి రాజీవ్ కు ఉందని తెలిసి.. కేవలం పరువు, భారీ కట్నం కోసమే తమకు అబద్ధాలు చెప్పి మోసపూరితంగా పెళ్లి చేస్తారని మేఘన కుండబద్దలు కొట్టారు. మరింత అదనపు కట్నం తెస్తేనే నీ నీ భర్తకు ఫీలింగ్స్ వస్తాయి.. నువ్వు సంతోషంగా ఉంటావు అంటూ జోగి రమేష్ భార్య శకుంతల తనను చిత్రహింసలకు గురి చేసిందని మేఘన చెప్పారు. బయట సమాజానికి హిందూ సంప్రదాయ కుటుంబం గా బిల్డప్ ఇచ్చే జోగి రమేష్ ఇంట్లో.. అసలు స్వరూపం వేరని.. వారిది పక్కా క్రిస్టియన్ కుటుంబమని మేఘన ఆధారాలతో సహా బయటపెట్టారు.కొత్తగా అత్తవారింట్లో అడుగుపెట్టిన తనకు పూజ చేసేందుకు ప్రత్యేకమైన గది కూడా లేదని.. తాను హిందూ దేవుళ్ళ ఫోటోలు పెట్టి పూజలు చేస్తుంటే అడ్డుకునేవారని కొచ్చారు. హారతి పళ్లాలు, అగరబత్తులను నేలకేసి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అత్త హిందూ దేవుళ్లను అసభ్యంగా దూషిస్తూ.. బలవంతంగా మతం మార్చేందుకు విపరీతంగా ఒత్తిడి చేశారని ఆరోపించారు. పెళ్లయిన కేవలం రెండు నెలలకి తనను వదిలించుకునే కుట్రతో జోగి రాజీవ్ కోర్టులో రహస్యంగా పిటిషన్ దాఖలు చేశాడు అన్న సంచలన విషయాన్ని కూడా ఆమె వెల్లడించారు. వివాహ సమయంలో కేజీన్నర బంగారం, కోట్లాది రూపాయల ఆస్తులు ఇచ్చినా.. తమ కుమార్తెను అంతమొందించేందుకు ప్రయత్నించారని మేఘన తండ్రి మీడియా ముందు కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు.మరోవైపు న్యాయం కోసం తాము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వాన్ని కలిశామని కూడా చెప్పుకొచ్చారు. జగన్మోహన్ రెడ్డిని కలిసేందుకు ప్రయత్నం చేస్తే ఆయన పెద్దగా ఆసక్తి చూపలేదని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి పరిస్థితిని వివరిస్తే ఆయన సమస్యను పరిష్కరించడం మానేసి కాలయాపన చేస్తూ రాజీ కుట్రలకు పాల్పడ్డారు. అన్ని దారులు మూసుకుపోవడంతో.. గత్యంతరం లేక స్థానిక ఎమ్మెల్యే వద్దకు వెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నామని.. జోగి రమేష్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తమపై టిడిపి ముద్ర వేసి రాజకీయ రంగు పులిమారని మేఘన నిప్పులు చెరిగారు. అయితే ఇప్పుడు అసలు విషయం బయటకు రావడంతో జోగి రమేష్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జోగి రమేష్ ఫ్యామిలీ ది ఘోరమైన మోసం అని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు.

# హామీలు విస్మరించిన మంత్రి జూపల్లి

**- కొల్లాపూర్ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయం**

**- బీజేపీ వనపర్తి జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ మేకల చెన్నయ్య యాదవ్ తీవ్ర ధ్వజం**



చిన్నంబావి, ఆగస్టు 26:(విజన్ ఆంధ్ర) : కొల్లాపూర్ నియోజకవర్గాన్ని సుందర కోనసీమగా మారుస్తానని సుదీర్ఘకాలంగా ప్రగల్భాలు పలికిన మంత్రి జూపల్లి కృష్ణారావు, గెలిచాక గతంలో ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించి రాజకీయ పబ్బం గడుపుతున్నారని భారతీయ జనతా పార్టీ వనపర్తి జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ మేకల చెన్నయ్య యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శ్రీశైలం నీటి ముంపు బాధితుల 98 జీవో అమలును గాలికి వదిలేశారని, సింగోటం–గోపాల్‌దిన్నె రిజర్వాయర్ లింక్ కెనాల్ పనులను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. చిన్నంబావి మండలానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టును ఇక్కడి నుంచి వెనక్కి పంపించడం స్థానిక ప్రజలకు చేసిన తీవ్ర ద్రోహమని, అయ్యవారిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేసి కొబ్బరికాయ కొట్టడానికే పరిమితమై గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పదేపదే అధికారంలోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా చిన్నంబావి మండల కేంద్రంలో మహిళలకు కనీస సామూహిక మరుగుదొడ్ల సదుపాయం కూడా కల్పించలేకపోయారని మండిపడ్డారు. ఇటీవల సోమవారం నాడు రహదారుల శంకుస్థాపన కోసం కొల్లాపూర్ ప్రాంతానికి వచ్చిన రోడ్లు–భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావుల పర్యటనలో చిన్నంబావి మండల కేంద్రంలో రోడ్డును పూర్తిస్థాయిలో ఆక్రమించి మీటింగ్‌లు ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ప్రైవేట్ ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించుకోకుండా, ఇలా ప్రధాన రహదారులపై సభలు పెట్టి సామాన్య ప్రజలను నడిరోడ్డుపై ఇబ్బందులకు గురిచేయడం ఏమాత్రం తగదని హితవు పలికారు. దాదాపు మూడు దశాబ్దాలుగా అభివృద్ధి పేరుతో కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్న మంత్రి జూపల్లి వైఖరిని కొల్లాపూర్ తాలూకా ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా ఆయనకు తగిన శాస్తి చేయడం ఖాయమని మేకల చెన్నయ్య యాదవ్ స్పష్టం చేశారు.

# నూతన ఐజ మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి నియామక పత్రం అందజేత



ఐజ: విజన్ ఆంధ్ర పత్రిక ఆగస్టు 26 : జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బడేసాబ్ యాదవ్కు ఎర్రవల్లి చౌరస్తాలో నియామక పత్రాన్ని అందజేశారు. ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం చైర్‌పర్సన్ సరిత చేతుల మీదుగా బడేసాబ్ యాదవ్ నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఐజ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నూతన మండల అధ్యక్షుడికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపల్లి పద్మారెడ్డి కుమారుడి వివాహానికి హాజరైన తెలంగాణ ఉద్యమకారులు..!



కాప్రా/ఆగష్టు 26( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : సీనియర్ జర్నలిస్ట్ ఎంపల్లి పద్మారెడ్డి కుమారుడు క్రాంతి రణదేవ్ రెడ్డి, గడ్డం స్ఫూర్తి రెడ్డి వివాహం బుధవారం నాడు కొంపల్లిలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు తెలంగాణ ఉద్యమకారులు కీర్తి శ్రీనివాస్, దొమ్మటి కిరణ్ కుమార్ రావు , నర్రా శ్రీనివాస్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎంపల్లి వరలక్ష్మి పద్మారెడ్డి కుటుంబ సభ్యులు అతిథులకు ఆత్మీయ స్వాగతం పలికారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. వివాహ వేడుక కొంపల్లిలోని సినీ ప్లానెట్ మల్టీప్లెక్స్ ఎదురుగా ఉన్న పీఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగింది.

# నేపాల్ వరదలతో భారత్ అప్రమత్తం

**- బీహార్, యూపి సిఎంల అత్యవసర చర్యలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్26 : నేపాల్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరదల కారణంగా ఇప్పటి వరకు 16 మంది ప్రాణాలు కోల్పోయారని, 400 మంది గల్లంతయ్యారని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్‌లో భారీ వరదల నేపథ్యంలో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. వరద నీరు రెండు రాష్ట్రాలకు వ్యాపించే అవకాశం ఉన్నందున నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాయి. ఈ మేరకు బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన బుధవారం అత్యవసర సమావేశం జరిగింది. జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. డ్యామ్‌లు, కరకట్టలపై 24 గంటల నిఘా పెట్టాలని, రాత్రివేళల్లోనూ పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో లౌడ్‌స్పీకర్లతో హెచ్చరికలు జారీ చేయాలని, అత్యవసర పరిస్థితులకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి స్పష్టం చేశారు. నేపాల్ వరదల నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. . ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ముఖ్యమంత్రి యోగీ బుధవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. గండక్, నారాయణి నదులలో నీటి మట్టాలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రభావంతో మహారాజ్‌గంజ్, కుషీనగర్ జిల్లాలలో వరదలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. స్థానిక యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

# కూరగాయల విక్రయదారులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ భరోసా

**- అర్హులైన విక్రయదారులకు గుర్తింపు కార్డులు, అర్హత ధ్రువపత్రాలు**

**- వారానికి ఒకసారి కూరగాయల సంత నిర్వహణకు అనుమతిపై సానుకూల స్పందన**

**- విక్రయదారులను ఇబ్బందులకు గురిచేయొద్దని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర): 131వ డివిజన్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న కూరగాయల విక్రయదారుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ భరోసా ఇచ్చారు. వ్యాపార కార్యకలాపాల నిర్వహణలో అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారానికి ఒకసారి మార్కెట్‌లో కూరగాయల సంత నిర్వహించుకునేందుకు అనుమతి కల్పించాలని కోరుతూ కాశీ, శంకరప్పతో పాటు పలువురు విక్రయదారులు తమ సమస్యలను 131వ డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. విక్రయదారుల సమస్యలను తెలుసుకున్న డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, డివిజన్ ముఖ్య నాయకులు కిషోర్ చారి, రమణ, ఆంజనేయులు, మల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి సమస్యలను వివరించారు. విక్రయదారుల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, అర్హత కలిగిన కూరగాయల విక్రయదారులందరికీ రానున్న రోజుల్లో గుర్తింపు కార్డులు, అర్హత ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అధికారులు కూరగాయల విక్రయదారులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయరాదని, వారి వ్యాపార కార్యకలాపాలకు అనవసర ఆటంకాలు కలిగించకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వారానికి ఒకసారి మార్కెట్‌లో కూరగాయల సంత నిర్వహించుకునేందుకు అనుమతి కల్పించాలన్న విక్రయదారుల విజ్ఞప్తిపైనా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ సమస్యలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపిన డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్‌కు కూరగాయల విక్రయదారులు కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవనోపాధికి భరోసా కల్పించేలా స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజలకు ఇబ్బందులు లేని ప్రయాణ సౌకర్యాలు అందించాలి

## వనపర్తిలో 'రాపిడో' సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన, ఇబ్బందులు లేని ప్రయాణ సదుపాయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలో నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన రాపిడో సేవలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం సుమారు 180 మంది రైడర్లతో రాపిడో సేవలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. పట్టణంలో ప్రతిరోజూ దాదాపు 40 నుంచి 45 వేల మంది ప్రజలు వివిధ అవసరాల కోసం ప్రయాణిస్తుంటారని, తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రోజురోజుకూ విస్తరిస్తున్న వనపర్తి అవసరాలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మరింత పెంచాలన్నారు. రానున్న రోజుల్లో ఈ సేవలను పట్టణంతో పాటు సమీప ప్రాంతాలకూ విస్తరించాలని నిర్వాహకులకు సూచించారు.

**భద్రతకు అత్యంత ప్రాధాన్యం**

రాపిడో నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అన్ని అనుమతులు, పత్రాలు సరిగ్గా ఉంచుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ఈ సేవల ద్వారా రవాణా మెరుగుపడటంతో పాటు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభించడం సంతోషకరమని పేర్కొన్నారు. యువత తమ నైపుణ్యాన్ని ఉపయోగించుకొని కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే ప్రతి కార్యక్రమానికి తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, ఎస్ఎల్ఎన్ రమేష్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, కౌన్సిలర్లు క్రాంతి, పరుశురాం, బి. కృష్ణ, ఏర్పుల రవి, పాల రవి, రఘు, మైనార్టీ నాయకులు రహీం, వక్ఫ్‌బోర్డు సభ్యులు రఫీక్ సలీం, ఆర్‌టీఏ సభ్యులు జహంగీర్, సమీర్, నాయకులు వసీం, ఇర్ఫాన్, జమీల్, ఆయూబ్ ఖాన్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రవక్త మహమ్మద్ బోధనలు మానవాళికి మార్గదర్శకం

**- మత సామరస్యాన్నిబలోపేతం చేయాలి**

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**





వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు (విజన్ ఆంధ్ర) : ప్రవక్త మహమ్మద్ జీవితం, ఆయన అందించిన బోధనలు యావత్ మానవాళికి ఆదర్శప్రాయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఉన్న మహమ్మదీయ మసీదుతో పాటు 2వ వార్డు మసీదులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మానవతా విలువల ప్రాధాన్యం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రేమ, కరుణ, దయ, నిజాయితీ, సహనం, సోదరభావం, పేదల పట్ల ఆదరణ వంటి గొప్ప మానవతా విలువలను ప్రవక్త మహమ్మద్ ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకుంటూ, శాంతి సామరస్యాలతో జీవించాలని పిలుపునిచ్చారు. మనిషిని మనిషిగా గౌరవించడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, పేదలకు సహాయం చేయడం ఆయన బోధనల్లోని ముఖ్యమైన సందేశాలని వివరించారు. ఐక్యతకు ప్రతీకగా నిలవాలి మిలాద్ ఉన్ నబీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవత్వంతో మెలగాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. వనపర్తి నియోజకవర్గం అన్ని మతాలు, వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించే ఐక్యతకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ శుభదినం ప్రజలందరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ఎల్ఎన్ రమేష్, కౌన్సిలర్లు క్రాంతి, పరశురామ్, బి. కృష్ణ, ఏర్పుల రవి, పాల రవి, రఘు, మైనార్టీ నాయకులు రహీం, వసీం, ఇర్ఫాన్, జమీల్, ఆయూబ్ ఖాన్, కైసర్, వక్ఫ్ బోర్డు సభ్యులు రఫీక్, సలీం, ఆర్‌టీఏ సభ్యుడు జహంగీర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు అబ్రార్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# నార్నూర్‌లో తుడుం దెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల కమిటీలు ఏకగ్రీవ ఎన్నిక



నార్నూర్,ఆగస్టు 26(విజన్ ఆంధ్ర):ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు, తుడుం దెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నార్నూర్ మండల కమిటీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీలను ప్రకటించారు.తుడుం దెబ్బ నార్నూర్ మండల కమిటీ: గౌరవ అధ్యక్షుడిగా మడవి మాన్కు, అధ్యక్షుడిగా ఆడ శ్రీరామ్, ప్రధాన కార్యదర్శిగా మడవి సాగర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మెస్రం మోతిరం, ఉపాధ్యక్షులుగా సుర్పం నాగోరావు, పెందుర్ సుంగు, కార్యదర్శులుగా తొడసం సోంజీ, ఆత్రం లక్ష్మణ్, సాంస్కృతిక కార్యదర్శిగా పూసం ఆనంద్, కోశాధికారిగా ఆత్రం రమేష్, సలహాదారులుగా కుర్సెంగా నగేష్, కుంరం ధన్‌రాజ్ ఎన్నికయ్యారు.ఆదివాసీ విద్యార్థి సంఘం నార్నూర్ మండల కమిటీ: గౌరవ అధ్యక్షుడిగా పెందుర్ కృష్ణ, అధ్యక్షుడిగా రాయి సిడం హరీష్, ప్రధాన కార్యదర్శిగా కొట్నాక్ శ్రీరామ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఊర్వత కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కనక తుల్సిరామ్, కోశాధికారిగా మరప సందీప్, సలహాదారుగా మెస్రం కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నార్నూర్ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్ పటేల్, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పూర్క బాపూరావు, జిల్లా అధ్యక్షుడు పెందుర్ దాదిరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ సంతోష్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పూర్క చిత్రు, విద్యార్థి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కనక గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ దీపక్, లక్ష్మీపేట్ సర్పంచ్ సలం శ్యాంరావు, సర్పంచ్ ఆదివాసీ ఫోరం ఎం.పీ. మాడవి పైకు, ఎంపల్లి సర్పంచ్ పెందుర్ లక్ష్మణ్, సుంగాపూర్ సర్పంచ్, కుంరం ధర్ము, చొర్గం సర్పంచ్, మెస్రం చందు, జాండా ఆదివాసీ తదితరులు పాల్గొన్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల హక్కులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు

# ప్రజల సంక్షేమానికి కృషి... ఎమ్మెల్యే కోవా లక్ష్మి

**-లోకారి కే గ్రామంలో నూతన బ్రిడ్జ్ ప్రారంభం**

గాదిగూడ, జులై 09(విజన్ ఆంధ్ర):ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి అన్నారు.గురువారం గాదిగూడ మండలంలోని లోకారి కే గ్రామంలో నూతన బ్రిడ్జి ను ప్రారంభించారు.లోకారి కే గ్రామ ప్రజల దశాబ్దాల కల సాకారమైందని చాలా నెలలు వర్షాలకు తెగిపోతున్న రోడ్డు కారణంగా అవస్థలు పడేవారన్నారు. ఇకపై ఈ బ్రిడ్జ్ నిర్మాణంతో గ్రామ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని రవాణా, వైద్య, విద్యా అవసరాలకు నిరంతరాయంగా రోడ్డు అనుసంధానం ఉంటుందన్నారు.ప్రజల సంక్షేమే మా లక్ష్య మని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ యోగేష్, సర్పంచ్ పూసం బాధిరావ్, మాజీ సర్పంచ్ లు మెస్రం జైవంత్ రావ్, ఇంద్రబాన్, సుదం, మెస్రం దేవురావ్,మారుతీ,జాగేరావ్, హనుమంత్ రావ్, స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు, అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# అన్నాభావు సాఠె ఆశయాలను కొనసాగిద్దాం



గాదిగూడ,ఆగస్టు 26( విజన్ ఆంధ్ర): పేదలు, కార్మికులు, శ్రామికులు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సాహిత్యం ద్వారా విశేష కృషి చేసిన సాహిత్యరత్నం అన్నాభావు సాఠె ఆశయాలను కొనసాగించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం గాదిగూడ మండలం రూపాపూర్‌లో నిర్వహించిన అన్నాభావు సాఠె జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.అన్నాభావు సాఠె చూపిన మార్గంలో పయనిస్తూ అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని దళితుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. భూహక్కులు కల్పించడం సాధ్యం కాని పరిస్థితుల్లో గతంలో ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ల ఆధారంగా రుణాలు అందేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రూపాపూర్ గ్రామ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

**- నూతన పంచాయతీ భవనం ప్రారంభం**

గాదిగూడ మండలం మెడిగూడ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమాల్లో అన్నాభావు సాఠె రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ మోరే,ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు ఉద్దవ్, దత్తరాజ్, మహారాష్ట్రకు చెందిన వక్తలు సంబాజీ, సర్పంచ్ కేశవ్, ఉపసర్పంచ్ రాంకిషన్, మాజీ వైస్ ఎంపీపీ యోగేష్,కొడప ఆనంద్ రావ్ సర్పంచ్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ కాంబ్లె, పండరి గాయక్వాడ్, గోవింద్ రాజ్ పేటే, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తార్నాకలో విదేశీ మద్యం స్వాధీనం

హైదరాబాద్,ఆగస్ట్26 : నగరంలోని తార్నాక ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో భారీగా డిఫెన్స్ మద్యం బాటిళ్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం స్వాధీన పరుచుకుంది. మొత్తం 67 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. వీటి విలువ రూ.2లక్షలు ఉంటుందని వివరించింది. తార్నాకలో ఓ వ్యక్తి డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటిపై బుధవారం దాడి చేసింది. ఈ నేపథ్యంలో ఆ ఇంటి యజమాని వద్ద తొలుత పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. అనంతరం ఆ ఇంట్లో సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా మరో 57 బాటిళ్లను గుర్తించింది. వాటిని కూడా స్వాధీనం చేసుకుంది. ట్టుబడిన బాటిళ్లు కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందినవని స్పష్టం చేసింది. ఈ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తి.. మాజీ సైనికుడి కుమారుడు ఆర్. మాధవన్‌గా గుర్తించామని పేర్కొంది. అతడిని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్పగించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం వివరించింది.

# డ్రైనేజీ నీరు రోడ్డు పైన పారకుండా శాశ్వత పరిష్కార చర్యలు అధికారులు తీసుకోవాలి

**- "కోలా రవీందర్" డిమాండ్**



నగరంలోని సూరారం మెయిన్ రోడ్ లో బస్ స్టాప్ వద్ద నిత్యం డ్రైనేజీ నీరు పొంగడం వేలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డులో వాహనదారులకు అన్ని రకాలుగా నరకం కనిపిస్తోందని, నీయంరించడంలో ట్రాఫిక్ పోలీసులకు తీరని బాధ, ఆవేదన కలుగుతోందని,ఈ సమస్యపై వెంటనే సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుని డ్రైనేజీ నీరు రోడ్డు పైన పారకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టి అందరికీ న్యాయం చేయమని, సామాజిక పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు, తీవ్ర సమస్యపై తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సూరారం రోడ్డు వెంట ఆరు నెలల నుండి వేసే పైపులైన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ప్రక్కనే ఉన్న పాత డ్రైనేజీ లైన్ డ్యామేజ్ అవ్వడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని రవీందర్ ముదిరాజ్ తెలుపుతూ, గత ఏడాది కూడా రోడ్డు ఇటుపక్కన నర్సాపూర్ నుండి బాలానగర్ వెళ్లే పక్క రోడ్ లో వర్షపు నీటి కాలువ నిర్మాణంలో నెలల తరబడి నిర్లక్ష్యం చెయ్యడం, ఈ విషయమై స్థానిక ప్రజలు తిరగబడడంతో, పై అధికారుల ఒత్తిడితో, మొక్కుబడిగా పని పూర్తి చేశారు. దీనివల్ల నిత్యం పొంగుతున్న మురికి నీరు పొంగి రోడ్ పై పారుతుండడం, రోడ్డు గుంతలు పడడం, భారీగా నీరు నిలిచిపోవడంతో ప్రతిరోజు, ఉదయం, సాయంత్రం, కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసులకు తలకు మించిన భారమవుతోంది, వాహనాల మెయింటినెన్స్, యాక్సిడెంటులు అలాగే, దారిన పోయే వారి పైన బురద పడి బట్టలు పాడు అవ్వడం, ఇదే కాకుండా బస్ స్టాప్ ఎదురుగా ఆర్కే ట్రాన్స్పోర్ట్, ముందర డ్రైనేజీ పైకప్పు లేకపోవడం ప్రమాదకరంగా మారింది దానిపైన సిమెంట్ కప్పు మూతలు వేస్తున్నారు. కానీ ఇవి కాకుండా ఇనుపరాళ్లతో ఉన్న స్టీల్ మూత వేయాలని రవీందర్ కోరారు. ఈ రోడ్డుపై వందల టన్నుల బరువైన భారీ, అతి భారీ వాహనాలు, తిరుగుతాయి, కావున అధికారులు ఆలోచించి ఈ ప్రమాదకరమైన సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు ఆశిస్తున్నామని రవీందర్ తెలిపారు.

# 9వ వార్డులో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**- ఏఈకి వినతి.**

ములుగు ఆగస్ట్ 26, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలోని కృష్ణ కాలనీ, లక్ష్మీ నగర్, మంజునాథపురం, గట్టంపల్లి, ప్రేమ్ నగర్



లలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ గండ్రకోట వాణి కుమార్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు విద్యుత్ శాఖ ఏఈ రవి కి వినతిపత్రం అందజేశారు. లో-వోల్టేజ్ తో ఫ్యాన్లు, ఫ్రిజ్ లు, టీవీలు కాలిపోతున్నాయని, కృష్ణ కాలనీ, మంజునాథపురం, ప్రేమ్ నగర్ లలో 3 కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కృష్ణ కాలనీలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 14 స్తంభాల 11 కెవి లైన్ ను తొలగించి దారి మళ్లించాలని, గతంలో ఈ లైన్ వల్ల ఇద్దరు మృతి చెందారని తెలిపారు. 8 మీటర్ల స్తంభాల స్థానంలో 9.1 మీటర్ల స్తంభాలు, 33 కెవి లైన్ మధ్యలో కొత్త స్తంభాలు, విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి వేయాలని విజ్ఞప్తించారు. కార్యక్రమంలో గోలి రాజిరెడ్డి, గండ్రకోట కుమార్, చుంచు రమేష్, తక్కల్లపల్లి నాగేశ్వరరావు, తడక సుధాకర్, మాట్ల సంపత్, కొత్తపల్లి బాబురావు, తుల సుదర్శన్, మోత్కూరి శంకర్, మారబోయిన సంపత్, బండి ప్రవీణ్, బండి కిషన్, ఇక్బాల్, గూడెపు కొమురయ్య, ఎనగందుల ప్రేమ్ కుమార్, ఎండీ సలీం, బరుపటి మిథున్, చిదురాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంస్కృతి, ఆత్మగౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**- ప్రతి తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం**

**- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**





వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర) : గిరిజనుల సంక్షేమం, అభివృద్ధితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు. వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డులో జిల్లా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'తీజ్ ఉత్సవాల్లో' ఆయన పాల్గొని గిరిజన సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన యువతులు తీజ్ మొలకలతో ఎమ్మెల్యేను సత్కరించారు. తీజ్ పండుగ బంజారా సమాజ ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మొలకలను పూజించడం గొప్ప సంప్రదాయమని అన్నారు.గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ స్మృతివనం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించడం, గిరిజన సమాజం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి గిరిజన తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని వెల్లడించారు.వనపర్తి పట్టణంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బంజారా సేవా సంఘం సభ్యులు కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేవలం ఆర్థిక అభివృద్ధే కాకుండా గిరిజనుల విద్య, ఉపాధి, మౌలిక వసతులు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమే నిజమైన అభివృద్ధి అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వనపర్తి గడ్డపై ఈ వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు, గిరిజన పెద్దలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గిరిజన మహిళలు, యువతులు పాల్గొన్నారు.

# పాలమూరు జిల్లా వ్యాప్తంగా వెల్లివిరిసిన మిలాద్ సంబరాలు - ప్రశాంతంగా వేడుకలు

**- కల్వకుర్తిలో ముస్లిం సోదరుల ర్యాలీ - రక్తదానం, అన్నదానం..**

**- జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 26: త్యాగానికి, ప్రేమకు, శాంతికి ప్రతీక అయిన ప్రవక్త మహమ్మద్ జయంతి మిలాద్ ఉన్ నబి పండుగను ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలోని అన్ని మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. తెల్లవారుజాము నుండే మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ప్రవచనాలు మార్మోగాయి. ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావ సందేశాన్ని అందరూ పాటించాలని మత పెద్దలు పిలుపునిచ్చారు. పలు చోట్ల హిందూ, ముస్లిం సోదరులు కలిసి వేడుకల్లో పాల్గొని మత సామరస్యాన్ని చాటారు.

**కల్వకుర్తిలో ఘనంగా వేడుకలు:**

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో మిలాద్ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పట్టణంలోని ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. ప్రవక్త పతాకాలతో, నినాదాలతో పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీ కనుల పండుగగా సాగింది. ర్యాలీ అనంతరం స్థానిక మజీద్ వద్ద మానవతా సేవకు నిదర్శనంగా నిలిచారు. మతం కంటే మానవ సేవే గొప్పదని చాటుతూ భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే భక్తుల కోసం, పేదల కోసం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు:**

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి



రక్తదానం చేస్తున్న సోఫీ... పాల్గొన్న నాయకులు...

భద్రతలకు విఘాతం కలగకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాల ఎస్పీల ఆదేశాల మేరకు అన్ని మసీదులు, దర్గాల వద్ద, ర్యాలీలు జరిగిన ప్రధాన కూడళ్లలో భారీగా పోలీస్ బలగాలను మోహరించి, పికెటింగ్ ఏర్పాటు చేసి నిరంతరం గస్తీ నిర్వహించారు. ముఖ్యంగా కల్వకుర్తి డివిజన్ పరిధిలోని పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీకి ముందు, వెనుక భద్రత కల్పిస్తూ, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూశారు. ఈ రక్తదాన శిబిరంలో కల్వకుర్తి పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, మున్సిపల్ వైస్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎస్సై లు....



కల్వకుర్తి లో ర్యాలీ చేస్తున్న ముస్లిం సోదరులు....

చైర్మన్ షానవ్వాజ్, మాజీ వైస్ చైర్మన్ షాహెద్, రమాకాంత్, మక్బూల్,మాసూద్, ఖాదర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసుల సహకారంతో వేడుకలు ప్రశాంతంగా ముగియడంతో స్థానిక ప్రజలు, ముస్లిం పెద్దలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా జరిగిన సింగిడి "నృత్యాంగన" కళా ఉత్సవం

హైదరాబాద్ ఆగష్టు 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : దక్షిణ మధ్య మండల సాంస్కృతిక కేంద్రం, నాగ్‌పూర్ (భారత ప్రభుత్వం యొక్క సాంస్కృతిక మంత్రిత్వ శాఖ),తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రముఖ కళా సాంస్కృతిక సంస్థ "సింగిడి" హైదరాబాద్, డైరెక్టర్, డి.ఆర్.కె. విశ్వకర్మ, నేతృత్వంలో ఆనందోత్సాహాల మధ్య ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "4వ నృత్యాంగన " వివిధ నృత్య కళా రూపాల ఉత్సవం స్వదేశీ, విదేశీ కళాకారుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం సాయంత్రం రవీంద్రభారతి ఆడిటోరియం, మెయిన్ హాల్ లో 'సింగిడి సాంస్కృతిక సంస్థ' ఏర్పాటు చేసిన నృత్యోత్సవం లో కన్నుల పండుగగా నిర్వహించిన కార్యక్రమంలో నార్తా డాన్స్, మధ్యప్రదేశ్, యజ్ఞసేని సర్కార్ కోల్‌కతా, రంగిక నానయక్కరా శ్రీ రంగభి కళా మందిర్ శ్రీలంక, తెలంగాణ లంబాడి నృత్యం, మౌమితా పాల్ కోల్‌కతా, శౌరి కొక్కండ, లండన్, యు కె, కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 120 మంది కళాకారులు తమ అద్భుతమైన నాట్య ప్రతిభను కనబరుస్తూ,



నృత్యాంశాలను ప్రదర్శించి అలరించి ప్రేక్షకులను, కళాభిమానులను సమ్మో హితులను చేశారు, చప్పట్ల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా సింగిడి సంస్థ డైరెక్టర్ డి.ఆర్.కె. విశ్వకర్మ మాట్లాడుతూ, మర్చిపోతున్న మన ప్రాచీన నాగరికతను, సంస్కృతిని, కళలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో, అలాగే వివిధ రాష్ట్రాల, దేశాల కళలను ప్రత్యక్షంగా చూపించి వారిలో కళాత్మక శక్తిని, నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో సింగిడి సాంస్కృతిక సంస్థ ఈ 'నృత్యాంగన' కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. శ్రవణానందకంగా, నేత్రపర్వంగా సాగిన ఈ నృత్య కళా వైభవానికి ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యుడు జితేందర్ రెడ్డి, గౌరవ అతిథిగా పటేల్ రమేష్ రెడ్డి, మాజీ ఛైర్మన్ తెలంగాణ ప్రభుత్వ పర్యాటక అభివృద్ధి సంస్థ, సుధీర్ కుమార్ ఐఆర్‌టిఎస్, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్, రైల్వే మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, డాక్టర్. నమోజు బాలచారి, కార్యదర్శి తెలం గాణ సాహిత్య అకాడమీ, ఇతర అతిథులుగా ఉపాసన చైర్మన్ సాంస్కృతిక సంస్థ సింగిడి యుఎఇ, టి. కిషోర్ యాదవ్ చైర్మన్ సింగిడి కల్చరల్ ఆర్గనైజేషన్ ఇటలీ, ఇతర దేశాల సింగిడి సంస్థ ప్రతినిధులు హాజరై కన్నుల పండుగగా నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్న కళాకారులను అభినందించి మొమెంటోలను, ప్రశంశా పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. కనువిందు చేసిన ఈ చక్కటి 'నృత్యాంగన' నృత్యోత్సవంలో తమను కూడా భాగస్వాములను చేసినందుకు సంస్థ చైర్మన్ విశ్వకర్మ ను , నిర్వాహక కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు అతిథులు తెలుపుతూ, ప్రశంశలు, శుభాకాంక్షలు అందజేశారు.

# సిగరెట్ ఇవ్వలేదని డ్రైవర్‌పై కర్రలతో దాడి

**- జన్మదిన వేడుకల వద్ద చిన్న వివాదం.. మాటామాటా పెరిగి దాడికి దారితీసిన ఘటన**

**- కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్న పేట్ బషీరాబాద్ పోలీసులు**



పేట్ బషీరాబాద్, ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర): సిగరెట్ ఇవ్వలేదన్న కారణంగా ఓ డ్రైవర్‌పై యువకులు కర్రతో దాడి చేసిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన ఆకాష్ (26) గత ఐదు నెలలుగా నగరంలో ఉంటూ అనిల్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భాగ్యలక్ష్మి కాలనీలోని సాయిబాబా ఆలయం సమీపంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి సుమారు 8 గంటల నుంచి 8.30 గంటల మధ్య విధులు ముగించుకుని ఆకాష్ తన గదికి వెళ్తున్నాడు. ఆ సమయంలో సిగరెట్ తాగుతూ వెళ్తున్న అతడిని అదే ప్రాంతానికి చెందిన మహేష్ అలియాస్ మున్నా, అతని స్నేహితులు హేమంత్, చరణ్, అభి, రవి సిగరెట్ అడిగినట్లు పోలీసులు తెలిపారు. ఆకాష్ సిగరెట్ ఇవ్వకపోవడంతో ఇరువర్గాల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో మహేష్, అతని స్నేహితులు ఆకాష్‌పై కర్రతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

# నిజామాబాద్‌లో ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు.

**- కులమతాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలి గంగా జమునా తహజీబ్‌ను కాపాడాలి.**

**- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.**

నిజామాబాద్ ఆగస్టు26:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ పట్టణంలో బుధవారంమిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగగా, అనంతరం ఖిలా రోడ్డు, నెహ్రూ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌లు మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.

**మతాల మధ్య ఐక్యతే తెలంగాణ బలం: షబ్బీర్ అలీ.**

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. మనిషిని మనిషిగా గౌరవించడం, ప్రేమించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని అన్నారు.కులం, మతం, ప్రాంతం పేరుతో మనుషుల మధ్య విభేదాలు సృష్టించుకోవద్దని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ సమాజం ఎప్పటి నుంచో కులమతాలకు అతీతంగా కలిసి జీవించే గొప్ప సంస్కృతిని కలిగి ఉందని, ఈ సామరస్యాన్ని భవిష్యత్ తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ చూపిన శాంతి, కరుణ, సహనం, సోదరభావం మార్గంలో సమాజం ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సెక్యులర్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే పార్టీ అని షబ్బీర్ అలీ అన్నారు. కులం, మతం, భాష, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి



ఒక్కరినీ సమానంగా గౌరవించడం కాంగ్రెస్ పార్టీ విధానమని తెలిపారు. తెలంగాణలో ప్రతి పౌరుడు ప్రశాంతంగా, గౌరవంగా జీవించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఖిలా రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో వేలాది గా ,ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్. నుడాచైర్మన్ కేశ వెణు , శేఖర్ గౌడ్, నరాల రత్నాకర్ , జావిద్ అక్రమ్, కూద్దూస్, హారున్, కార్పొరేటర్లు సజ్జాద్ రహీల్, నయీమ్ షారాన్, అబ్దుల్ కరీం, అబుద్ బిన్ హందన్, అన్వార్, మొహమ్మద్ అహ్మద్, కో ఆప్షన్ మెంబెర్ మహేందర్ సింగ్, ఆసిఫ్, వహీద్, మీలాద్ కమిటీ అధ్యక్షులు షైగ్యబ్ రజా, మహమ్మద్ అబ్బు రజా, రషీద్ రాజా, ముజహిద్ ఖాన్, పాప ఖాన్, జావీద్ ఖాన్, కయ్యుమ్, షబ్బీర్ రాజ్జాక్, జఫర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మొయిన్, సమీ, రియాజుదిన్, సఫ్దర్, అఫ్రోజ్ ఖాన్, సాదిక్ సోహైల్, షైక్ మహబూబ్, పర్వేజ్, ఈసా,మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి..

సూర్యాపేట ఆగస్టు 26:(విజన్ ఆంధ్ర) : క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యంగా ఉండేవారికి కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని ఎటువంటి చెడు అలవాట్లు లేనివారికి కూడా వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ అంకాలజిస్ట్ డాక్టర్ మల్లుపట్టు సుమంత్ కుమార్ అన్నారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ నందు క్యాన్సర్ వ్యాధికి మెమొగ్రామ్ వంటి వైద్య పరిక్షలు





అందుబాటులో వున్నాయని చెప్పారు.బుధవారం సూర్యాపేట ఎమ్మెన్నార్ ఫంక్షన్ హాల్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం హోటల్స్ లో తినడం వలన కూడ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని అన్నారు. పెద్ద పెద్ద రెస్టారెంట్ లలో కూడ నిల్వ వుంచిన ఆహారపదార్థలు వండుతున్నారని, వాటి వలన కూడ వ్యాధులు వస్తాయని చెప్పారు. మనం కూరగాయలు కొని వాటిని వేడినీటిలో కడిగి వండుకోవాలని సాధ్యమైనంత వరకు ఇంటి వద్దనే తినడం ఆరోగ్యానికి మంచిదని అన్నారు. ఆకస్మాత్తుగా బరువు తగ్గిపోవటము లేదా ఎక్కువగా నీరసంగా అనిపించడం, అలసట, ఎక్కువ నడవలేకపోవడం, శారీరక శ్రమ చేయలేకపోవటం కూడా క్యాన్సర్ లక్షణాలని ఆయన చెప్పారు. మహిళలు 45 సంవత్సరాలు దాటిన వారికి రొమ్ము క్యాన్సర్ లేదా సర్వైకల్ క్యాన్సర్ గాని వచ్చే అవకాశాలు ఉన్నాయని వారు చిన్నపాటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు.మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. పురుషుల్లో కూడా ఎక్కడైనా కణతులు ఏర్పడి అవి పెరుగుతున్నట్లయితే ప్రారంభ దశలోనే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని ఆయన అన్నారు. ప్రారంభ దశలో అయితే చిన్న సర్జరీతో నయమవుతుందని అన్నారు. యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ లో క్యాన్సర్ కు మెరుగైన చికిత్స లభిస్తుందని ఆయన చెప్పారు. ఏదైనా వ్యాధి నయం కాకుండా దీర్ఘకాలం పాటు వున్నట్లయితే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని అన్నారు. తాను ప్రతి రెండవ బుధవారం నాలుగవ బుధవారం సూర్యాపేటలో కనెక్ట్ డయాగ్నొటిక్ సెంటర్ లో అందుబాటులో ఉంటారని చెప్పారు.

## స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యం

**- రూ.40.50 లక్షలతో చర్చిగాగిల్లాపూర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**- ప్రజల అవసరాల మేరకు ప్రాధాన్యతా క్రమంలో పనులు కొలన్ హన్మంత్ రెడ్డి**



దుండిగల్, ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ డివిజన్ పరిధిలోని చర్చిగాగిల్లాపూర్ (214)లో స్మశాన వాటిక అభివృద్ధికి అడుగులు పడ్డాయి. రూ.40.50 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రూ.40.50 లక్షలతో చేపట్టనున్న పనులు పూర్తయితే స్మశాన వాటికలో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని చెప్పారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కుల మల్లేష్ యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్ల విజయ్ కుమార్, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెవిటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, కావలి శశి కుమార్, ఆకుల ప్రేమ్, శ్రీకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు నయీమ్, మహేందర్ యాదవ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# అన్ని ఉన్న అల్లుని నోట్లో శని అన్న చందంగా...గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి తీరు...

**- ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవల వైఫల్యం బాధితుడి ఆవేదన**



గద్వాల ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవల వైఫల్యం పై బాధితుడి ఆవేదన చెంది మాట్లాడుతూ ఆసుపత్రికి రోగులు వచ్చే వారికీ మౌలిక వసతులు లేక చేతులపై రోగిని తీసుకోని వెళు న్నారు అన్నారు. బుధవారం గద్వాల ఏరియ ఆసుపత్రికి దేవమ్మ అనే ఆశా వర్కర్ చికిత్స నిమిత్తం ఇక్కడికి తీసుకువచ్చాను. ఆమెకు కడుపునొప్పి వచ్చిందని చెప్పేసి, గద్వాల ఏరియా ఆసుపత్రికి రావడం జరిగింది. ఇక్కడ వచ్చిన తర్వాత టెస్టులు రాశారు. ఆ టెస్టులకు సంబంధించి 'అబ్డామిన్' స్కానింగ్ చేయించుకోవాలని డాక్టర్స్ స్లిప్ రాశారు. అబ్డామిన్ స్కానింగ్ సంబంధించినటువంటి డాక్టర్ ఉన్నారంటే, స్కానింగ్ చేసేటటువంటి వారు లేరండి. వాళ్ళు నెల రోజులు లీవ్‌లో వెళ్ళిపోయరానే సమాధానం చెబుతున్నారు. నెల రోజులు లీవ్‌లో వెళ్ళిపోతే మరి ఎవరైనా ఆల్టర్నేట్ పెట్టొచ్చు కదా అంటే,ఆ ఛాయిస్ లేదండని డాక్టర్స్ సమాధానం ఇస్తున్నారు. ఇక్కడైతే వేరే వారికీ ఆల్టర్నెట్ చేసే అవకాశం లేదని అర్ఎంపి. హేమలత చెప్తున్నారు. ఆర్థికంగా లేని పేద వారు ప్రభుత్వం ఆసుపత్రి కి వస్తుంటారని ఇప్పుడు సిటీ స్కాన్ స్కానింగ్ రాసినారు. అది వచ్చేసి రూ.5,000 అవుతుందని అంటున్నారు. ఇక్కడ మన దగ్గర ఆసుపత్రిలో అన్ని ఎక్విప్‌మెంట్స్ పెట్టుకొని కూడా ఒకరికి లీవ్ ఇచ్చిన తర్వాత ఇంకొకరు ఎవరైనా ఆల్టర్నేట్ చేయకుండా,అక్కడ మీరు కర్నూలుకి వెళ్ళండి, అక్కడికి వెళ్ళండి, ఇక్కడికి వెళ్ళండి' అని చెప్పి ఈ విధంగా చెప్పడం జరిగింది. ప్రజెంట్ మేమున్నటువంటి పరిస్థితుల్లో ఆర్థికంగా ఇబ్బందిలో ఉన్నాము. గవర్నమెంట్ ఆసుపత్రి సూపరింటెండెంట్ కు విన్నవించుకుంటున్నాము. దీనికి సంబంధించినటువంటి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, స్పందించి, దయచేసి ఇక్కడికి ఎవరైనా రిక్రూట్‌మెంట్ చేయాలని చెప్పేసి కోరుకుంటున్నారు.

# గట్టు పంచాయతీలో 'లెక్కల్లేని' లూటీ..!

**- రూ.22 లక్షలు నిలువునా భక్షించిన ఘనులు !**

**- తీర్మానాలు గాల్లోకి.. బిల్లులు పాతర.. 'ఖజానా ఖాళీ'పై అధికారుల ఉక్కుపాదం.!**




గట్టు ఆగస్టు 26( విజన్ ఆంధ్ర) : నిధులు కనబడితే చాలు.. తీర్మానం అక్కర్లేదు, బిల్లుతో పనే లేదు,సర్పంచ్‌లు మారినా, స్పెషల్ ఆఫీసర్లు మారినా పంచాయతీ నిధులను నమిలేసే నైజం మాత్రం మారలేదు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు గ్రామపంచాయతి లో ఏకంగా రూ.22 లక్షల ప్రజాధనం పక్కదారి పట్టిన వ్యవహారంపై డీఎల్పీఓ, ఎంపీఓలు రంగంలోకి దిగడంతో అవినీతి తిమింగలాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎవరికి వారే యథాశక్తి చేతివాటం అధికారుల విచారణలో వెలుగచూసిన అక్రమాల చిట్టా చూస్తే పంచాయతీ ఖజానాను ఎంత దారుణంగా దోపిడీ చేశారో అర్థమవుతోంది. పాత సర్పంచ్ పర్వం: గత సర్పంచ్ హయాంలోనే అక్రమాలకు గండిపడింది. కనీస లెక్కాపత్రం లేకుండా ఏకంగా రూ.7.90 లక్షలు గుటుక్కుమనిపించారు. కార్యదర్శుల కక్కుర్తి, పాలకవర్గం లేని స్పెషల్ ఆఫీసర్ పాలనలో ముగ్గురు కార్యదర్శులు చేతులు కలిపి రూ.7 లక్షల నిధులను నిలువునా ఊడ్చేశారు. కొత్త పాలకవర్గం దోపిడీ, మేము మాత్రం తక్కువ తిన్నామా అన్నట్లు బాధ్యతలు చేపట్టిన ఎనిమిది నెలల్లోనే ప్రస్తుత సర్పంచ్ రూ.5 లక్షలు డ్రా చేసి రికార్డులను పాతరేశారు. ప్రమాణస్వీ కారానికి జలసా, చివరకు ప్రమాణస్వీకారం పేరుతోనూ ప్రజాధనం నుంచి రూ.90 వేలు దండుకోవడం వీరి తెంపరితనానికి పరాకాష్ట. గ్రామసభలకు మంగళం.. రికార్డులు మాయం, ఎనిమిది నెలల్లో కనీసం ఒక్కటంటే ఒక్క గ్రామసభతో మమ అనిపించి, నిధుల వినియోగాన్ని ప్రజల నుంచి పూర్తిగా దాచిపెట్టారు. విచారణలో అధికారులు రికార్డులు, తీర్మానాలు చూపాలని నిలదీస్తే బాధ్యుల వద్ద సమాధానం కరువైంది. బాధ్యులపై వేటు తప్పదు, ప్రజాధనం అస్మదీయుల పాలు కావడంపై సమగ్ర విచారణ జరుగుతోంది. రెండు రోజుల్లో కలెక్టర్‌తో పాటు ఉన్నతా ధికారులకు నివేదిక ఇస్తాం. రికార్డులు దాచినా, నిధులు మళ్లించినా ఎంతటి వారైనా ఊచలు లెక్కపెట్టక తప్పదని డీఎల్పీఓ హెచ్చరించారు.

# శ్రీ శ్రీ శ్రీ నూతన ఆంజనేయులు స్వామి దేవాలయం

***ధ్వజస్తంబ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవములో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి***





గద్వాల ఆగస్టు 26( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పరిధిలోని నూతన ర్యాలంపాడు ఆర్ & ఆర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఆంజనేయులు స్వామి దేవాలయం, ధ్వజస్తంబ, విగ్రహ ప్రతిష్ట ప్రతిష్ట మహోత్సవము కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దంపతులకు బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయులు స్వామి నూతన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవము సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకోవడం జరిగినది. . ఎమ్మెల్యే దంపతులకు గ్రామ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ,నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్చం, ఆంజనేయస్వామి విగ్రహాన్ని బహుకరించి ఇచ్చి, ఘనంగా సత్కరించారు. అనంతరం మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే దంపతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బడి, గుడి తప్పనిసరిగా ఉండాల దేవాలయాలు ఉండడం వల్ల ప్రజలలో భక్తి శ్రద్ధలతో దేవుని పూజించడం వల్ల శాంతి నెలకొల్ప బడుతుంది గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని అన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం ఏ విధంగా పాటుపడుతున్నారో,అదేవిధంగా గ్రామ అభివృద్ధికి కూడా ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఐక్యతతో ఆ దైవ అనుగ్రహంతో గ్రామం అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ ఛైర్మెన్ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, సర్పంచ్ వెంకటరామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఆలయ కమిటీ డైరెక్టర్ రాధామ్మ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, ఉరుకుందు, యుగంధర్ గౌడ్, భీమ్ రెడ్డి, నాగన్న, జనార్దన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి యువ నాయకులు పురుషోత్తం రెడ్డి, నాయకులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, జె ఇ ఇ /నీట్ శిక్షణ

**- అర్హత, అనుభవం ఉన్న అధ్యాపకులు,**
**ప్రముఖ విద్యాసంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**



కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 27(విజన్ ఆంధ్ర) : సింగరేణి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సింగరేణి పాఠశాలలు, కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థుల విద్యా నైపుణ్యాలను మరింతగా పెంపొందించేందుకు సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌తో పాటు జేఈఈ, నీట్ వంటి ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు అర్హత, అనుభవం కలిగిన అధ్యాపకులు, ప్రముఖ విద్యాసంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సింగరేణి పాఠశాలల్లో విద్యార్థులకు ఆంగ్ల భాషలో చదవడం, రాయడం, మాట్లాడడం వంటి భాషా నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. అదేవిధంగా కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులకు జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అవసరమైన సబ్జెక్టులపై ప్రత్యేక కోచింగ్ అందించనున్నారు. పోటీ పరీక్షల్లో విద్యార్థినులు మెరుగైన ప్రతిభ కనబరిచి ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకునేలా శిక్షణను రూపొందించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆసక్తి, అర్హత, తగిన అనుభవం కలిగిన వ్యక్తులు, అధ్యాపకులు, విద్యాసంస్థలు తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత ధృవీకరణ పత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ (పర్సనల్)/సెక్రటరీ జి. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను 2026 సెప్టెంబర్ 3వ తేదీలోపు కొత్తగూడెంలోని జనరల్ మేనేజర్ (పర్సనల్)/సెక్రటరీ, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో నేరుగా సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 08744-248843 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# గిరిజనుల ఐక్యత,సంస్కృతికి ప్రతిబింబం తీజ్ పండుగ

**- గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**





శేరిలింగంపల్లి.ఆగస్టు 26 : (విజన్ ఆంధ్ర) : గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మైసిగండిలో గిరిజనులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తీజ్ పండుగ వేడుకలకు ముఖ్యఅతిథిగా గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ హాజరై, గిరిజన సోదర సోదరీమణులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెళ్లికాని గిరిజన యువతులు తీజ్ పండుగ సందర్భంగా ఎంతో భక్తిశ్రద్ధలతో తమ ఆరాధ్య దైవాలను పూజిస్తూ,మంచి వరుడు లభించి, తమకు త్వరగా వివాహం జరగాలని కోరుకోవడం ఈ పండుగలో కొనసాగుతున్న ఒక ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. తీజ్ పండుగ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, గిరిజనుల జీవన విధానం,విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతిబింబమని ఆయన అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న గిరిజనుల ఆచార సంప్రదాయాలను పరిరక్షిస్తూ, వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గిరిజనుల సంక్షేమం, వారి హక్కులు, అభివృద్ధితో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గిరిజన సమాజ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు శ్రీరాములు, తులసి రామ్, అర్జున్ ,ప్రకాష్,రంగస్వామి, గోవర్ధన్,రవీంద్ర,రాజు, గోపాల్,పరమేశ్,టీకి లాల్, శారద,నందిని,ఇందు, స్థానిక నేతలు,ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశంలోనే యుపిఐ పేమెంట్స్ విప్లవాత్మక మార్పు, చారిత్రాత్మక విజయం...





శేరిలింగంపల్లి.ఆగస్టు 26: (విజన్ ఆంధ్ర) : దేశవ్యాప్తంగా యుపిఐ పేమెంట్స్ పద్ధతిని ప్రవేశపెట్టి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు శ్రీరామ్ నగర్ ఏ బ్లాక్ లో నిర్వహిస్తున్న చిరు వీధివ్యాపారులు కూరగాయల మార్కెట్ సందర్శించిన ...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం, మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా పేరుతో తీసుకొచ్చిన చారిత్రాత్మక నిర్ణయం యుపిఐ పేమెంట్స్ పై కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు చిదంబరం ఎద్దవ చేస్తూ టి షాపులు, కూరగాయల వ్యాపారులు , చిన్న కిరాణా షాపుల కు మెషిన్స్ ఎవరిస్తారు, ఇంటర్నెట్ ఎవరిస్తారు, వైఫై ఎక్కడ ఉంటుంది , ఇది ఒక తప్పుడు నిర్ణయం అన్నారని, కానీ ఇప్పుడు 10 సంవత్సరాల తర్వాత చూస్తే ప్రతి చిన్న కూరగాయలు, టి , మరియు బట్టల షాప్ ,ప్రతి పెద్ద వ్యాపారి యుపిఐ పేమెంట్స్ వాడుతున్నారని, తెలియజేసేందుకు నేను స్వయంగా కూరగాయలు అమ్మే దగ్గర కు వెళ్ళి స్వయంగా కూరగాయలు కొని యుపిఐ పేమెంట్ చేయడం జరిగిందని మరియు చాయ్ దుకాణం వద్ద టీ కొని యుపిఐ పేమెంట్ చేయడం జరిగిందని వాళ్ళని అక్కడ ఉండే వినియోగదారులను కనుక్కుంటే చాలా ఉపయోగకరం గా ఉందని ఇంతకు ముందు చిన్న చిన్న షాపు లకు వెళ్ళినప్పుడు చిల్లర కోసం చాలా ఇబ్బందులు ఉండేవని ఇప్పుడు అలాంటివి ఏమి లేవని తెలియజేశారన్నారు, విప్లవాత్మక నిర్ణయానికి చరిత్రాత్మక విజయమని కొనియాడారు, దేశంలో ప్రతి ఒక్కరు యుపిఐ పేమెంట్స్ వాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా వాడుతున్నారని ఇకనైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశం కోసం తీసుకొచ్చే నిర్ణయాలు , మార్పుల పై విమర్శలు మరియు ఎద్దేవ చేసేముందు ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి, ఎల్లారెడ్డి, ఎయిర్టెల్ వెంకటేష్, రమేష్ యాదవ్, వెంకటేష్, మరియు స్థానిక నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఉద్యోగుల మహాధర్నా విజయవంతం చేయండి

**- పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్**

**- రెండో పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని ఉద్యోగుల పట్టు**

**- రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వినతి**

**- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్**



ఇబ్రహీంపట్నం ,ఆగస్టు 26(విజన్ ఆంధ్ర ): ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ మహాధర్నాకు రంగారెడ్డి జిల్లా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రంగారెడ్డి జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఉటు యశ్వంత్ పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ మహాధర్నా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, రెండో పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు సంబంధించిన సుమారు రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 12.5 శాతం కోటాను అమలు చేయాలని, ఉద్యోగులకు ఈహెచ్ఎస్ వైద్య విధానాన్ని అమలు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. అడుక్కుంటే హక్కులు సాధ్యం కావు.. పోరాటాలతోనే హక్కులు సాధించుకోవాలి అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని ఉటు యశ్వంత్ కోరారు. ఉద్యోగులందరూ ఐక్యతను చాటి నేటి మహాధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఆగస్టు 27న గ్రామ , వార్డు సభలు

**- కలెక్టర్ బోర్ఖడే హేమంత్ వాసుదేవరావు**



ములుగు ఆగస్టు 26, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఈ సభల్లో సంబంధిత బీఎల్ఓలు ఓటరు జాబితాలను చదివి వినిపిస్తారని, ఓటర్లు తమ పేరు, చిరునామా వివరాలు సరిచూసుకోవాలని సూచించారు. అర్హులైన వారు కొత్త నమోదుకు ఫారం-6, తొలగింపు/అభ్యంతరాలకు ఫారం-7, సవరణకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆచూకీ లేని, వలస వెళ్లిన, మరణించిన, రెండు చోట్ల నమోదైన ఓటర్ల జాబితాలను సభల్లో పరిశీలనకు ఉంచుతామని, అసంగత వివరాలున్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. నోటీసు అందుకున్న ఓటర్లు ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు గ్రామ పంచాయతీ/వార్డు కార్యాలయాల్లో జరిగే విచారణకు అసలు ధ్రువపత్రాలతో హాజరు కావాలని, సందేహాలకు 1950 టోల్ ఫ్రీ నంబర్ ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

# ప్రేమ, దయ, కరుణ, సోదరభావమే ప్రవక్త మహమ్మద్ బోధనలు

***మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం***



కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో) 26బిఆగస్ట్: ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే పవిత్రమైన మిలాద్-ఉన్-నబీ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ ప్రపంచానికి ప్రేమ, దయ, కరుణ, సహనం, సోదరభావం వంటి గొప్ప విలువలను బోధించారని తెలిపారు. ఆయన అందించిన సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. హజ్రత్ మహమ్మద్ ప్రవక్త జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొందుతూ పరస్పర సామరస్యంతో జీవించాలని పిలుపునిచ్చారు.మతాలు, వర్గాలకు అతీతంగా ప్రజలంతా సోదరభావంతో మెలగాలని, శాంతి, ఐక్యతను కాపాడుతూ దేశ అభివృద్ధి, పురోగతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. సమాజంలో ప్రేమ, కరుణ, సహనం, మానవతా విలువలను మరింతగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మిలాద్-ఉన్-నబీ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యాన్ని నింపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగను ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వారు కోరారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం

**- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి.ఆగస్టు 26: (విజన్ ఆంధ్ర) : మూడు లక్షల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి ని అందచేసిన పి ఎ సి చైర్మన్ హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ నగర్ కాలనీ కి చెందిన శ్రీనాథ్ రెడ్డి కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన పత్రాన్ని బాధిత కుటుంబానికి అందచేసిన పీఏసీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పేదల పక్షపాతి అని . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో శ్రీచికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. .ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పిఎసి చైర్మన్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

# రూ.4.46 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



ములుగు ఆగస్టు 26 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో రూ.4 కోట్ల 46 లక్షల విలువైన పనులకు మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తాడ్వాయి మార్కెట్ యార్డులో రూ.83 లక్షలు, ఏటూరునాగారం మార్కెట్ యార్డులో రూ.2 కోట్ల 28 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శివాపూర్ లో రూ.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్లు, గోగుపల్లిలో రూ.55 లక్షల సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అలంపూర్ నియోజకవర్గంలో పర్యటించిన ఎంపీ మల్లు రవి, ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్




ఉండవల్లి ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా లోని ఉండవల్లి మండలానికి విచ్చేసిన నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు ఎంపీ మల్లు రవి ,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ కి ఎర్రవల్లి చౌరస్తా వద్ద గొర్రెలు, షిప్స్ కార్పొరేషన్ చైర్మెన్ సరిత తిరుపతయ్య ,ఎర్రవల్లి తాజా మాజీ మండల అధ్యక్షులు, యితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువాలు కప్పి బోకేలు ,పూల దండలతో ఘన స్వాగతం పలకడం జరిగింది. అనంతరం జోగులాంబ గద్వాల జిల్లా కి సంబంధించి నెట్టెంపాడు రిజర్వాయర్ సాధన సమితి సభ్యులు ఎంపీ మల్లు రవి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ గారు మీడియాతో మాట్లాడుతూ ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాలకు సంబంధించి దాదాపు 2 లక్షల ఎకరాలకు నీటిని అందించే ప్రాజెక్టు 90 శాతం కాంగ్రెస్ పార్టీ హయంలోనే పూర్తి అయిందని మిగిలిన 10 శాతం పూర్తి చేయాలని, గత బి ఆర్ ఎస్ పార్టీని ఎన్ని సార్లు మొర పెట్టుకున్న రైతులను పట్టించుకోలేదని అన్నారు .99,100,101 ప్యాకేజీలను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో 'రవి' కాంతులు..

**- అంజన్న రాజకీయ వారసుడిగా "రవీందర్ యాదవ్"..**
**- బీఆర్ఎస్ నేతలను వెంట తిప్పుకుంటూ చురుకుగా కార్యక్రమాలు..**
**- యువనేత వై. రవీందర్ యాదవ్ కొత్త రాజకీయ సమీకరణ..**
**- ఊహించని రాజకీయ ట్విస్టుకు శ్రీకారాలు**

రంగారెడ్డి బ్యూరో, ఆగష్టు26(విజన్ ఆంధ్ర ): రాజకీయం.. ఇది ఎప్పుడు ఎలా మారుతుందో తెలియదు.. నాయకుడిగా ఎవరు ఎదుగుతారో.. ఎవరు ఎటువైపు కదులుతారో అర్థం కాదు.. కానీ షాద్ నగర్ బీఆర్ఎస్ లో మాత్రం ఒకటి స్పష్టంగా కనిపిస్తుంది. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ పెద్ద కుమారుడు రవీందర్ యాదవ్ రాజకీయంగా "యాక్టివ్" గా మారిపోయారు.. బీఆర్ఎస్ వర్గాలను ఉత్సాహపరుస్తూ చురుకుగా ముందుకు సాగుతున్నారు. ఎల్లప్పుడూ వివాదాలకు దూరంగా ఉంటూ ఆచితూచి నిరంతరం అడుగులు వేస్తూ గత పాలన అనుభవంతో ముందుకు సాగుతూ రాజకీయంగా ఒక నూతన ఒరవడిని సృష్టించబోతున్నారు. ఈ మధ్యకాలంలో నియోజకవర్గంలో రవీందర్ యాదవ్ అలియాస్ రవన్న రాజకీయ పర్యటనలు విమర్శకులను సైతం ఆలోచింపజేస్తున్నాయి. ఇటీవల కాలంలో మరోవైపు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా బిఆర్ఎస్ పార్టీలో అంజయ్య యాదవ్ నే ప్రధాన ప్రత్యర్థిగా భావించడం జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మధ్యకాలంలో యాదవ సామాజిక వర్గం పార్టీలకు అతీతంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్వగృహానికి వెళ్లి సామాజిక సమావేశానికి హాజరు కావడం కూడా రాజకీయంగా వారికి ఉన్న పట్టు గురించి తెలియజేస్తుంది. అలాగే స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సైతం తన కోడలు రాణి వివాహానికి ఇంటికి వెళ్లి మరి పత్రిక ఇచ్చి స్వయంగా ఆహ్వానించడం ప్రస్తుతం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిందనీ చెప్పవచ్చు. ఈ పత్రిక ఇచ్చిన వైనం మాజీ ఎమ్మెల్యే అంజయ్య ఇంటి గడప తొక్కిన వీర్లపల్లి శంకర్ రాజకీయ ధైర్యంతో ఎవరి రాజకీయ పలుకుబడి ఏమిటో చెప్పకనే చెబుతుందని రాజకీయాల్లో ఒక పెను సంచలనంగా మారుతుంది. ఎమ్మెల్యే నేటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఎంతో పెద్దమనసుతో మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లడం మంచి మార్పుకు కారణమని కొందరు అంటుండగా కాంగ్రెస్ పార్టీలో మాత్రం ప్రత్యర్థి ఇంటి గడప తొక్కడం కొంత ఇబ్బందికర పరిస్థితి గానే చెప్పవచ్చు. అదే బిఆర్ఎస్ పార్టీలో మాత్రం ఫుల్ జోష్ నెలకొంది. ముఖ్యంగా యువనేత రవీందర్ యాదవ్ అంజన్న రాజకీయ వారసుడిగా లైన్ క్లియర్ అవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఒక్కసారి మారుతున్న తాజా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే..

**నిన్నటి కథ..**

రాజకీయాల్లో తూక్యా.. మైక్యా... అంటూ నిన్నటిదాకా తిట్టుకున్న కాంగ్రెస్ – బీఆర్ఎస్ రాజకీయాలు మనకు తెలిసిందే. ప్రస్తుతం ఈ వాతావరణంలో చాలా వరకు మార్పు కనిపిస్తుంది. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రాజకీయంగా కుమారుడిని తెరమీదికి తెచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు రవీందర్ యాదవ్ కూడా పదేళ్లపాటు తండ్రికి అన్ని విధాల అండగా ఉండి పాలనలో తన భాగస్వామ్యాన్ని అందించడంతో పాటు రెండవసారి తన తండ్రి గెలుపుకు కారణమయ్యారు. ఓటమి తర్వాత కూడా నిరంతరం యాక్టివ్ గా ఉంటూ కార్యకర్తలను వదులుకోకుండా గ్రామాలు తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో పటిష్టంగా ఉండేలా కృషి చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గం ప్రత్యేకంగా ఏర్పడడం పార్టీకి కొంత శరాఘాతంగా మారినప్పటికీ ఆ లోటును పూడ్చి పార్టీకి జవసత్వాలు అందించే దిశగా రవి అడుగులు వేస్తున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా రవీందర్ యాదవ్ నే తన ప్రత్యర్థిగా భావిస్తున్నారని స్పష్టమవుతుంది. ఎన్నడూ అంజయ్య యాదవ్ ఇంటి గడప కూడా తొక్కని వీర్లపల్లి శంకర్ స్వయంగా వెళ్లి అతడిని వివాహానికి ఆహ్వానించడం ప్రత్యర్థులకు మింగుడు పడనిదిగా మారింది. ఇంత శత్రుత్వం ఉన్న అది రాజకీయాలకే పరిమితం అని, మంచి, చెడు సమయాలలో ఒకరికి ఒకరు కలిసి ఉండాలని సంకేతాన్ని ఈ ఇరువురు నాయకులు ఇవ్వడం రాజకీయ పెను మార్పులకు ఊతాన్ని ఇస్తున్న అంశం. ప్రస్తుతం రాజకీయాలకు ఇలాంటి మార్పులే కావాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఇదేంటి.. ఇలా జరిగింది..**

నిన్న మొన్నటి దాకా రాజకీయ శత్రువులుగా ఉన్న కాంగ్రెస్–బీఆర్ఎస్ వర్గాలలో మాత్రమే కాదు.. ప్రత్యర్థులలో కూడా రాజకీయంగా ఇద్దరు ఇద్దరే అనిపించుకున్న ఎమ్మెల్యే శంకర్, రవీందర్ యాదవుల కలయిక ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఒకవైపు ఇప్పటికే బీఆర్ఎస్ లో నవీన్ రెడ్డి వర్గం రూపంలో రాజకీయ కుంపటి ఉంది. ఇలాంటి దశలో ఎమ్మెల్యే రవీందర్ యాదవ్ కి ప్రాధాన్యతనివ్వడం చర్చకు దారి తీస్తుంది. మరోవైపు బిజెపి నాయకులకు కూడా ఇది మింగుడు పడడం లేదు. దశాబ్దాలుగా షాద్ నగర్ నియోజకవర్గంలో తమ సత్తా చాటాలని ప్రయత్నిస్తున్నా .. బిజెపి నాయకులు మారినా రాజకీయ సీన్లతో ఎలా ముందుకు వెళ్లాలో అర్థంకాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రవీందర్ యాదవ్ కూడా రాజకీయంగా ఎన్నికల సమయంలో పోరాడాలి.. ఇప్పుడు విమర్శలు అవసరం లేదు.. పార్టీని పటిష్టం చేయడం ముఖ్యం అనే ధోరణిలో గ్రామ గ్రామానికి వెళుతూ బీఆర్ఎస్ నేతల్లో మంచి ఉత్సాహాన్ని నింపుతూ వివాదాల జోలికి పోకుండా ముందుకు సాగుతుండడం ద్వారా ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేది రవీందర్ యాదవ్ అన్న చర్చ ప్రతి చోటా సాగుతోంది. కొంతమంది కార్యకర్తలు అభిమానులు అన్నను ఎమ్మెల్యేగా చూడాలి అంటూ సోషల్ మీడియాలో ప్రచారాలతో హోరెత్తిస్తున్నారు. దీన్నిబట్టి భారత రాష్ట్ర సమితిలో రవి యువసత్తా కనిపించే విధంగా తాజా పరిణామాలు దీనిని బలపరుస్తున్నాయి. దీనితో నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది.



## గంగపుత్ర కుటుంబాలకు అండగా సహాయనిధి ఫౌండేషన్

**- కష్టకాలంలో రెండు కుటుంబాలకు రూ.80 వేల ఆర్థిక సాయం**



హైదరాబాద్, ఆగస్ట్ 26 (విజన్ ఆంధ్ర) : గంగపుత్ర కుటుంబాల్లో ఆపద సమయంలో అండగా నిలిచే లక్ష్యంతో గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం, సహాయనిధి ఫౌండేషన్ రెండు బాధిత కుటుంబాలకు మొత్తం రూ.80 వేల ఆర్థిక సహాయం అందజేసింది. అకాల మరణం చెందిన ఆరేపల్లి గ్రామానికి చెందిన బింగి నర్సయ్య కుటుంబానికి సంఘం తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కష్టకాలంలో మనోధైర్యంగా ఉండాలని సంఘం నాయకులు కోరారు. అదేవిధంగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కాలుకు శస్త్రచికిత్స అనంతరం కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిన మేడి రాజేందర్ కుటుంబానికి వైద్య ఖర్చుల కోసం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గంగపుత్ర కుటుంబాల్లో ఎవరికైనా ఆపద సంభవించినప్పుడు 'మీకు మేమున్నాం' అనే భరోసాతో సహాయనిధి ఫౌండేషన్ అండగా నిలుస్తుందని తెలిపారు. కష్టకాలంలో ఒకరికొకరు తోడుగా ఉండటమే నిజమైన ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బింగి రాజు, గంగపుత్ర కడెం మండల అధ్యక్షులు మేడి రాజేందర్, జుంబర్తి మల్లేష్, జుంబర్తి నరేందర్, జుంబర్తి కృష్ణ, గుమ్ముల నరేష్, అసంపెల్లి మధుకర్, జుంబర్తి నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 29న మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపిక

**-తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్**



హైదరాబాద్, ఆగస్ట్ 26 (విజన్ ఆంధ్ర) : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ప్రొఫెసర్లు, ఫిజికల్ డైరెక్టర్లకు మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డు–2026 ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డులకు ప్రొఫెసర్ ఆర్.సునీల్ కుమార్, డాక్టర్ కరిగా అనిత, డాక్టర్ ఆర్.మురళి, డాక్టర్ బి.ఆర్.నేత, డాక్టర్ బట్టు వెంకన్న, డాక్టర్ పి.సుప్రియ, డాక్టర్ ఏ.సిద్ధార్థ, డాక్టర్ సి.సందీప్ రెడ్డి, మేజర్ డి.జయసుధ, మేజర్ కె.ఏ.శివప్రసాద్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.దీప్ల, విద్యావేత్త సాదుల మధుసూదన్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

## 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్



భూపాలపల్లి జిల్లా :26 ఆగస్ట్ ( విజన్ ఆంధ్ర ) : భూపాలపల్లి కలెక్టరేట్ సమీపంలోని జాతీయ రహదారిపై పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను భూపాలపల్లి జజూ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు టీఎస్ 02 UC 2103 నంబర్ గల టాటా ఏసి పికప్ ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పావనపు రాజు, తండ్రి సమ్మయ్య, వయస్సు 26 సంవత్సరాలు, వృత్తి వ్యాపారం, CR నగర్, భూపాలపల్లి..నీలుగొండ రమేష్, తండ్రి తిరుపతి, వయస్సు 21 సంవత్సరాలు, డ్రైవర్, CR నగర్, భూపాలపల్లి. నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ SHOకి అప్పగించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిసిఎస్ పోలీసులు హెచ్చరించారు.

# ఆర్డీఎస్ కు నీళ్లు వెంటనే విడుదల చేయాలి

**- తుమ్మిళ్ల లిఫ్ట్ ను సందర్శించిన రాష్ట్ర బిజేపీ కార్యవర్గ సభ్యుడు ఎస్.రామచంద్రారెడ్డి**




రాజోలి ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలి మండల అధ్యక్షుడు కనికే శశి కుమార్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు తుమిళ్ల లిఫ్ట్ కు సంబంధించిన మల్లమ్మ కుంట రిజర్వాయర్ సందర్శించి,మల్లమ్మకుంట సామర్థ్యం 3 టీఎంసీ లకు పెంచండని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి వచ్చిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ రాజోలి మండలం తుమ్మిళ్ల లిఫ్ట్ ముఖ్యంగా అల్లంపూర్ నియోజకవర్గం లో చాలా అతి ముఖ్యమైనటువంటి లిఫ్ట్ అని, ఈ లిఫ్ట్ గత 2018లో కేసీఆర్ ప్రభుత్వం, ఉన్నప్పుడు హడావిడిగా ప్రారంభించి ఎలాంటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లేకుండా ఈ యొక్క లిఫ్టను ప్రారంభించారు. ముఖ్యంగా దీని ఉద్దేశం ఆర్డీఎస్ 25 డిస్ట్రిబ్యూటర్ నుండి 40 డిస్ట్రిబ్యూటర్ వరకు రైతులందరికీ నీళ్లు అందించాలని ఒక మంచి సంకల్పంతోన ఏర్పాటు చేయడం జరిగింది. సంతోషమే కానీ ఎన్నికల స్టంట్ అనుకొని కేవలం అప్పుడు హడావిడి గల ప్రారంభించి గతంలో కేసీఆర్ గానీ ఇప్పుడున్నటువంటి రేవంత్ రెడ్డి కనీసం దీని పట్టించుకునే నాధుడు లేరని విమర్శించారు. ఈ మధ్యనే సంబంధించి మల్లమ్మ కుంట దగ్గర భూమి సేకరించి మల్లమ్మ రిజర్వాయర్ మల్లమ్మకుంట రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని ఒక సంకల్పం మంచిదే కానీ ఇప్పటివరకు దాన్ని లేటు కావడం వల్ల రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆ వేదన వ్యక్తం చేశారు. గద్వాల నియోజకవర్గంలో 7 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఉన్నాయి. గద్వాల నియోజకవర్గ విషయానికొస్తే 1980 తర్వాత అక్కడ సాగు నీళ్లు రావడం జరిగింది. డ్యాముల ద్వారా కానీ ఇదే అలంపూర్ నియోజకవర్గానికి 1945 అంటే ఈ యొక్క స్వాతంత్రం రాకముందే మనకు ఆర్డీఎస్ నీళ్లు వచ్చాయి. మా ఆలంపూర్ నియోజకవర్గంలో కనీసం ఒక్క రిజర్వాయర్ కూడా లేకపోవడం చాలా దారుణం అని, కనీసం మల్లమ్మ కుంట రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని కోరారు.ముఖ్యంగా మల్లంకుంట 1.02 టిఎంసిలు మాత్రమే ప్రభుత్వం ప్రతిపాదించింది కానీ 3 టీఎంసీలు కనుక నిర్మించినట్లయితేనే చివరాయకట్టు వరకు ప్రతి రైతుకు నీళు అందుతాయి. కాబట్టి వెంటనే ప్రభుత్వం దీనిపై చర్య తీసుకొని చివరాయకట్టు వరకు అంటే ఆర్డీఎస్ డి40 వరకు నీలాందించాలంటే 3.03 టీఎంసీలు సంబంధించినటువంటి భూసేకరణ చేసి,దీని ప్రతిపాదించాలని రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందని అన్నారు. కర్ణాటక ప్రాంతంలో ఉన్నటువంటి ఢీ 12 వరకునీళ్లు ఏ విధంగా వస్తున్నాయి, అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు ప్రభుత్వాలు కాంగ్రెస్ ఉన్నప్పుడు అక్కడ నీళ్లు రావడమేమీ ఇక్కడున్నటువంటి కింది ప్రాంతాలకు నీళ్లు ఎందుకు రావడం లేదని భారతీయ జనతా పార్టీ ప్రశ్నించారు. వెంటనే కర్ణాటక రైతులకు ఏ విధంగా నీరు ఇచ్చారో మా యొక్క తెలంగాణ రైతులకు కూడా నీరు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేశారు. అదేవిధంగా మల్లమ్మకుంట సంబంధించి మూడు మూడు పిఎంసిల సమర్థం గల రిజర్వాయర్ని వెంటనే యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేయాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షుడు సంఘాల సంజీవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్దూర్ అశోక్,మాన్దొడ్డి ఉపసర్పంచ్ భీమన్న, మాంధొడ్డి వార్డ్ మెంబర్ రమేష్ బాబు, తుంకుంట అంజి, మండల నాయకులు తిరుమలేష్, ముల్లదిన్నె మహేష్ , ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు ప్రకాశం, తనగల రవి గౌడ్, నరేష్ నాగరాజ్, ప్రవీణ్, శేఖర్,సుధాకర్, వీరేష్, శివ ప్రసాద్, వెంకటేష్, మునిస్వామి, గోకారి, నాగార్జున, నాగేష్,తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఆదర్శంగా.. ఆ సోదరులు

**- కూలీగా శ్రమించి.. పరిశ్రమను నెలకొల్పేందుకు ముందడుగు..**
**- సొంతంగా రైస్ మిల్లు ఏర్పాటుతో పలువురికి ఉపాధి..**





వికారాబాద్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకుండా.. ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో సోదరులిద్దరూ రాత్రనకా పగలనకా శ్రమించారు. పట్టుదలతో పరిశ్రమను నెలకొల్పి తాము ఆర్థికంగా ఎదుగుతూ.. పలువురికి ఉపాధిని కల్పిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాలకు వెళితే.. పరిగి పట్టణానికి చెందిన ఆర్.ప్రవీణ్, ఆర్.సంతోష్ కుమార్ లు ఇద్దరు అన్నదమ్ములు. తండ్రి ప్రైవేటు ఉద్యోగంతో చాలీచాలని సంపాదనతో ఇల్లు గడవడం కష్టమైంది. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పెద్దవాడు (ఆర్.ప్రవీణ్) తన చదువును పదోతరగతి వరకే ఆపేశాడు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ డీసీఎంఎస్ కు చెందిన రైస్మిల్ లో ఆపరేటర్ గా పనిచేసే (తాత వరుసైన) వ్యక్తి వెంట కూలీగా పనికి వెళ్లాడు. 13 ఏళ్ల పాటు నిరంతరంగా పనికి వెళ్తూ మిల్లును నడిపేందుకు నైపుణ్యాన్ని పొందాడు. మిల్లును నడిపేందుకు పూర్తి అవగాహన రావడంతో అదే రైస్ మిల్లును ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకున్నాడు. 7 ఏళ్ల పాటు నైపుణ్యతతో నిరాటంకంగా నడిపాడు. ఆర్థికంగా వెసులుబాటు కావడంతో అతని తమ్ముడు సంతోష్ కుమార్ ను కంప్యూటర్ సైన్సో పోస్టు గ్రాడ్యుయేట్ చదివించాడు. తమ్ముడు అన్నకు ఆసరాగా ఉంటూ.. డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంచార్జిగా పనిచేశాడు. అన్నదమ్ములిద్దరూ ఒకే రంగంలో నైపుణ్యం పొందడంతో సొంతంగా రైస్ మిల్లు వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో పరిశ్రమను నెలకొల్పేందుకు రుణం కోసం పీఎంఈజీపి స్కీం కింద సంతోష ధరఖాస్తు చేసుకోగా.. ఉన్నత చదువును చూసి ఎలాంటి హామీ పత్రాలు లేకుండా స్థానిక బ్యాంకు వారు రూ.60 లక్షల రూపాయల వరకు రుణాన్ని అందించి ప్రోత్సహించారు. దీంతో ఉత్సాహంతో మండల పరిధిలోని చిగురాల్పల్లి గ్రామ పరిసరాల్లో రైస్ మిల్లును స్థాపించి 2023లో మిల్లును ప్రారంభించారు. అన్న మిల్లును నడిపిస్తుండగా తమ్ముడు లావాదేవీలను చూసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతూ ప్రస్తుతం 15 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. అహర్నిశలు కష్టపడుతూ మూడేళ్లలోనే సగానికి పైగా బ్యాంకు రుణాన్ని చెల్లించి అభివృద్ధి దిశగా సాగుతున్న వీరిరువురు పలువురికి ప్రేరణగా నిలుస్తున్నారు. మిల్లును మరింత ఉన్నత స్థాయికి చేర్చి మరి కొంతమందికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ఆసోదరులు కోరుతున్నారు.

## బోడుప్పల్‌లో ఘనంగా మిలాద్-ఉల్-నబీ వేడుకలు

**- పాల్గొన్న తోటకూర అజయ్ యాదవ్,జక్కిడి శివచరణ్ రెడ్డి**



బోడుప్పల్,ఆగస్ట్26(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్‌లోని మసీద్ వద్ద యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ అమీర్ (అజ్జు) ఆధ్వర్యంలో మిలాద్–ఉల్–నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్ అమీర్ (అజ్జు) ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ మిలాద్–ఉల్–నబీ పర్వదినం మత సామరస్యం, సోదరభావం, సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి,మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్ కుమార్,మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, దుబ్బాక చంద్రిక గౌడ్, యరమల రామచంద్రారెడ్డి,రాష్ట్ర కార్యదర్శి వెలిమినేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజ్వారంలో జిన్ను కృష్ణారెడ్డి ఇంట్లో చోరీ..

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై కొండ శ్రీహరి**

మల్దకల్ ఆగస్టు 26( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. మాజీ ఎంపీపీ రాజారెడ్డి అన్న జిన్ను కృష్ణారెడ్డి ఇంట్లో దొంగలు చొరబడి చోరీకి పాల్పడినట్లు సమాచారం. బాధిత కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మల్దకల్ ఎస్సై కొండ శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీకి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి క్లూ లభించలేదని ఎస్సై తెలిపారు. ఆధారాల కోసం పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



# జర్నలిస్టుల ఆపద్బాంధవుడు మంత్రి దామోదర్ రాజనర్సింహ

**- జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర నాయకులు యాదగిరి ముదిరాజ్**



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర ఆగస్టు 26: అందోల్ నియోజకవర్గ సీనియర్ పాత్రికేయులు అల్లాదుర్గం భూమయ్య ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ తో అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం సీనియర్ జర్నలిస్ట్ మునిపల్లి యాదగిరి మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో అప్పటికప్పుడే స్పందించి హాస్పిటల్ కు చేరుకొని మెరుగైన వైద్య చికిత్స కోసం ఆస్పత్రి డాక్టర్ తో మాట్లాడారు. నాకు అత్యంత సన్నిహితుడు మెరుగైన వైద్యం చేయాలని సూచించారు. ఆస్పత్రిలో సీనియర్ పాతికేయులు భూమయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ, నేనున్నానని మంత్రి దామోదర్ రాజనర్సింహ భరోసానిచ్చారు. మెరుగైన వైద్యం చేయించిన మంత్రి దామోదర్ కు ఆందోల్ ప్రెస్ క్లబ్ జర్నలిస్ట్ లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి అల్లాదుర్గం భూమయ్య మెరుగైన వైద్య సేవలు అందడంతో ప్రస్తుతం కోలుకొంటున్నా విషయం మంత్రి కి తెలియజేయడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ యధావిధి స్థానానికి రావాలని అన్నారు. మంత్రి చేసిన సహాయ సహకారాలువెలకట్టలేనివని యాదగిరి అన్నారు. మంత్రి సేవలు ఆందోల్ జర్నలిస్టు అందిస్తున్న సేవలను ఎల్లవేళలా గుర్తుంచుకుంటారని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యులు మునిపల్లి యాదగిరి అన్నారు.

# నిరుపయోగంగా ప్రాథమిక ఉపకేంద్రం

**- మదర్ తెరిసా విగ్రహం దగ్గర మెట్లు ఏర్పాటు చేయాలి**




కొత్తకోట ఆగస్టు 26 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట మున్సిపల్ పరిధిలోని దండగడ్డ దగ్గర గత ప్రభుత్వం 20 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఉపకేంద్రం నిరుపయోగంగా ఉందని సిపిఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ పేర్కొన్నారు 2023 సంవత్సరంలో ప్రాథమిక ఉపకేంద్రం దండు గడ్డ ప్రాంతంలోని ప్రజలకు గర్భిణీ స్త్రీలకు చిన్న పిల్లలకు సకాలంలో వైద్యం అందించాలని ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం నిర్మించిన వైద్య ఉప కేంద్ర భవనం నేటికీ ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఆరోపించారు వెంటనే ప్రాథమిక ఉప కేంద్రాన్ని ప్రారంభించి దండగడ్డ ప్రాంత నివాసులకు వైద్యము అందుబాటులో ఉండేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు అదేవిధంగా బైపాస్ రోడ్డులో మదర్ తెరిసా విగ్రహానికి జన్మదినం మరణ దినం రోజుల్లో వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛంద కార్యకర్తలు ప్రజలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించేందుకు రావడం జరుగుతుంది విగ్రహం దగ్గర మెట్లు లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన చెప్పారు మున్సిపల్ పాలకులు ప్రత్యేక నిధులు కేటాయించి మెట్లు అమర్చాలని విజ్ఞప్తి చేశారు నిన్న వెళ్ళిపోయింది రేపటికి ఇంకా సయము శీ ది ఉన్నదల్లా ఈరోజే అందుకే నీవు చేయా లా నుకున్నది ఇప్పుడే మొదలు పెట్టు కృప మరో ప్రేమ ప్రేమకు ప్రతిరూపం సేవకు అసలైన నిర్వచనం మదర్ తెరిసా అని చెప్పారు.

# సంగారెడ్డిలో బీఎల్ఏలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణ

**- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి,**

**- డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**



సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు: 26(విజన్ ఆంధ్ర )ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వచ్చే 15 రోజుల పాటు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. వారి ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో సంగారెడ్డి నియోజకవర్గ బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులకు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్పొరేషన్ చైర్మన్, ఎస్ఐఆర్ ప్రక్రియ పార్లమెంట్ కోఆర్డినేటర్ వెన్నెల గద్దర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, అసెంబ్లీ కోఆర్డినేటర్ దయాకర్, మాస్టర్ ట్రైనర్ చైతన్య ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. రెండో దశ ఎస్ఐఆర్‌లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలకు బీఎల్ఏలు తప్పనిసరిగా హాజరై ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. ఓటర్ల జాబితాలోని ఆబ్సెంట్, షిఫ్టింగ్, డెత్, డూప్లికేట్ ఓట్లను పునఃపరిశీలించడంతో పాటు అనామలిస్ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో సుమారు 64 వేల ఓట్లపై పూర్తి స్పష్టత వచ్చే వరకు క్షేత్రస్థాయిలో శ్రమించాలని నాయకులు బీఎల్ఏలకు సూచించారు. ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందని అర్హులైన ఓటర్లకు తప్పనిసరిగా ఫారం-6 అందజేసి వారి ఓటు హక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా డెత్ లేదా ఆబ్సెంట్‌గా నమోదైన ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని బీఎల్ఏలకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇదే చివరి అవకాశమని, ప్రతి ఓటు వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఎల్ఏలకు పూర్తి సహకారం అందించి ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

# జేబులో ఫోన్ ఉందా? అయితే మీ బ్యాంకు ఖాతా సేఫ్ కాదు!

**- హైదరాబాద్ లో పంజా విసురుతున్న సరికొత్త హైబ్రిడ్ ముఠా -**

**- క్షణాల్లో ఖాతా ఖాళీ..**



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 26: సైబర్ నేరగాళ్లు మరింత రెచ్చిపోయారు. ఇన్నాళ్లు ఇంట్లో కూర్చుని లింక్ పంపి, ఓటీపీ అడిగి మోసం చేసిన ముఠాలు ఇప్పుడు నేరుగా రోడ్డు మీదకే వచ్చేశాయి. మీ పక్కనే నిలబడి, మీ ఫోన్ పాస్ వర్డ్ చూసి, మీ ఫోన్ కొట్టేసి, మీ కళ్ల ముందే మీ బ్యాంకు ఖాతా ఖాళీ చేస్తున్నారు. ఈ సరికొత్త తరహా హైబ్రిడ్ ఫ్రాడ్ హైదరాబాద్ వ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ ముఠా టార్గెట్ అంతా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, రద్దీ మార్కెట్లలో ఉండే వృద్ధులు, అమాయకులు. మొదట వారి వెనుక నిలబడి ఫోన్ అన్ లాక్ ప్యాటర్న్, పిన్ ను గమనిస్తారు. తర్వాత రద్దీలో ఫోన్ చోరీ చేసి, అందులోని యూపీఐ, ఫోన్ పే, గూగుల్ పే, నెట్ బ్యాంకింగ్ ద్వారా ఉన్న డబ్బు మొత్తాన్ని నిమిషాల్లోనే మాయం చేస్తున్నారు.

**ప్రతి ఒక్కరూ బలే..:**

ఈ సైబర్ ఉచ్చులో ఇప్పటివరకు సామాన్యుల నుంచి పెద్ద పెద్ద ఉద్యోగులు, ఉన్నతాధికారులు, యువత, వృద్ధులు అనే తేడా లేకుండా వేల మంది బలయ్యారు. కోట్ల రూపాయలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. పోలీసులు రోజూ వందల అవగాహన కార్యక్రమాలు చేస్తున్నా ప్రజల్లో చైతన్యం రావడం లేదు.

**ప్రజలూ జాగ్రత్త:**


బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రదేశాల్లో మీ పక్కన అనుమానాస్పదంగా ఎవరైనా మీ ఫోన్ వైపు చూస్తున్నారా? మీ పాస్ వర్డ్ గమనిస్తున్నారా? అని గమనించండి. ఫోన్ కు బలమైన ఫేస్ లాక్, ఫింగర్ ప్రింట్ పెట్టుకోండి. ఎవరి ముందు పిన్ కొట్టకండి. అనుమానం వస్తే వెంటనే 1930 సైబర్ హెల్ప్ లైన్ కు ఫోన్ చేయండి. ఒక్క క్షణం అజాగ్రత్త.. జీవితకాల పొదుపు మాయం.






# అడ్డగోలు వసూళ్లకు మాఫియా అడ్డగా కార్పొరేట్ ఆస్పత్రులు

- డయాగ్నస్టిక్స్, స్కానింగ్ సెంటర్లలోనూ ఇష్టానుసారంగా వసూళ్లు
- జేబులు గుల్ల చేసుకుంటున్న పేద, సామాన్య ప్రజలు
- 'మామూలు'గా తీసుకుంటున్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు




వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు26(విజన్ ఆంధ్ర) : ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్స్, డయాగ్నొస్టిక్స్, స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నాయి. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు మాఫియాగా మారిపోయి గ్రామాల్లో ఆర్ఎంపీలను కమీషన్ ఏజెంట్లుగా నియమించుకుంటున్నాయి. వారి ద్వారా రోగులను రెఫర్ చేసుకొని అధిక డబ్బులు దోచుకుంటున్నాయి. వ్యాపారం లాభదాయకంగా ఉండడంతో పుట్టగొడుగుల్లా కొత్త ఆస్పత్రులు పుట్టుకొస్తున్నాయి. రోగి హాస్పిటల్‌కు వస్తే చా లు.. రకరకాల పరీక్షలు, వైద్య సేవలు, మందుల పేరు తో పేద, మధ్యతరగతి ప్రజల రక్తం తాగుతున్నాయి. వ్యాధి తీవ్రత లేకున్నా అడ్మిట్ చేసుకొని, స్పెషలిస్ట్ డాక్టర్ల పేర్లతో రోగులను మాయ చేస్తున్నాయి. అర్హత లేని వైద్యులతో చికిత్స అందిస్తూ రూ. లక్షల్లో వసూలు చేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్‌లోని జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో ఈ దోపిడీ అధికంగా, హనుమకొండ పరిధిలో ఇంకొంత ఎక్కువగా ఉంది. కాగా, హనుమకొండ జిల్లాలో ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్స్, స్కానింగ్ సెంటర్లు దాదాపు 789 ఉన్నాయి. హనుమకొండ కాకాజీకాలనీ ప్రైవేట్ ఆస్పత్రులకు అడ్డాగా మారడంతో ఉమ్మడి జిల్లా నుంచి రోగులు ఇక్కడికే వస్తుంటారు. అలాగే బాలసముద్రం, ములుగురోడ్డు, నయీంనగర్, పబ్లిక్ గార్డెన్ రోడ్డు, ఎన్‌జీవోస్‌కాలనీ రోడ్డు, సుబేదారి, రెడ్డికాలనీ, కేయూసీ, బీమారం, కాజీపేటలోని ప్రైవేట్ దవాఖానలు, క్లినిక్స్‌లోనూ నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతుండగా, కొన్నింటికి వైద్య, ఆరోగ్య శాఖ అనుమతులే లేకపోవడం గమనార్హం.

**పట్టించుకోని వైద్యాధికారులు..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యుల నిర్లక్ష్యం, సరైన చికిత్స అందక రోగులు చనిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. రోజూ ఏదో ఒకచోట బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు హాస్పిటల్ ఎదుట ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. అయినా కూడా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కార్పొరేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలకు రాజకీయ పలుకుబడి ఉన్నందున ఆ శాఖ అధికారులను మామూళ్లతో మేనేజ్ చేసి దోపిడీ దందాను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు నిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానల విషయంలోనూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్స్, డయాగ్నొస్టిక్స్, స్కానింగ్ సెంటర్ల అడ్డగోలు ఫీజుల దోపిడీని నియంత్రిచాల్సించిన అధికారులు ఎక్కడ కూడా తనిఖీలు చేయడం లేదు. 'మామూలు'గా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పెరుగుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలనే డిమాండ్లు పేద, మధ్యతరగతి ప్రజల నుంచి అధికమవుతున్నాయి.



**నిబంధనల ఉల్లంఘన..**

కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు వైద్య, ఆరోగ్య శాఖ నిబంధనలు ఏమాత్రం పాటించడంలేదు. స్పెషలిస్ట్ డాక్టర్ల పేర్లతో అనుమతులు పొంది, ఆ తర్వాత అర్హత లేని వైద్యులతో చికిత్స చేయిస్తున్నారు. డాక్టర్ల పేర్లు, ఫీజుల వివరాలు ఆస్పత్రిలో ప్రదర్శించడంతో పాటు తగిన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. కానీ ఖర్చు తగ్గించుకునేందుకు అర్హత లేని, జూనియర్ డాక్టర్లతో పరీక్షలు, సర్జరీలు చేయిస్తున్నారు. కొన్ని హాస్పిటల్స్‌లో ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లకు అనుమతి లేనప్పటికీ అర్హత లేని వారితో పరీక్షలు నిర్వహిస్తున్నారు. కొన్ని డయాగ్నిస్టిక్స్ సెంటర్లలో సైతం అర్హత లేని టెక్నీషియన్లతో పరీక్షలు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**భయపెట్టి పరీక్షలు..**

సీజనల్ వ్యాధులను అదునుగా చేసుకొని ప్రైవేట్ ఆస్పత్రులు సాధారణ జ్వరాలకు కూడా టెస్టులు చేసుకోవాలంటూ రోగులను భయానికి గురిచేస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, కిడ్నీ, లివర్ తదితర పలు రకాల టెస్టులు చేసి, వ్యాధి తీవ్రత లేకున్నా కండీషన్ సీరియస్‌గా ఉందంటూ అడ్మిట్ చేసుకొని డబ్బులు గుంజుతున్నారు. ఇక కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అడిగేవారు లేకపోవడంతో వైద్య పరీక్షలు, ల్యాబ్, స్కానింగ్, ఫార్మసీ పేరుతో అంతులేని దోపిడీకి తెగబడుతున్నారు.

# 100 డయల్ చేస్తే స్పందన కరువు...!!

- ఫోన్ చేసిన 10నిమిషాల్లోనే ఇసుక మాఫియా పరార్..
- ఉదండాపూర్ డ్యామ్ లో పట్టపగలే ఫిల్టర్ ఇసుక దందాలి
- జేసీబీలతో డ్యామ్ ను తవ్వేస్తున్న ఇసుక మాఫియా
- అధికారుల అండదండలతోనే అక్రమ తవ్వకాలా ప్రజల అనుమానం
- ఇసుక తవ్వకాలతో డ్యామ్ కు ముప్పు గాలికి వదిలేసిన అధికారులు
- ఇసుక మాఫియతో సంబంధాలు ఎవరికి...?



జడ్చర్ల, ఆగస్టు 26, (విజన్ ఆంధ్ర): జడ్చర్ల మండలం పరిధిలోని ఉదండాపూర్ డ్యామ్ లో పట్టపగలే ఫిల్టర్ ఇసుక అక్రమ తవ్వకాలు యధేచ్చగా సాగుతున్నాయి. డ్యామ్ పరిధిలో జేసీబీలతో ఇసుకను తవ్వి ఫిల్టర్ ఇసుకగా మారుస్తున్న దృశ్యం స్థానికులు కళ్లారా చూశారు, ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే 100 డయల్ కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. 100 డయల్ కు సమాచారం ఇచ్చిన కొద్దిసేపటికే డ్యామ్ లో నుండి ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్న టిప్పర్లు, జెసిబి లు అక్కడి నుండి పరారయ్యాయి. 100 డయల్ కు ఫోన్ చేసినా పోలీస్ రెవెన్యూ మైనింగ్ అధికారులు ఎవరూ సంఘటన స్థలానికి రాలేదు దీంతో ఈ వ్యవహారం వెనుక దాగి ఉన్న రహస్యం ఏమిటని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఫోన్ చేసిన నిమిషాల్లోనే వాహనాలు ఎలా పరారయ్యాయి. మాఫియాకు ముందే సమాచారం అందించింది ఎవరనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే ఇసుక మాఫియాకు సహకరిస్తున్నారా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు దఉదండాపూర్ డ్యామ్ లో ఇసుక తవ్వకాల వల్ల డ్యామ్ మట్టి కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలి

ఉదండాపూర్ డ్యామ్ లో అక్రమంగా ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి 100 డయల్ కు ఫోన్ చేసినా స్పందించని అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు ఈ అక్రమ దందా వెనుక ఎవరున్నారో బయటకు తీయాలని కోరుతున్నారు.



EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.